

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 246

సోమవారం 27-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



స్పానిష్ గోల్ఫ్ ఓపెన్ విజేత అదితి

భారత మహిళా స్టార్ గోల్ఫర్ అదితి అశోక్ ఈ ఏడాది తన ఖాతాలో రెండో టైటిల్‌ను జమ చేసుకుంది. లేడీస్ యూరోపియన్ టూర్‌లో భాగంగా ఆదివారం ముగిసిన స్పానిష్ ఓపెన్‌లో బెంగళూరుకు చెందిన అదితి విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో నిర్ణీత నాలుగు రౌండ్ల తర్వాత అదితి మొత్తం 271 షాట్‌లతో పార్ -17 స్కోరుతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఈ టోర్నీ కంటే ముందు అదితి కెన్యా ఓపెన్‌లోనూ టైటిల్‌ను సాధించింది. 2016లో ప్రొఫెషనల్‌గా మారిన 25 ఏళ్ల అదితి టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్య పతకాన్ని కోల్పోయింది.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ 'హ్యాట్రిక్'

ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' నమోదు చేసింది. లుధియానాలో ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి జట్టు 2-0తో నామ్‌ధారి ఎఫ్‌సీ జట్టుపై గెలిచింది. శ్రీనిధి జట్టు తరఫున కెప్టెన్ మునోజ్ (21వ ని.లో), జగ్‌దీప్ సింగ్ (24వ ని.లో) ఒక్కో గోల్ చేశారు.



హ్యారీ బ్రూక్‌ను వదిలేసిన సన్‌రైజర్స్

- ముంబై ఇండియన్స్‌తో పాండ్యా
- ముంబై నుంచి బెంగళూరుకు గ్రీన్



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2024 సీజన్ కోసం ఆటగాళ్లను రిటెయిన్ (అట్టిపెట్టుకోవడం) చేసుకునే గడువు ఆదివారంతో ముగిసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో పాటు పలు జట్లు తమకు భారంగా అనిపించిన ఆటగాళ్లను విడుదల చేసి డిసెంబర్ 19న దుబాయ్‌లో జరిగే వేలం కార్యక్రమం కోసం డబ్బులు సమకూర్చుకున్నాయి. గత వేలంలో ఇంగ్లండ్ డాషింగ్ క్రికెటర్ హ్యారీ బ్రూక్‌ను రూ. 13 కోట్ల 25 లక్షలకు కొనుగోలు చేసిన సన్‌రైజర్స్ జట్టు అతని ప్రదర్శన ఆశించినస్థాయిలో లేకపోవడంతో విడుదల చేసింది. బ్రూక్ 11 మ్యాచ్‌లు ఆడి కేవలం 190 పరుగులు చేశాడు. సన్‌రైజర్స్ జట్టు ఆదిల్ రషీద్ (ఇంగ్లండ్), అకీల్ హోసిన్ (వెస్టిండీస్), దేశవాళీ క్రికెటర్లు సమర్థ్ వ్యాస్, వివ్రాంత్ శర్మ, కార్తీక్ త్యాగిలను కూడా విడుదల చేసింది. వేలం కోసం ప్రస్తుతం సన్‌రైజర్స్ వద్ద రూ. 34 కోట్లు ఉన్నాయి.

- గుజరాత్ టైటాన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా తన పాత జట్టు ముంబై ఇండియన్స్‌లోకి అధికారికంగా వచ్చాడు. ముంబై ఫ్రాంచైజీ రూ. 15 కోట్లు టైటాన్స్‌కు చెల్లించి పాండ్యాను తిరిగి తీసుకుంది. అంతేకాకుండా వేలంలో ఆ్రస్టేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌పై రూ. 17 కోట్ల 50 లక్షలు వెచ్చించిన ముంబై అంతే మొత్తానికి అతడిని బెంగళూరు జట్టుకు బదిలీ చేసింది. ఆంధ్ర స్టార్ ప్లేయర్, భారత జట్టు సభ్యుడు కోన శ్రీకర్ భరత్‌తోపాటు ఒడియన్ స్మిత్, అల్జారి జోసెఫ్ (వెస్టిండీస్), దాసున్ షనక (శ్రీలంక)లను కూడా టైటాన్స్ వదులుకుంది.
- చెన్నై విజయవంతమైన సారథి ధోని, బెంగళూరు జట్టు స్టార్ కోహ్లి వచ్చే సీజన్‌లోనూ బరిలోకి దిగనున్నారు. కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన తెలుగు క్రికెటర్ అంబటి రాయుడును, ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌ను చెన్నై విడుదల చేసింది. ఆ్రస్టేలియా స్పీడ్‌స్టర్ హాజల్‌వుడ్, లంక స్పిన్నర్ హసరంగలను బెంగళూరు వదులుకుంది.
- కోల్‌కతా నైట్‌రైడర్స్ షకీబ్ అల్ హసన్ (బంగ్లాదేశ్), ఉమేశ్ యాదవ్, శార్దుల్ ఠాకూర్ (భారత్), ఫెర్గూసన్, సౌతీ (న్యూజిలాండ్)లను విడుదల చేసింది.

భారత్ ధమాకా

- చెలరేగిన యశస్వి, ఇషాన్, రుతురాజ్
- ఆఖర్లో రింకూ సింగ్ మెరుపులు
- ఆస్ట్రేలియాపై 44 పరుగులతో టీమిండియా ఘనవిజయం
- గువాహటిలో రేపు మూడో టి20


తిరువనంతపురం: స్వదేశంలో జరుగుతున్న టి20 సిరీస్‌లో భారత్ చెలరేగిపోతోంది. అంతగా అనుభవం లేని భారత జట్టు ఆస్ట్రేలియాలాంటి మేటి జట్టును అన్ని రంగాల్లో దెబ్బకొట్టి రెండో టి20లో 44 పరుగుల తేడాతో గెలిచింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 2-0తో ఆధిక్యంలో నిలిచింది. మూడో టి20 మ్యాచ్ గువాహటిలో మంగళవారం జరుగుతుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశస్వి జైస్వాల్ (25 బంతుల్లో 53; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), రుతురాజ్ గైక్వాడ్ (43 బంతుల్లో 58; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (32 బంతుల్లో 52; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగారు. తర్వాత ఆ్రస్టేలియా 20 ఓవర్లలో 9 వికెట్లకు 191 పరుగులు చేసి ఓడిపోయింది. స్టొయినిస్ (25 బంతుల్లో 45; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ మాథ్యూ వేడ్ (23 బంతుల్లో 42 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) మెరుగ్గా ఆడారు. ప్రసిధ్ కృష్ణ, రవిబిష్ణోయ్ చెరో 3 వికెట్లు తీశారు.

ఆరంభం నుంచే ధనాధన్

మూడో ఓవర్ నుంచి యశస్వి మెరుపులు మొదలవడంతో భారత్ స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. మ్యాక్స్‌వెల్ వేసిన ఆ ఓవర్లో యశస్వి 2 ఫోర్లు, రుతురాజ్ ఒక బౌండరీ బాదాడు. అబాట్ నాలుగో ఓవర్‌నైతే యశస్వి 4, 4, 4, 6, 6, 0లతో చితగ్గొట్టేశాడు. దీంతో 24 పరుగులు రాగా, 3.5 ఓవర్లో భారత్ 50 పరుగుల్ని దాటింది. ఇదే జోరులో యశస్వి 24 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాక నిష్క్రమించాడు. తర్వాత ఇషాన్ కిషన్ కూడా ధాటిగా ఆడటంతో ఓవర్‌కు 10 పైచిలుకు రన్‌రేట్‌తో భారత్ సాగిపోయింది. 9.5 ఓవర్లో భారత్ స్కోరు వందకు చేరింది. అదుపుతప్పిన బౌలింగ్‌తో మ్యాక్సీ 14వ ఓవర్లో ఏకంగా 9 బంతులేశాడు. ఇషాన్, గైక్వాడ్ చెరో సిక్సర్ బాది 23 పరుగులు పిండుకున్నారు. మరుసటి ఓవర్ తొలి బంతిని ఇషాన్ కిషన్ భారీ సిక్సర్ బాదడంతో 14.1వ ఓవర్లోనే జట్టు స్కోరు 150 పరుగుల్ని అధిగమించింది. 29 బంతుల్లో అర్ధసెంచరీ సాధించిన ఇషాన్‌ను 16వ ఓవర్లో స్టొయినిస్ అవుట్ చేశాడు. రెండు సిక్స్‌లు కొట్టిన కెప్టెన్ సూర్యకుమార్ (19) ఎక్కువసేపు నిలువలేదు. అడపాదడపా ధాటిని ప్రదర్శించిన రుతురాజ్ 39 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. డెత్ ఓవర్లలో రింకూ సింగ్ (9 బంతుల్లో 31 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ ఆటతో రెచ్చిపోయాడు. అబాట్ 19వ ఓవర్లో 4, 1వైడ్, 0, 6, 4, 4, 6లతో ఏకంగా 25 పరుగులు సాధించాడు. ఆఖరి ఓవర్ తొలి బంతికి సిక్స్ కొట్టిన రుతురాజ్ మరుసటి బంతికే అవుట్ కాగా, క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ (2 బంతుల్లో 7 నాటౌట్; 1 సిక్స్) భారీ షాట్ బాదడంతో 20 పరుగులు జతయ్యాయి.



ఇషాన్



యశస్వి జైస్వాల్

కూల్చేసిన బిష్ణోయ్, ప్రసిధ్

కొండంత లక్ష్యం కరిగించేందుకు బరిలోకి దిగిన ఆసీస్ కాసేపు ధాటిగా ఆడింది. స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను దించగానే ప్రత్యర్థి పతనం ఆరంభమైంది. స్మిత్ (19), షార్ట్ (19), ఇన్‌గ్లిస్ (2), మ్యాక్స్‌వెల్ (12)లాంటి కీలక వికెట్లను 58 పరుగులకే కోల్పోయింది. స్టొయినిస్, టిమ్ డేవిడ్ (22 బంతుల్లో 37; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు)ల పోరాటంతో స్కోరు 100 దాటింది. ఆఖరిదాకా కెప్టెన్ వేడ్ అజేయంగా నిలిచినా ప్రయోజనం లేకపోయింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) జంపా (బి) ఎలిస్ 53; రుతురాజ్ (సి) డేవిడ్ (బి) ఎలిస్ 58; ఇషాన్ (సి) ఎలిస్ (బి) స్టొయినిస్ 52; సూర్యకుమార్ (సి) స్టొయినిస్ (బి) ఎలిస్ 19; రింకూ సింగ్ (నాటౌట్) 31; తిలక్ వర్మ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 235. వికెట్ల పతనం: 1-77, 2-164, 3-189, 4-221. బౌలింగ్: స్టొయినిస్ 3-0-27-1, నాథన్ ఎలిస్ 4-0-45-3, మ్యాక్స్‌వెల్ 2-0-38-0, అబాట్ 3-0-56-0, జంపా 4-0-33-0, తన్వీర్ సంఘా 4-0-34-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: స్మిత్ (సి) యశస్వి (బి) ప్రసిధ్ 19; షార్ట్ (బి) బిష్ణోయ్ 19; ఇన్‌గ్లిస్ (సి) తిలక్ వర్మ (బి) బిష్ణోయ్ 2; మ్యాక్స్‌వెల్ (సి) యశస్వి (బి) అక్షర్ 12; స్టొయినిస్ (సి) అక్షర్ (బి) ముకేశ్ 45; టిమ్ డేవిడ్ (సి) రుతురాజ్ (బి) బిష్ణోయ్ 37; వేడ్ (నాటౌట్) 42; అబాట్ (బి) ప్రసిధ్ 1; ఎలిస్ (బి) ప్రసిధ్ 1; జంపా (బి) అర్ష్‌దీప్ 1; సంఘా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 191. వికెట్ల పతనం: 1-35, 2-39, 3-53, 4-58, 5-139, 6-148, 7-149, 8-152, 9-155. బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-46-1, ప్రసిధ్ కృష్ణ 4-0-41-3, రవి బిష్ణోయ్ 4-0-32-3, అక్షర్ పటేల్ 4-0-25-1, ముకేశ్ 4-0-43-1.

చాంపియన్ శ్రీవల్లి రష్మిక

కెరీర్‌లో తొలి ఐటీఎఫ్ సింగిల్స్ టైటిల్ నెగ్గిన హైదరాబాద్ అమ్మాయి



సాక్షి, హైదరాబాద్: టోర్నీ టోర్నీకీ తన ఆటతీరును మెరుగుపర్చుకుంటున్న హైదరాబాద్ టెన్నిస్ యువతార భమిడిపాటి శ్రీవల్లి రష్మిక కెరీర్‌లో తొలి అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. బెంగళూరులో ఆదివారం ముగిసిన మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్ టోర్నీలో 21 ఏళ్ల రష్మిక చాంపియన్‌గా అవతరించింది. గంటా 59 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో రష్మిక 6-0, 4-6, 6-3తో భారత్‌కే చెందిన జీల్ దేశాయ్‌ను ఓడించింది. ప్రస్తుత జాతీయ చాంపియన్ రష్మిక ఈ మ్యాచ్‌లో 11 ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. విజేతగా నిలిచిన రష్మికకు 3,935 డాలర్ల ప్రైజ్‌మనీతో పాటు 50 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఫలితంగా నేడు విడుదల చేసే మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో రష్మిక 181 స్థానాలు పురోగతి సాధించి 706వ ర్యాంక్ నుంచి 525వ ర్యాంక్‌కు చేరుకుంటుంది.

పోరాడి ఓడిన సాత్విక్-చిరాగ్ జోడీ

చైనా మాస్టర్స్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన భారత ద్వయం



షెన్‌జెన్ (చైనా): ఈ ఏడాది ఆరో టైటిల్ సాధించాలని ఆశించిన భారత బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి నిరాశ ఎదురైంది. ఆదివారం ముగిసిన చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో సాత్విక్-చిరాగ్ ద్వయం రన్నరప్‌గా నిలిచింది. 71 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంక్ జంట సాత్విక్-చిరాగ్ 19-21, 21-18, 19-21తో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న లియాంగ్ వె కెంగ్-వాంగ్ చాంగ్ (చైనా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. విజేతగా నిలిచిన లియాంగ్-వాంగ్ చాంగ్‌లకు 85,100 డాలర్ల (రూ.70 లక్షల 92 వేలు) ప్రైజ్‌మనీ, 11 వేల ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ సాత్విక్-చిరాగ్‌లకు 40,250 డాలర్ల (రూ. 33 లక్షల 54 వేలు) ప్రైజ్‌మనీ, 9350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది సాత్విక్-చిరాగ్ ఇండోనేసియా ఓపెన్, కొరియా ఓపెన్, స్విస్ ఓపెన్‌లలో టైటిల్స్ సాధించడంతోపాటు ఆసియా చాంపియన్‌షిప్‌లో, హాంగ్జౌ ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు గెలిచింది.

విజయంతో వెర్‌స్టాపెన్ ముగింపు



అబుదాబి: ఫార్ములావన్-2023 సీజన్‌ను ప్రపంచ చాంపియన్, రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ వెర్‌స్టాపెన్ విజయంతో ముగించాడు. చివరిదైన 22వ రేసు అబుదాబి గ్రాండ్‌ప్రిలోనూ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్ రికార్డుస్థాయిలో 19 రేసుల్లో నెగ్గాడు. మరో రెండు రేసుల్లో పెరెజ్ (రెడ్‌బుల్), కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) ఒక రేసులో నెగ్గారు. అబుదాబి గ్రాండ్‌ప్రిని 'పోల్ పొజిషన్'తో ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 58 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంట 27 నిమిషాల 02.624 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. కెరీర్‌లో 54వ గెలుపుతో వెర్‌స్టాపెన్ ఫార్ములావన్ చరిత్రలో అత్యధిక విజయాలు అందుకున్న డ్రైవర్ల జాబితాలో వెటెల్ (53)ను అధిగమించి మూడో స్థానానికి చేరుకున్నాడు. హామిల్టన్ (103), షుమాకర్ (91) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐలో 5447 సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేట్ సెంటర్ దేశవ్యాప్తంగా ఉన్న ఎస్‌బీఐ సర్కిళ్లలో సర్కిల్ బేస్డ్ ఆఫీసర్(సీబీవో) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 5447(రెగ్యులర్ ఖాళీలు-5,280, బ్యాక్‌లాగ్ ఖాళీలు-167).
» ఎస్‌బీఐ సర్కిళ్లు: అహ్మదాబాద్, అమరావతి, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, నార్త్ ఈస్టర్న్, హైదరాబాద్, జైపూర్, లక్నో, కోల్‌కతా, మహారాష్ట్ర, ముంబై మెట్రో, న్యూఢిల్లీ, తిరువనంతపురం.
» అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి. బ్యాంకింగ్ రంగంలో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
» వయసు: 31.10.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.36,000 నుంచి రూ.63,840
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ రాతపరీక్ష, స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు: గుంటూరు, కర్నూలు,విజయవాడ,విశాఖపట్నం,హైదరాబాద్
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 12.12.2023.
» వెబ్‌సైట్: www.sbi.co.in

కర్నూలు జీజీహెచ్‌లో 370 పారామెడికల్ పోస్టులు

కర్నూలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 370
» పోస్టులు: ఆఫీస్ సబార్డినేట్స్, ఈఎంటీ, కంప్యూటర్ ప్రోగ్రామర్, జనరల్ డ్యూటీ అటెండెంట్, ఫార్మసిస్ట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్‌తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: విద్యార్హత మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కార్యాలయం, కర్నూలు చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 27.11.2023.
» వెబ్‌సైట్: kurnool.ap.gov.in

ఒక్క పరీక్ష.. వేల కొలువులు!

» టీసీఎస్ ఎన్‌క్యూటీ స్కోర్‌తో ఐటీ, నాన్-ఐటీలో ఉద్యోగాలు
» 23 రంగాల్లో దాదాపు 1.6 లక్షల పోస్టులకు అవకాశం
» టీసీఎస్‌తోపాటు పలు ఎంఎన్‌సీలకు ప్రామాణికం ఈ పరీక్ష
» డిగ్రీ, పీజీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు

ఒకే ఒక్క పరీక్ష స్కోర్‌తో.. 23 రంగాల్లో లక్షన్నరకుపైగా కొలువులకు పోటీపడొచ్చు! ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్).. నేషనల్ క్వాలిఫయర్ టెస్ట్(ఎన్‌క్యూటీ) పరీక్షను నిర్వహిస్తోంది!! ఈ పరీక్షలో మంచి స్కోర్ సాధిస్తే ఐటీ, నాన్ ఐటీలో చక్కటి కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. టీసీఎస్ ఎన్‌క్యూటీ దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. డిసెంబర్ 9న పరీక్ష జరుగనుంది. ఈ నేపథ్యంలో.. టీసీఎస్ ఎన్‌క్యూటీ వివరాలు, ప్రయోజనాలు, పరీక్షలో విజయానికి మార్గాలపై ప్రత్యేక కథనం...



టీసీఎస్ సంస్థ ఆఫ్-క్యాంపస్ నియామకాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్ష.. టీసీఎస్ ఎన్‌క్యూటీ. ఈ పరీక్షను ఐటీ, బీఎఫ్ఎస్ఐ, కాగ్నిటివ్ టెస్ట్‌ల పేరుతో నిర్వహిస్తారు. దీన్ని టీసీఎస్ ఐయాన్ ఆధ్వర్యంలో ఆరేళ్ల క్రితం రూపకల్పన చేశారు. ప్రారంభంలో ఈ టెస్ట్ స్కోర్ టీసీఎస్‌లో ఉద్యోగాలకు మాత్రమే ప్రామాణికంగా నిలిచేది. ఇప్పుడు టీసీఎస్‌తోపాటు అనేక సంస్థలు ఎన్‌క్యూటీ స్కోర్ ఆధారంగా ఆఫ్ క్యాంపస్ నియామకాలు చేపడుతున్నాయి.

ఐటీ, నాన్-ఐటీ విభాగాలు

టీసీఎస్ ఎన్‌క్యూటీ స్కోర్ ఆధారంగా ఐటీతో పాటు నాన్-ఐటీ రంగాల్లోనూ కొలువులు సొంతం చేసుకునే అవకాశముంది. ఆయా సంస్థల్లో ఐటీ, నాన్-ఐటీ జాబ్స్ అందుబాటులో ఉన్నాయి. ఇలా మొత్తం 1.6 లక్షలకుపైగా ఉద్యోగాలకు పోటీ పడే అవకాశం టీసీఎస్ ఎన్‌క్యూటీ ఆధారంగా లభిస్తోంది.

అర్హతలు

2018-2024 మధ్య కాలంలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం/సెమిస్టర్‌లో ఉన్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రీ-ఫైనల్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రెండేళ్ల కంటే తక్కువ పని అనుభవం ఉన్న వారికి కూడా దరఖాస్తుకు అవకాశం ఉంది. వయసు: 30ఏళ్ల లోపు ఉండాలి.

రూ.లక్షల్లో వేతనాలు

టీసీఎస్ ఎన్‌క్యూటీ స్కోర్ ఆధారంగా కొలువులు సొంతం చేసుకున్న వారికి రూ.లక్షల్లో వార్షిక వేతనాలు లభిస్తున్నాయి. ఫ్రెషర్స్‌కు సగటున రూ. 8 లక్షలు, అనుభవం ఉన్న వారికి సగటున రూ.12 లక్షల వార్షిక వేతనం అందుతోంది.

ఎన్‌క్యూటీ మూడు విధాలుగా

టీసీఎస్ ఎన్‌క్యూటీని మూడు రకాలుగా నిర్వహిస్తారు. అవి.. ఎన్‌క్యూటీ-కాగ్నిటివ్, ఎన్‌క్యూటీ-ఐటీ, ఎన్‌క్యూటీ-బీఎఫ్ఎస్ఐ. అభ్యర్థులు తాము చేరాలనుకుంటున్న రంగాలకు అనుగుణంగా ఈ పరీక్షలను ఎంచుకోవచ్చు.

ఎన్‌క్యూటీ-కాగ్నిటివ్

ఎన్‌క్యూటీ కాగ్నిటివ్ పరీక్షను జనరల్ ఎబిలిటీ టెస్ట్‌గా పరిగణిస్తారు. ఈ టెస్ట్‌లో మూడు విభాగాలు.. న్యూమరికల్ ఎబిలిటీ (20 మార్కులు), వెర్బల్ ఎబిలిటీ (25 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ (20 మార్కులు)ల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఇలా మొత్తం 65 మార్కులకు 105 నిమిషాల్లో పరీక్ష ఉంటుంది. కాగ్నిటివ్ టెస్ట్‌లోనే సైకోమెట్రిక్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా టీసీఎస్‌తోపాటు మరెన్నో సంస్థల్లో ఐటీ/బీపీఓ; ఐటీ/ప్రొడక్ట్ సర్వీస్, బీఎఫ్ఎస్ఐ రంగాల్లో కొలువులు సొంతం చేసుకునే అవకాశం ఉంది. ఆటోమోటివ్, ఈ-కామర్స్/ఇంటర్నెట్, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్, రిటైల్, టెలికం, మార్కెటింగ్ అండ్ అడ్వర్టయిజింగ్, ఎడ్-టెక్ వంటి రంగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ఎన్‌క్యూటీ-ఐటీ

ఐటీ సంస్థల్లో ఎంట్రీ లెవల్‌లో డెవలపర్, సిస్టమ్ ఇంజనీర్, ఐటీ అనలిస్ట్ వంటి ఉద్యోగాలకు మార్గంగా ఎన్‌క్యూటీ-ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) నిలుస్తుంది. ఈ పరీక్షను పార్ట్-ఎ (ఫౌండేషన్ సెక్షన్), పార్ట్-బి (అడ్వాన్స్‌డ్ సెక్షన్)లుగా నిర్వహిస్తారు. పార్ట్-ఎ ఫౌండేషన్ సెక్షన్‌లో న్యూమరికల్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, రీజనింగ్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. 65 మార్కులకు 75 నిమిషాల్లో పరీక్ష నిర్వహిస్తారు. పార్ట్-బి అడ్వాన్స్‌డ్ సెక్షన్‌లో అడ్వాన్స్‌డ్ క్వాంటిటేటివ్ ఎబిలిటీ, అడ్వాన్స్‌డ్ రీజనింగ్ ఎబిలిటీ, అడ్వాన్స్‌డ్ కోడింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. 95 మార్కులకు 90 నిమిషాల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. వీటితోపాటు సైకోమెట్రిక్ టెస్ట్ నిర్వహిస్తారు. అదే విధంగా మోటివేషన్ టెస్ట్ కూడా ఉంటుంది. ఈ పరీక్షకు కేటాయించిన సమయం 30 నిమిషాలు. ఇలా మొత్తం 2.15 గంటల వ్యవధిలో ఎన్‌క్యూటీ-ఐటీ పరీక్షను నిర్వహిస్తారు.

ఎన్‌క్యూటీ-బీఎఫ్ఎస్ఐ

బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఇన్సూరెన్స్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి అవకాశం కల్పించే పరీక్ష.. ఎన్‌క్యూటీ-బీఎఫ్ఎస్ఐ. ఇందులో స్కోర్ ఆధారంగా బీఎఫ్ఎస్ఐ సెక్టార్‌లో అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్, అకౌంట్స్ ఆపరేషన్స్ ఆఫీసర్, డేటా అనలిస్ట్, ఫైనాన్షియల్ అనలిస్ట్, ఆపరేషన్స్ అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, టెల్లర్, క్యాషియర్ వంటి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ఎన్‌క్యూటీ-బీఎఫ్ఎస్ఐను కూడా పార్ట్-ఎ (కాగ్నిటివ్), పార్ట్-బి (బీఎఫ్ఐఎస్) పేరుతో రెండు విభాగాలుగా నిర్వహిస్తారు.

పార్ట్-ఎ కాగ్నిటివ్ టెస్ట్‌లో న్యూమరికల్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, రీజనింగ్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. 65 మార్కులకు 75 నిమిషాల వ్యవధిలో పార్ట్-ఎ ఉంటుంది. పార్ట్-బి (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, అండ్ ఇన్సూరెన్స్)లో కంప్యూటర్ ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అవేర్‌నెస్, ఇన్సూరెన్స్ అండ్ ఎకానమీ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. 75 మార్కులకు 75 నిమిషాల్లో పరీక్ష నిర్వహిస్తారు. దీంతోపాటు సైకోమెట్రిక్ టెస్ట్ కూడా ఉంటుంది.

స్కోర్‌కు రెండేళ్ల గుర్తింపు

టీసీఎస్ ఎన్‌క్యూటీ స్కోర్‌కు రెండేళ్ల గుర్తింపు ఉంటుంది. అభ్యర్థులు ఎన్నిసార్లైనా ఈ పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. ఒకసారి స్కోర్ తక్కువ వచ్చినా..దానిని మెరుగుపరచుకునేందుకు మరోసారి ఎన్‌క్యూటీకి హాజరవ్వచ్చు. ఇలా అభ్యర్థులు నిర్దిష్ట వయో పరిమితిలోపు ఎన్నిసార్లైనా పరీక్షకు హాజరై తమ స్కోర్‌ను పెంచుకునే అవకాశం ఉంది.

ఎన్‌క్యూటీ, ఐయాన్‌లలో జాబ్స్‌కు దరఖాస్తు

టీసీఎస్ ఎన్‌క్యూటీలో స్కోర్ పొందిన అభ్యర్థులు దాని ఆధారంగా టీసీఎస్ ఎన్‌క్యూటీ వెబ్‌సైట్, టీసీఎస్ ఐయాన్ వెబ్‌సైట్లలో లాగిన్ అయి.. వాటిలో రిజిస్టర్ చేసుకున్న సంస్థలు-ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. టీసీఎస్ ఎన్‌క్యూటీ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్న సంస్థలు ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఈ స్కోర్ వివరాలను అడుగుతాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:నవంబర్27,2023
- ఎన్‌క్యూటీ పరీక్షతేదీ: డిసెంబర్ 9, 2023
- పరీక్ష కేంద్రాలు: టీసీఎస్ ఐయాన్ సెంటర్లు
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://learning.tcsionhub.in/hub/nationalqualifiertest

మంచి స్కోర్‌కు మార్గమిదే

న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగంలో ఫ్రాక్షన్స్, ప్రాబబిలిటీ, సిరీస్ అండ్ ప్రోగ్రెషన్స్, యావరేజెస్, ఈక్వేషన్స్, ఏరియా, స్పేస్, పెరిమీటర్, రేషియోస్, ప్రాఫిట్ అండ్ లాస్, వర్క్ అండ్ టైమ్, టైమ్ అండ్ డిస్టెన్స్, జామెట్రీ, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, నంబర్ సిస్టమ్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎం, పర్సంటేజెస్ వంటి ప్యూర్ మ్యాథ్స్, అర్థమెటిక్‌కు సంబంధించిన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. 12వ తరగతి స్థాయిలో ప్యూర్ మ్యాథ్స్, అర్థమెటిక్ పుస్తకాలు అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

వెర్బల్ ఎబిలిటీ

యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ది ఎర్రర్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, క్లోజ్ టెస్ట్, వెర్బల్ అనాలజీస్, సెంటెన్స్ కరెక్షన్, పేరా రైటింగ్, కాంప్రహెన్షన్, ఇడియమ్స్, ఫ్రేజెస్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఇంగ్లిష్ గ్రామర్‌పై పదో తరగతి స్థాయిలో అవగాహన పొందాలి.

రీజనింగ్ ఎబిలిటీ

ఈ విభాగంలో కోడింగ్, డీ కోడింగ్, స్టేట్‌మెంట్స్ అండ్ ఆర్గ్యుమెంట్స్, బ్లడ్ రిలేషన్స్, అనాలజీ, సిరీస్, పజిల్స్, లెటర్ సిరీస్, వెన్ డయాగ్రమ్స్, విజువల్ రీజనింగ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

అడ్వాన్స్‌డ్ కోడింగ్

ఎన్‌క్యూటీ-ఐటీ పరీక్షలో ఉండే ఈ విభాగంలో రాణించడానికి అభ్యర్థులు ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా సి, సి++, జావా, పైథాన్ వంటి లాంగ్వేజ్‌లపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ అవేర్‌నెస్

ఎన్‌క్యూటీ-బీఎఫ్ఎస్ఐలో ఉండే ఈ విభాగంలో ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు బ్యాంకింగ్ రంగంలో తాజా పరిణామాలు, ఆర్థిక వ్యవస్థలో మార్పులు,నూతన ఆర్థిక విధానాలు,ఆర్‌బీఐ విధానాలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

ఇన్సూరెన్స్ అండ్ ఎకానమీ

ఎన్‌క్యూటీ-బీఎఫ్ఎస్ఐలోనే మరో విభాగంగా ఉండే ఇన్సూరెన్స్ అండ్ ఎకానమీల కోసం ఇన్సూరెన్స్ రంగంలో నూతన పరిణామాలు, ఇన్సూరెన్స్‌లు-రకాలు, ఐఆర్‌డీఏ, ఆర్థిక వ్యవస్థలో తాజా పరిణామాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

సత్యమేవ జయతే
సాక్షి
'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'
WWW.SAKSHI.COM
పేజీలు: 12+6 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 246
సోమవారం 27-11-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నిట్టనిలువుగా డ్రిల్లింగ్ మొదలు

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ సొరంగంలో 41 మంది కార్మికులను కాపాడేందుకు సహాయక బృందాలు మరో ప్రణాళికను పట్టాలెక్కించాయి. రెండు మూడు రోజులుగా శిథిలాల గుండా సమాంతరంగా చేసిన డ్రిల్లింగ్ పనులను ప్రస్తుతానికి పక్కనబెట్టేశారు.

-వివరాలు 4లో



క్లుప్తంగా...

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

- భువనగిరిలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



సాక్షి, యాదాద్రి: దేశంలో నిర్వీర్యమైన ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని కాపాడే లౌకికశక్తులైన కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను తెలంగాణలో గెలిపించాలని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం హింసాత్మకమైన పాలనను కొనసాగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. సీపీఎం అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్‌షోలో ఏచూరి మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వ పాలన గాలికి వదిలేసి అవకాశవాద రాజకీయాలు చేస్తుందని ఏచూరి ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లో దొంగలు ఉన్నారన్నారు. దేశ రక్షణ, ప్రజాస్వామ్య రక్షణ కోసం, హక్కుల కోసం పోరాటం చేసే 19 మంది సీపీఎం అభ్యర్థులు తెలంగాణ ఎన్నికల బరిలో నిలిచారన్నారు. వారందర్నీ గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎయిర్‌పోర్ట్ మెట్రోకు పీఆర్‌ఎస్‌ఐ అవార్డు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్‌కు వార్తాలేఖ ప్రతిష్టాత్మక పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా–2023 జాతీయ అవార్డు లభించింది. జూన్ 2023 త్రైమాసికానికి సంబంధించిన వార్తాలేఖలో ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ ప్రత్యేకతలు, నిర్మాణానికి ముందు చేపట్టిన పలు పనుల వివరాలు, ఎండీ ఎన్వీఎస్ రెడ్డి నిర్వహించిన క్షేత్రస్థాయి పర్యటనలు, తదితర ఆకర్షణీయమైన ఫొటోలతో ఆ ఎడిషన్‌ను ప్రచురించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఐటీసీ లిమిటెడ్ న్యూస్ లెటర్‌తో కలిపి వార్తాలేఖ సంయుక్తంగా జాతీయ స్థాయిలో ఈ మొదటి బహుమతిని అందజేశారు. ఈ మేరకు న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ ప్రజా సంబంధాల ఉత్సవంలో ఈనెల 25న హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో సీపీఆర్వో మల్లాది కృష్ణానంద్‌కు రాజ్యసభ సభ్యుడు సుధాంశు త్రివేదీ, పార్లమెంటు సభ్యుడు నరేశ్ బన్సల్ సమక్షంలో స్వామి చిదానంద సరస్వతి స్వామిజీ, రిషికేశ్ ఈ అవార్డును అందజేశారు.

బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ఆత్మహత్య

- మృతుడు నాగర్‌కర్నూల్ జిల్లా వాసి



సాక్షి, భైంసా/నాగర్‌కర్నూల్: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం క్యాంపస్ హాస్టల్‌లో జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని తూడుకుర్తికి చెందిన రామటి ప్రవీణ్ కుమార్ (19) బాసర ట్రిపుల్ ఐటీలో ఈఈఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పదో తరగతి వరకు తూడుకుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన ప్రవీణ్.. 9.8 పాయింట్లు సాధించి బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. ప్రవీణ్‌కుమార్ తండ్రి చంద్రయ్య వ్యవసాయం చేస్తుండగా, తల్లి పద్మ నాలుగు నెలల కిందటే గుండెపోటుతో చనిపోయింది. తల్లి అకాల మరణంతో కొంతకాలంగా ప్రవీణ్ కుమార్ మనస్తాపంతో ఉంటున్నాడు. చంద్రయ్య, పద్మ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా, ప్రవీణ్ మొదటి కొడుకు. ప్రవీణ్‌కు ఇటీవలే ఓటుహక్కు వచ్చింది. దీంతో ఆదివారం ఔట్‌పాస్ తీసుకుని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఇంతలోనే బీహెచ్–2లోని గదిలో ఉరివేసుకున్నాడు. వ్యక్తిగత కారణాలతోనే ప్రవీణ్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని బాసర ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణ వెల్లడించారు. ప్రవీణ్ అకాల మరణంతో అతని కుటుంబంతో పాటు గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.



కార్తీక పౌర్ణమి సందర్భంగా నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం కోనేరు వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కోటిదీపాల వెలుగులో విజయవాడ దుర్గగుడి ప్రాంగణం

ప్రధాని మోదీకి ఘనస్వాగతం

- రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలికిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- నేడు ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్న మోదీ



రేణిగుంట విమానాశ్రయంలో ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్. చిత్రంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

సాక్షి, తిరుపతి/రేణిగుంట (తిరుపతి జిల్లా)/తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం ఆదివారం రాత్రి తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఘనస్వాగతం లభించింది. ఆయనకు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించి సాదర స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని విమానాశ్రయం నుంచి బయటకు వచ్చాక కాన్వాయ్ ఆపి బీజేపీ శ్రేణులకు అభివాదం చేశారు. ఆ తర్వాత ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరి వెళ్లారు. ఇక తిరుమలకు చేరుకున్న ప్రధాని మోదీకి శ్రీ రచనా అతిథిగృహం వద్ద ఈఓ ధర్మారెడ్డి, రచనా టెలివిజన్ డైరెక్టర్ తుమ్మల రచనా స్వాగతం పలికారు. శ్రీవారిని ఆయన సోమవారం ఉదయం దర్శించుకుంటారు. ప్రధాని హోదాలో మోదీ తిరుమలకు రావడం ఇది నాలుగోసారి.

మనదే శక్తివంతమైన రాజ్యాంగం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జస్టిస్ భాస్కర్ రెడ్డి

పంజగుట్ట (హైదరాబాద్): ప్రతీ దేశానికి ఒక రాజ్యాంగం ఉంటుందని కాని అన్ని దేశాలకన్నా శక్తివంతమైన రాజ్యాంగం మనదేశానిదేనని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. న్యాయ, కార్యనిర్వాహక, శాసన వ్యవస్థలను సమ్మిళితం చేస్తూ 130 కోట్లమందిని ఏకతాటిపై నిలబెట్టడానికి ప్రధాన కారణం రాజ్యాంగంలో ఉన్న పటిష్టమైన ఆర్టికల్స్, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక సూత్రాలేనని చెప్పారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సౌత్ ఇండియా అడ్వొకేట్ జేఏసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ భాస్కర్‌రెడ్డి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మనం ఇంత స్వేచ్ఛగా మాట్లాడుతున్నామంటే అది రాజ్యాగం కల్పించిన హక్కే అన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలకు నిర్బంధ విద్య, మహిళలకు ఆస్తి హక్కు, ఉద్యోగాల్లో సమాన వాటా వంటివి కల్పించింది రాజ్యాంగమేనని తెలిపారు. మనిషికి వ్యక్తిగత స్వాతంత్య్రం లేకపోతే పరిపూర్ణ మనిషిలా జీవించేవాడు కాదన్నారు. తాను ఒక సన్నకారు రైతుబిడ్డనని, ఒక ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానని, రెడ్డి సామాజిక వర్గంలో పుట్టినప్పటికీ తాను గిరిజన, మాదిగ, మాల, మున్నూరు కాపు, ముదిరాజ్ మహాసభ, ఆటో యూనియన్‌లకు న్యాయవాదిగా పనిచేశానని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వెంకటేశ్వర్, జేఏసీ అధ్యక్షుడు ఎస్.నరేందర్, సీనియర్ న్యాయవాదులు ఉపాధ్యాయ, శ్రీనివాస్, టి.కె.శ్రీధర్, కె.ఎస్.కృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సోమ, మంగళవారాల్లో చిరుధాన్య సమ్మేళనం

ముఖ్య అతిథిగా గవర్నర్ తమిళిసై హాజరు

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం–2023 సందర్భంగా భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్)లోని న్యూట్రిహబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ చిరుధాన్యాల సమ్మేళనం ఈనెల 27, 28 తేదీల్లో నగరంలోని నోవాటెల్‌లో జరగనుంది. 'ప్రధాన జీవన స్రవంతిలోకి తిరిగి చిరుధాన్యాలు–ఇప్పుడు–2023 తర్వాత'అనే అంశంపై ఈ సమ్మేళనం, సదస్సులు నిర్వహిస్తున్నారు. 19 దేశాలకు చెందిన వందలాది మంది ప్రతినిధులు, వ్యవసాయ, ఆహార, పోషకాహార శాస్త్రవేత్తలు, ప్రభుత్వాధికారులు, రైతు సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొంటారు. మిల్లెట్ ఆహారోత్పత్తుల ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలను భాగం చేయటం లక్ష్యంగా ఈ సమ్మేళనంలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఐఐఎంఆర్ డైరెక్టర్ తారా సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు.

ఒక్క బీఆర్‌ఎస్‌పైనే చర్యలు అవాస్తవం

- అన్ని పార్టీలు, వ్యక్తుల ఫిర్యాదులపై విచారణ
- పలు ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు
- ప్రభుత్వం 10 అనుమతులు కోరగా.. ఈసీ 9 అనుమతులిచ్చింది
- మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ప్రచారం బంద్
- అంతకు ముందే బయటి వ్యక్తులు నియోజకవర్గాల నుంచి వెళ్లిపోవాలి
- రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఏర్పాట్లపై సీఈఓ వికాస్‌రాజ్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం ఒక్క బీఆర్‌ఎస్ నేతలపైనే చర్యలు తీసుకుంటోందని.. ఇతర పార్టీల నేతలపై ఫిర్యాదులొచ్చినా చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు అవాస్తవమని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్ రాజ్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు వివిధ రాజకీయ పార్టీల నుంచి 72 ఫిర్యాదులురాగా.. రెండు మినహా అన్నింటిపై విచారణ జరిపి, కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదికలను పంపామని తెలిపారు. కొన్ని ఫిర్యాదుల ఆధారంగా ఎఫ్ఐఆర్‌లు సైతం నమోదు చేశామన్నారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఏర్పాట్లపై ఆదివారం ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ పాటించాలంటూ సీఎం కేసీఆర్‌కు ఎన్నికల సంఘం జారీ చేసిన అడ్వైజరీ అన్ని రాజకీయ పార్టీలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పథకాలు, కార్యక్రమాల అమలు కోసం 10 రకాల అనుమతులు కోరగా, సీఈసీ 9 అనుమతులు ఇచ్చిందని, కేవలం ఒకే విజ్ఞప్తిని తిరస్కరించిందని వివరించారు. బీఆర్‌ఎస్ నేత, రిటైర్డ్ ఐఏఎస్ ఏకే గోయల్ ఇంట్లో ఐటీశాఖ జరిపిన తనిఖీల్లో ఏమీ లభించలేదని తెలిపారు. టీ–వర్క్స్ ప్రభుత్వ భవనంలో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించిన ఘటనపై ఈసీ ఇచ్చిన షోకాజ్ నోటీసులకు మంత్రి కేటీఆర్ నుంచి ఆదివారం మధ్యాహ్నం నాటికి వివరణ అందలేదని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి సైలెన్స్

శాసనసభ ఎన్నికల ప్రచార గడువు మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగుస్తుందని.. అప్పటి నుంచి పోలింగ్ ముగిసేవరకు 48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్ అమల్లోకి ఉంటుందని వికాస్‌రాజ్ చెప్పారు. ఈ సమయంలో టీవీ చానళ్లు, సోషల్ మీడియాలో సైతం ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ఆమోదించిన ప్రకటనలను మాత్రం వార్తాపత్రికల్లో జారీ చేయవచ్చని చెప్పారు. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైన ప్రచారం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి వివిధ నియోజకవర్గాలకు వచ్చిన బయటి వ్యక్తులు సైలెన్స్ పీరియడ్ ప్రారంభమయ్యే సరికి వెళ్లిపోవాలన్నారు. ఎన్నికల కోసం ఈవీఎంలను సిద్ధం చేశామని, ఇతర ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. పోలింగ్ సమీపించిన నేపథ్యంలో మద్యం అక్రమ నిల్వలపై దాడులను మరింత ఉధృతం చేయాలని ఎక్సైజ్ శాఖను ఆదేశించమన్నారు.

శాసనసభ ఎన్నికల ప్రక్రియ వివరాలివీ..

- శనివారం నాటికి 1,24,239 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. గత శాసనసభ ఎన్నికల్లో మొత్తంగా 1,00,135 పోస్టల్ బ్యాలెట్లే నమోదుకాగా.. ఈసారి భారీగా పెరుగుతున్నాయి.
- కొత్త ఓటర్ల కోసం ఓటరు గుర్తింపు కార్డుల ముద్రణ పూర్తయింది. ఈ ఏడాది 54.39 లక్షల కార్డులను ముద్రించారు. ఇంకా 3 లక్షల కార్డులను బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) ద్వారా పంపిణీ చేయాల్సి ఉంది.
- 119 శాసనసభ నియోజకవర్గాల్లో మొత్తం 2,290 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా.. అందులో 2,068 మంది పురుషులు, 221 మంది మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నారు.
- మొత్తం 49 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 31 జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నాలుగు చొప్పున కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.
- ఎన్నికల్లో 1.85 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 22 వేల మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. బీఎల్ఓలను కలుపుకొంటే మొత్తం 2.5లక్షల మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు.
- ఎన్నికల బందోబస్తు కోసం 45వేల మంది రాష్ట్ర పోలీసులు, 3 వేల మంది అటవీ, ఎక్సైజ్‌శాఖ సిబ్బందితోపాటు 50 కంపెనీల టీఎస్‌ఎస్పీ, 375 కంపెనీల కేంద్ర బలగాలను మోహరించనున్నారు.
- కర్ణాటక, ఏపీ, మహారాష్ట్రల నుంచి 5 వేల మంది చొప్పున, మధ్యప్రదేశ్, తమిళనాడుల నుంచి 2 వేల చొప్పున, ఛత్తీస్‌గఢ్ నుంచి 2,500 మంది కలిపి.. మొత్తంగా 23,500 మంది హోంగార్డులు రాష్ట్ర ఎన్నికల బందోబస్తు విధుల్లో పాల్గొననున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు ఎటు వైపో?

- రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల 'ఆర్టీసీ ఓట్లు'

సాక్షి, హైదరాబాద్: ఈ ఎన్నికల్లో 'ఆర్టీసీ ఓటర్లు'కీలకంగా మారబోతున్నారు. ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల వరకు ఓట్లున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో వారి సంఖ్య అధికంగా ఉంది. నగరంలోని ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో 10 వేల వరకు ఉన్నాయి. ఇలాంటి నియోజకవర్గాలు మరికొన్ని ఉన్నాయి. మిగతా ప్రాంతాల్లో అంతగా లేనప్పటికీ, వేలల్లోనే ఉండటం విశేషం. ప్రస్తుతం ఆర్టీసీలో 43 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రిటైర్ అయిన ఆర్టీసీ ఉద్యోగులు దాదాపు 20 వేలమంది ఉన్నారు. వారి కుటుంబాలకు సంబంధించి దాదాపు 2.43 లక్షల ఓట్లు ఉన్నట్టు అంచనా. గత రెండు ఎన్నికల్లో ఆర్టీసీ ఉద్యోగులు ఎక్కువగా బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలిచారు. ఈసారి వారి ఓట్లను సాధించేందుకు కాంగ్రెస్ తీవ్రంగా యత్నిస్తోంది. ఇటీవలే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన నేపథ్యంలో, బీఆర్‌ఎస్ పార్టీ వారి ఓట్లు తనకే అధికంగా వస్తాయని ఆ పార్టీ నమ్మకంగా ఉంది.

ప్రచారంలో ఆర్టీసీ ప్రస్తావన..: నష్టాల్లో కూరుకుపోయి దివాలా దిశలో ఉన్న ఆర్టీసీని ఆదుకుని తిరిగి నిలబెట్టిన ఘనత తమదే అని బీఆర్‌ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. దీనికి కౌంటర్ ఇస్తూ కాంగ్రెస్ ఆరోపణలు గుప్పిస్తోంది. ఆర్టీసీ ఉద్యోగులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం వంచించిందని, వారికి అందాల్సిన దీర్ఘకాలిక బకాయిలను కూడా చెల్లించక ఇబ్బంది పెడుతోందని చెబుతోంది. బస్సుల సంఖ్య తగ్గించి ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని, తెలంగాణ వచ్చిన తర్వాత అసలు ఆర్టీసీలో నియామకాలే చేపట్టలేదని, ఫలితంగా ఉద్యోగుల సంఖ్య తగ్గిపోయిందని పేర్కొంటోంది. ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు రుణాలు ఇస్తూ ఉపయోగపడే సహకార పరపతి సంఘం నిధులు వాడేసుకుందని, సంస్థకు ప్రభుత్వం నుంచి నిధులు రాక సహకార పరపతి సంఘం మూతపడబోతోందని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. ప్రభుత్వంలో విలీనం చేయటం ద్వారా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో వేతనాలు అందబోతున్నాయని బీఆర్‌ఎస్ చెప్తోంటే, విలీనం పేరుతో కాలయాపన చేసిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క నెల కూడా వేతనాలు అందించలేకపోయిందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. బీజేపీ కూడా ఆర్టీసీ విషయంలో ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పిస్తోంది. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనానికి మద్దతుగా ఉద్యోగులు బీఆర్‌ఎస్‌కు అండగా నిలుస్తారో, ఏళ్ల గడుస్తున్నా బకాయిలు చెల్లించక పోవటం, సీసీఎస్‌ను నిర్వీర్యం చేయటం, నియామకాలు లేకపోవటాన్ని పరిగణనలోకి తీసుకుని వేరే పార్టీలకు మద్దతుగా నిలుస్తారో వేచి చూడాలి.

ఘనంగా గ్రేటర్ రాయలసీమ వనభోజన మహోత్సవం



రాయలసీమ రత్న బిరుదు పొందిన వారితో గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ప్రతినిధులు

మియాపూర్: కార్తీకమాసం పురస్కరించుకుని మియాపూర్‌లోని నరేన్ గార్డెన్‌లో గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి రాయలసీమకు చెందినవారు కుటుంబసమేతంగా తరలివచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి, హిమాచల్‌ప్రదేశ్ మాజీ చీఫ్ జస్టిస్ ఎంఎస్ రావు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, రిటైర్డ్ జడ్జిలు జస్టిస్ రాజగోపాలరెడ్డి, జస్టిస్ శేషశయనారెడ్డి, జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.కృష్ణమోహన్‌రెడ్డి, జస్టిస్ ఎం.రంగారావు, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మిల్లెట్స్ మార్వెల్ ఫౌండర్ డాక్టర్ భరత్‌రెడ్డి, రిటైర్డ్ ఐజీ మురళీధర్‌రెడ్డి హాజరై రాయలసీమ గొప్పతనం, రాయలసీమలో పేరు ప్రఖ్యాతలు గాంచిన వ్యక్తుల గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులకు రాయలసీమరత్న బిరుదులను బహూకరించి ఘనంగా సత్కరించారు. బిరుదులు అందుకున్న వారిలో సహస్ర అవధాని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్ చాన్స్‌లర్ రాఘవరెడ్డి, శంకరనారాయణ, సాక్షి గ్రూపు డైరెక్టర్ ఈశ్వరప్రసాద్‌రెడ్డి, సామాజిక కార్యకర్తలు చంద్రికాదేవి, మాకిరెడ్డి పురుషోత్తంరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మణికొండ బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

కాంగ్రెస్‌తో కష్టాలు తెచ్చుకోవద్దు

- మంత్రి హరీశ్‌రావు
- ఆ పార్టీ వస్తే స్కాములు, కర్ఫ్యూలు తప్పవు
- మణికొండ, దుబ్బాకలో బీఆర్‌ఎస్ తరఫున మంత్రి ప్రచారం

మణికొండ/దుబ్బాకటౌన్: రాష్ట్రంలో కంటికి కనిపించే అభివృద్ధి, ఇంట్లోకి వస్తున్న సంక్షేమ పథకాలను కాదని, ఏరికోరి కాంగ్రెస్ పాలన తెచ్చుకుని కష్టాల పాలు కావద్దని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు మద్దతుగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఏ కోశానాలేదని, ఒకవేళ వస్తే విద్యుత్ కోతలు, బిల్డర్‌ల వద్ద కర్ణాటకలో మాదిరిగా చదరపు అడుగుకు రూ.80లు వసూలు, స్కాములు, కర్ఫ్యూలు తప్పవని అన్నారు. రైతులకు రైతుబంధు, బీమా, బీసీబంధు, దళితబంధు, ఇంటింటికి తాగునీరు, 24గంటల విద్యుత్, శాంతి భద్రతలు, ప్రభుత్వ ఆసుపత్రులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, న్యూట్రిషన్ కిట్‌లు ఇస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మార్చాల్సిన అవసరం ఎందుకని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ప్రతి మహిళకు గృహలక్ష్మి, రూ.400లకే గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికి రూ.15 లక్షల ఆరోగ్యబీమా, మరో లక్ష డబుల్‌బెడ్‌రూం గృహాలను ఇస్తామని హామీ ఇచ్చారు. మరో మూడు రోజులు మాత్రమే ప్రతిపక్షాలకు చెందిన నాయకులు కనిపిస్తారని, ఎన్నికలు ముగియగానే వారంతా ఢిల్లీ బాట పడతారని, ఇక్కడ ఉండేది ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ముఖ్యమంత్రి కేసీఆర్‌లు మాత్రమేనని గుర్తుంచుకోవాలన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెండు సీట్లు మాత్రమే గెలిచిందని, అక్కడి ప్రజలు ఆ పార్టీని నమ్మలేదని, అలాంటిది రాహుల్, ప్రియాంకలు ఇక్కడకు వచ్చి గొప్పలు చెపుతున్నారని ఎద్దేవా చేశారు. వారిని నమ్మి మోసపోవద్దని హరీశ్‌రావు కోరారు. వారికి దమ్ముంటే ఇప్పుడు బెంగళూరు ప్రజలతో సమావేశం పెట్టాలని సవాల్ విసిరారు. రాబోయే ఐదు సంవత్సరాలలో హైదరాబాద్ నగరం చుట్టూ నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మణికొండ, శంషాబాద్‌లకు వంద పడకల ఆసుపత్రులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, మన రాష్ట్రం, మన పాలనకే ప్రజలు పట్టం కట్టాలని.. ఢిల్లీ పార్టీలను తరమికొట్టాలని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో మరో మారు బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని, ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు ఓటు వేయాలని అన్నారు.

కేంద్రం రూ.28 వేల కోట్లు ఎగ్గొట్టింది..

రైతుల బోరు బావుల వద్ద కరెంట్ మీటర్లు పెట్టకపోవడంవల్ల తెలంగాణకు రావాల్సిన రూ.28 వేల కోట్లను కేంద్రం ఎగ్గొట్టిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి మాట్లాడారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్న కాంగ్రెస్, రాష్ట్రంలో 11 సార్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసిందని, పొరపాటున కాంగ్రెస్ వస్తే మళ్లీ చీకటి కష్టాలు వస్తాయని అన్నారు.

ఓటును అమ్ముకోవద్దు



కార్టూన్‌లతో ఓటు ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్న కార్టూనిస్టులు

- ఓటర్లకు కార్టూనిస్టుల వినతి

పంజగుట్ట (హైదరాబాద్): ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధమని, దానిని అమ్ముకోవద్దంటూ కార్టూనిస్టులు తెలంగాణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్, తెలంగాణ ఆర్టిస్ట్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆర్ట్ ఫర్ డెమొక్రసీ అంశంపై 'ఓటును అమ్ముకోవడం, భవిష్యత్‌ను అమ్ముకోవడమే'.. నినాదంతో కళాకారుల స్పందన తెలియజేశారు. ప్రముఖ కళాకారుడు ఎం.వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో కార్టూనిస్టులు శంకర్, సుభానీ, నర్సిం, చిత్ర, అక్బర్, పి.ఎస్.చారి, వెంకటేశ్, కత్తుల, సురేందర్, జె.వెంకటేష్, రాకేష్, నివాస్ చొల్లేటి, అవినాష్‌లు.. ఓటు అమ్ముకోవడం వల్ల నష్టాలను కార్టూన్ల రూపంలో వివరించారు.


'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 246

సోమవారం 27-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM



సుప్రీంకోర్టు ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఆదివారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆవిష్కరించారు.

కోర్టులను ఆశ్రయించడానికి సంకోచం వద్దు

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

- వివరాలు 4లో



నిర్మల్‌లో జరిగిన సకల జనుల విజయ సంకల్ప సభలో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్రమోదీ

'డబుల్ ఇంజన్'తోనే అభివృద్ధి

రాష్ట్రంలో తొలిసారి బీజేపీ సర్కారు ఏర్పాటుకానుంది

నిర్మల్, తూప్రాన్ బహిరంగ సభల్లో ప్రధాని నరేంద్ర మోదీ

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల తీరు సామాజిక న్యాయానికి వ్యతిరేకం
- మత ప్రాతిపదికన ఐటీ పార్క్ ఏర్పాటు చేస్తామనడం సిగ్గుచేటు
- పేదల గురించి ఆలోచించేది బీజేపీ ఒక్కటే..
- ధరణిని రద్దు చేసి 'మీభూమి' తెస్తాం.. టర్మరిక్ సిటీగా నిజామాబాద్
- నిర్మల్ కొయ్యబొమ్మల పరిశ్రమను ఆదుకుంటాం
- రాష్ట్రంలో మిల్క్ ప్రాసెసింగ్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామని హామీ
- బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి

నిర్మల్/మెదక్: తెలంగాణలో మొదటిసారిగా బీజేపీ సర్కార్ ఏర్పాటు కానుందని.. సకల జనులంతా బీజేపీ వెంటే ఉన్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలతో డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పడితే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కేవలం కుటుంబ పార్టీలు అని, బీజేపీ మాత్రం నిరంతరం పేద ప్రజల గురించే ఆలోచిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా పేదల ఆకలి తీర్చేందుకు మరో ఐదేళ్ల ఉచిత రేషన్ కొనసాగించాలని నిర్ణయించినట్టు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో, మెదక్ జిల్లా తూప్రాన్‌లో నిర్వహించిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభలలో ప్రధాని మోదీ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్న తెలంగాణను అప్పులకుప్పగా మార్చారు. నీళ్లు ఇవ్వలేదు. నియామకాలను పేపర్ లీకులు, వాయిదాలతోనే సరిపెట్టారు. కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రమే నియామకాలు జరిగాయి. సీఎం కేసీఆర్ తెలంగాణను లూటీ చేసి దేశ రాజకీయాల్లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. ఢిల్లీలో కట్టర్ ఫ్రాడ్‌తో చేతులు కలిపి లిక్కర్ స్కామ్ చేశారు. లిక్కర్ స్కామ్ చేసిన బీఆర్ఎస్, కట్టర్ ఫ్రాడ్ నాయకులను ఎవరినీ వదలబోం. ఇందులో కేసీఆర్ కుటుంబ సభ్యులపై విచారణ జరుగుతోంది. అవినీతి నాయకులు

మిగతా 3వ పేజీలో ▶


ఈ రెండు రోజులూ కీలకం



- ప్రచారం ఉధృతం చేయండి.. పోల్ మేనేజ్ మెంట్‌పై దృష్టి పెట్టండి
- గట్టి పోటీ ఇస్తున్న 45–50 సీట్లలో ఎక్కువ గెలవాలి
- బీజేపీ నేతలతో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమీక్ష

3లో

కాంగ్రెస్ అమ్ముడుపోయే పార్టీ



- అది బీఆర్ఎస్‌ను బీ టీమ్‌లా కాపాడుతోంది
- కాంగ్రెస్‌కు వేసే ప్రతి ఓటు బీఆర్ఎస్‌కే..
- రాష్ట్రంలో కేసీఆర్ సీఎం, కేంద్రంలో రాహుల్ ప్రధాని అయ్యేలా వాటి మధ్య ఒప్పందం
- అధికారంలోకి వస్తే బీసీ సీఎం.. ఎస్సీ వర్గీకరణ చేస్తాం
- గిరిజనేతరులకూ పోడు పట్టాలు ఇస్తాం.. బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు
- మక్తల్, ములుగు, భువనగిరి సభల్లో అమిత్ షా

3లో



రిస్క్ వద్దు!

- ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటినీ నెరవేర్చాం.. మంచినీరు, కరెంటు వస్తేనే కారుకు ఓటేయండి
- కర్ణాటకలో కాంగ్రెస్ జనాన్ని మోసం చేసింది.. కేసీఆర్ ఫామ్‌హౌస్ సీఎం కాదు.... ఫార్మింగ్ సీఎం
- మేం 12 సార్లు రైతుబంధు ఇచ్చాం
- కాంగ్రెస్ వస్తే 12 మంది సీఎంలు..
- ప్రభుత్వ పథకాలపై కాంగ్రెస్ దుష్ప్రచారం తిప్పికొడుతున్నాం

'సాక్షి'టీవీ లైవ్ షోలో మంత్రి హరీశ్

'జంగ్ తెలంగాణ'లో...



పేదరికం లేని తెలంగాణే నా పంతం

వందశాతం అక్షరాస్యత, నిరంతర తాగు, సాగునీరు లక్ష్యం.. వీటి కోసమే నా తండ్లాట అంతా: సీఎం కేసీఆర్

నాకు తెలంగాణ తీసుకువచ్చిన ఘనతే ఆకాశమంత పెద్దది. దానికి మించిన పదవి ఉందా? రెండుసార్లు సీఎంగా పనిచేసిన. పదేళ్లు సీఎంగా ఉన్నా. ఇక్కడ నా కంటే ఎక్కువకాలం పదవిలో ఉన్న సీఎం ఉన్నడా? 70 ఏళ్లొచ్చాయి. ఇంతకంటే జీవితంలో ఇంకేం కావాలి? పేదరికం లేని తెలంగాణే నా పంతం. అందుకే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి.

- కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతుల పాలిట శని
- వాళ్లను గెలిపిస్తే దళారీ రాజ్యం, దోపిడీయే
- కౌలు చట్టం చేస్తరట.. ఇక రైతులకు చిప్పేగతి
- తెలంగాణ తెచ్చిన పేరే నాకు ఆకాశమంత పెద్దది
- బీఆర్ఎస్‌కు భయంకరమైన మెజార్టీ రాబోతోంది
- తన అంత కాలం పనిచేసిన తెలుగు సీఎం ఎవరూ లేరని వ్యాఖ్య..
- ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రసంగం

2లో



జనవరిలో గల్ఫ్ పాలసీ తెస్తాం

గల్ఫ్ కార్మికులకు 5 లక్షల బీమా కల్పిస్తాం: కేటీఆర్

- బీడీ కార్మికుల పీఎఫ్ కటాఫ్ తేదీని మార్చి, మరో లక్ష మందికైనా పెన్షన్లు ఇస్తాం..
- ఆగం కావద్దు.. ఆలోచించి ఓటేయాలని పిలుపు

2లో

ప్రజల కష్టాలు తీరుస్తాం: యోగి



- 'డబుల్ ఇంజన్' సర్కారుతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి
- బీజేపీకి అధికారం ఇవ్వండి.. ప్రజల కష్టాలు తీరుస్తాం

- వివరాలు 3లో

30న తెలంగాణ భవిష్యత్తు తేలిపోతుంది



- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య
- అందరి సంక్షేమం కోసం పనిచేసేది కాంగ్రెస్సే
- ముషీరాబాద్, మక్తల్‌లో ప్రచారం

- వివరాలు 3లో

'ప్రజల తెలంగాణ' కల నిజం చేస్తాం

కామారెడ్డి, ఆందోల్, సంగారెడ్డి సభల్లో రాహుల్‌గాంధీ



- తొలి కేబినెట్ భేటీలోనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత
- మోదీకి అండగా నిలవడం వల్లే కేసీఆర్‌పై కేసుల్లేవు
- బీజేపీతో పోరాడుతున్నందుకు నాపై 24 కేసులు పెట్టారు
- బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటే

సాక్షి, కామారెడ్డి/సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: 'ప్రజల తెలంగాణ కల సాకారం కాబోతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ భారీ మెజారిటీతో అధికారంలోకి రాబోతోంది. తొలి మంత్రిమండలి సమావేశంలోనే ఆరు గ్యారంటీలను చట్టబద్ధం చేసి అమలు చేస్తాం' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ ఎన్నికలు దొరల తెలంగాణకు, ప్రజల తెలంగాణకు మధ్య జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో సంపదను అంతా ఒకే కుటుంబం అనుభవిస్తోందని, రీడిజైన్ పేరుతో ఒక్క ప్రాజెక్టుతోనే రూ.లక్ష కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఈ మధ్య తాను మేడిగడ్డకు వెళ్లి చూడగా పునాదులు పగిలిపోయి, డ్యాం లోపలికి కుంగిపోయి కనిపించిందన్నారు. కాళేశ్వరం కట్టింది నీళ్ల కోసం కాదని, దోచుకోవడం కోసమేనన్నారు. ధరణి పోర్టల్ ద్వారా లక్షలాది మంది రైతుల భూములను తమవారికి ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం కామారెడ్డి, సంగారెడ్డి, ఆందోల్‌లో నిర్వహించిన సభల్లో రాహుల్ ప్రసంగించారు. ఆదాయం వచ్చే ల్యాండ్, లిక్కర్, ఇరిగేషన్, ఇసుక లాంటి శాఖలన్నీ తమ చేతుల్లో పెట్టుకుని, ఇష్టారీతిన

మిగతా 8వ పేజీలో ▶



వేములవాడ, దుబ్బాకలో ఆదివారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలకు హాజరైన ప్రజలు

పేదరికం లేని తెలంగాణే నా పంతం

వందశాతం అక్షరాస్యత, నిరంతర తాగు, సాగునీరు లక్ష్యం

- వీటి కోసమే నా తండ్లాట అంతా: సీఎం కేసీఆర్
- కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతుల పాలిట శని
- జగిత్యాల, వేములవాడ, దుబ్బాక, ఖానాపూర్ ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రసంగం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, సిద్దిపేట/ఖానాపూర్: పేదరికం లేని తెలంగాణ తన పంతమని.. కేరళ తరహాలో వందశాతం అక్షరాస్యత, నిరంతరం తాగునీరు, ప్రతీ ఇంచుకు సాగునీరు రావాలనేదే తన లక్ష్యమని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. రైతాంగం గుండెల మీద చేతులు వేసుకుని నిద్రపోయే తెలంగాణ కావాలని.. దానికోసమే తాను తండ్లాడుతున్నానని, పదవి కోసం కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే దళారీ రాజ్యం వస్తుందని, తెలంగాణ ఆగమైపోతుందని వ్యాఖ్యానించారు. ఆదివారం జగిత్యాల, వేములవాడ, దుబ్బాక, ఖానాపూర్ నియోజకవర్గాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''ఎన్నికలనగానే ఆగమాగం కావొద్దు. అభ్యర్థులు, పార్టీల చరిత్ర చూసి ఓటేయాలి. అసలు ఉన్న తెలంగాణను ఊడగొట్టి, ఆంధ్రాల కలిపిందే కాంగ్రెస్ పార్టీ. ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ ఉద్యమంలో ఏడుగురు తెలంగాణ యువకులను కాల్చిచంపారు. తర్వాత 58 ఏళ్ల గోస పడ్డాం. రాష్ట్రం వచ్చాక సంక్షేమానికి పెద్దపీట వేసుకున్నాం. రూ.200 పింఛన్లను రూ.2,000 చేసుకున్నం. మళ్లీ గెలిస్తే దాన్ని రూ.5 వేలు చేసుకుందాం. రైతుబంధు సాయాన్ని రూ.16వేలు చేసుకుందాం. నీటి తీరువా రద్దు చేసి, 24 గంటల కరెంటు ఇస్తున్నాం. కల్యాణలక్ష్మి, అమ్మ ఒడి, ఉచిత ప్రసవాలు, కేసీఆర్ కిట్, రైతుబీమా, పల్లె-బస్తీ దవాఖానాలు, వంద పడకల ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు ఇలా ఎన్నో చేసుకున్నం. ఇవన్నీ కాంగ్రెస్ వారు ఎందుకు చేయలేకపోయారు? ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటున్నారు. ఎమర్జెన్సీలు, యువతను జైల్లో పెట్టడమేనా ఇందిరమ్మ రాజ్యమంటే? ఆమె పాలనలోనే కదా జగిత్యాల, సిరిసిల్లను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించింది.

కాంగ్రెస్ నేతల అసమర్థత వల్లే..

గులాబీ పార్టీ సామర్థ్యాన్ని శంకించిన నాటి మంత్రి ఎమ్మెస్సార్ ముఖం మీద రాజీనామా విసిరికొట్టాను. అప్పుడు 2.5 లక్షల మెజార్టీతో కరీంనగర్ ప్రజలు గెలిపించారు. కాంగ్రెస్ నాయకుల అసమర్థత వల్లే తెలంగాణ చాలా ఏళ్లు దుఃఖపడింది. నాడు సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణకు ఒక్క రూపాయి ఇవ్వనన్నప్పుడు ఒక్కరూ నోరు తెరవలేదు.

కాంగ్రెస్ వాళ్లది.. భూమేత!

అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. రైతుబంధు, రైతు బీమా, ఎమ్మెస్పీ ధరలకు వరి ధాన్యం కొనుగోలుకు మూలం ధరణి. దాని స్థానంలో కాంగ్రెస్ వాళ్లు తెచ్చేది భూమాత కాదు.. భూమేత. మళ్లీ దళారుల రాజ్యం వస్తుంది. కాంగ్రెస్ వాళ్లు కౌలుదారు చట్టం చేస్తరట. అలా చేస్తే రైతులు చిప్పపట్టుకుని తిరగాలి. పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి రైతుబంధు వృథా అంటున్నారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటల కరెంటు చాలంటున్నారు. కాంగ్రెస్ అంటేనే రైతుల పాలిట శని. ప్రజలు ఆలోచించి ఓటేయాలి.

అసైన్డ్ భూములకు పట్టాలిస్తాం

బీఆర్ఎస్ సర్కారు అసైన్డ్ భూములను లాక్కుంటోందని బీజేపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. అది అవాస్తవం. మేం మళ్లీ అధికారంలోకి వస్తే అసైన్డ్ భూములకు పట్టాలిస్తాం. దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే.. తెలంగాణకు ఒక్కటీ ఇవ్వలేదు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీకి 100 ఉత్తరాలు రాసినా ఇవ్వలేదు. అలాంటి బీజేపీకి ఒక్క ఓటు కూడా వేయొద్దు. వేస్తే మోరీలో పడేసినట్టే.

వేములవాడ ముఖచిత్రం మారుస్తా..

వేములవాడతో నాది ప్రత్యేక అనుబంధం. ఇక్కడి రాజన్న గుడిలోనే నా వివాహం జరిగింది. కోర్టు కేసుల కారణంగా ఎమ్మెల్యే రమేశ్‌బాబును మార్చాల్సి వచ్చింది. వేములవాడ ముఖచిత్రం మార్చే బాధ్యత నాది. ఇక్కడి మూలవాగు, తల్లికోట సూరమ్మ ప్రాజెక్టులను అభివృద్ధి చేసుకుందాం. మల్కపేట రిజర్వాయర్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. జగిత్యాల జిల్లాను కరీంనగర్ తరహాలో అభివృద్ధి చేసుకుందాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరు చేసుకుందాం.

తండాలను పంచాయతీలు చేశాం

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే తండాలను పంచాయతీలుగా చేసి గిరిజనుల కల సాకారం చేశాం. గిరిజనుల ఆత్మగౌరవ ప్రతీకగా బంజారాహిల్స్‌లో బంజారా భవన్‌తోపాటు పక్కనే కుమురంభీం భవన్ నిర్మించాం. పోడు పట్టాలిచ్చాం, వాటికి రైతుబంధు, రైతుబీమా కూడా వర్తింపజేస్తున్నాం. కాంగ్రెస్‌వన్నీ వట్టి మాటలే. బీఆర్ఎస్ భయంకరమైన మెజార్టీతో గెలుస్తోంది..'' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. జగిత్యాలలో డాక్టర్ సంజయ్‌కుమార్, వేములవాడలో చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఖానాపూర్‌లో జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరారు.

కబ్జాకోర్లు కావాలా.. ప్రశ్నించే గొంతుక కావాలా?

- కరీంనగర్ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి: బండి సంజయ్
- బీఆర్ఎస్ అభ్యర్థి గంగులపై అవినీతి, అక్రమాస్తుల కేసులు
- బ్రాహ్మణ, రెడ్డి, ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనాల్లో సంజయ్



సంజయ్‌ను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

సాక్షి, కరీంనగర్: ''కరీంనగర్ ప్రమాదంలో పడింది. భూకబ్జాదారులు, చీటర్లు, అవినీతి కేసులున్న వారు కాంగ్రెస్, బీఆర్ఎస్ పక్షాన పోటీచేస్తున్నారు. నేను ధర్మం కోసం, ప్రజా సమస్యలపై పోరాడుతున్నాను. ఎటువైపు ఉంటారో ప్రజలు తేల్చుకోవాలి'' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ ప్రజలను కోరారు. ఆదివారం ఆయన కరీంనగర్‌లో వేర్వేరుగా నిర్వహించిన బ్రాహ్మణ, రెడ్డి, ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొని మాట్లాడారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థికి కరీంనగర్ నియోజకవర్గం గురించి ఏమీ తెలియదని, తెలిసిందల్లా భూకబ్జాలు చేయడమేనని ఆరోపించారు. ఆయనపై 27 కేసులున్నయని, అవన్నీ కబ్జాలు, ఫోర్జరీ కేసులేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌పైనా అవినీతి, అక్రమ ఆస్తుల కేసులు ఉన్నాయని చెప్పారు. వారు ఎప్పుడూ ప్రజల కోసం కొట్లాడలేదన్నారు. అదే తనపై 74 కేసులు ఉన్నాయని.. అవన్నీ పేదలు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, విద్యార్థుల కోసం కొట్లాడితే సీఎం కేసీఆర్ పెట్టించినవని పేర్కొన్నారు.

భారీగా నిధులు తీసుకొచ్చా..

ఎంపీగా కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గానికి దాదాపు రూ.9 వేల కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చానని బండి సంజయ్ చెప్పారు. కరీంనగర్-జగిత్యాల, కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి నిర్మాణానికి, స్మార్ట్ సిటీకి నిధులు తెచ్చానని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు వ్యాపారులను బెదిరించి వసూళ్లు చేయడం తప్ప మరేమీ చేయలేదని ఆరోపించారు. వారు మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారని, మోసపోకుండా తనకు ఓటేసి ప్రశ్నించే గొంతుకను కాపాడుకోవాలని ప్రజలను కోరారు.

ఆ రెండు పార్టీలూ ఒక్కటే..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి కంటే కేసీఆర్ ఉత్తమమని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యాఖ్యానించడాన్ని బట్టి బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటేనన్న విషయాన్ని అర్థం చేసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ పేర్కొన్నారు. గతంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు కూడా అదేవిధంగా మాట్లాడారని, ఇప్పుడు అరవింద్ వ్యాఖ్యలతో మరోమారు బీజేపీ, బీఆర్ఎస్‌ల బంధం బట్టబయలైందని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీనే అధికారంలో ఉండాలని బీజేపీ కోరుకుంటోందని స్పష్టం చేశారు. ఈ రెండు పార్టీల మోసాన్ని తెలంగాణ ప్రజలు గ్రహించాలని చరణ్‌కౌశిక్ విజ్ఞప్తి చేశారు.

పోస్టల్ బ్యాలెట్‌కు ఆందోళనలు చేయాలా?

టీపీసీసీ నేత నిరంజన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని, వెంటనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వాలని టీపీసీసీ నేత నిరంజన్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. దీనిపై గతంలోనే లేఖలు రాశామని, ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకునే హక్కు ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వాలంటూ ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు.

4న జాబ్ కేలండర్ ఇస్తాం

- రాహుల్ తన ఉద్యోగం కోసం యువతను రెచ్చగొడుతున్నారు: మంత్రి కేటీఆర్
- ఈనెల 29న దేశ విదేశాల్లో దీక్షా దివస్ నిర్వహిస్తాం



సాక్షి, హైదరాబాద్: 'కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన ఉద్యోగం కోసం యువతను రెచ్చగొడుతున్నారు. కాంగ్రెస్ విడుదల చేసిన జాబ్ కేలండర్ పెద్ద జోక్. పార్లమెంటు ఎన్నికల కోడ్ ఉంటుందని తెలిసీ ఏప్రిల్‌లో నోటిఫికేషన్ ఇస్తామని చెప్పడం ప్రజలను ఏప్రిల్ ఫూల్స్ చేయడమే, అది పప్పూ కేలండర్'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన వెంటనే 2.50 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పినా నేటికీ ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు. తెలంగాణలో గత పదేళ్లలో ఏటా సగటున 16 వేల చొప్పున 1.60లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు సగటున ఏటా వేయి ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసింది'అని చెప్పారు. రాహుల్, రేవంత్‌రెడ్డి ఏనాడైనా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసి పరీక్షలు రాశారా అని ప్రశ్నించారు. కేటీఆర్ ఆదివారం పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. డిసెంబర్ 4న తానే స్వయంగా అశోక్‌నగర్‌కు అధికారులతోపాటు వెళ్లి యువతతో సమావేశమై జాబ్ కేలండర్‌ను రూపొందిస్తామని ప్రకటించారు.

29న దీక్షా దివస్

'స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష. తన నిరాహార దీక్షతో తెలంగాణ జాతిని ఏకం చేసిన కేసీఆర్ నవంబర్ 29 దీక్షతో ఉద్యమ చరిత్రను మలుపు తిప్పారు. ఎత్తిన జెండాను దించితే రాళ్లతో కొట్టండి అని చెప్పిన ధీశాలి కేసీఆర్. ఉక్కు సంకల్పం కలిగిన కేసీఆర్ చేసిన దీక్ష తెలంగాణ సమాజంలో సబ్బండ వర్గాలను కదిలించింది. ఢిల్లీ మెడలు వంచడంలో కీలకమైన నవంబర్ 29న పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రతి ఇంటిపై గులాబీ జెండా ఎగరాలి. అనేక రాజకీయ పార్టీలు వచ్చి కనుమరుగైనా ఎత్తిన జెండా దించకుండా తెలంగాణ సాధించిన ఘనత కేసీఆర్‌దే. 14 ఏళ్లుగా దీక్షా దివస్ జరుపుకుంటున్న రీతిలోనే నవంబర్ 29న అమరుల త్యాగాలు, కేసీఆర్ పోరాట స్ఫూర్తిని మరోమారు తెలియజేయాలి. విముక్తి పోరాటంలో సమున్నత సందర్భాన్ని చాటేలా దేశ విదేశాల్లో దీక్షా దివస్ నిర్వహించాలి. అమరుడు శ్రీకాంతాచారిని స్మరించుకుంటూ తెలంగాణ తల్లి విగ్రహాలకు పూల మాలలు వేయాలి'అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

బీజేపీతో రేవంత్ లోపాయికారీ ఒప్పందం

'ప్రధాని మోదీని ప్రశ్నించే దమ్ము టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి లేదు. ఆయనకు బీజేపీతో లోపాయికారీ ఒప్పందం ఉంది. గోషామహల్, కరీంనగర్, కోరుట్లలో బీజేపీపై కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను నిలబెట్టింది. గతంలో బీజేపీ గెలుచుకున్న గోషామహల్‌తోపాటు కరీంనగర్, కోరుట్లలో కూడా బీఆర్ఎస్ గెలుస్తోంది. తెలంగాణలో బీజేపీకి ఒక్క సీటు దక్కకుండా గెలిచి తీరుతాం. రైతుబంధు కొత్త పథకం కాకపోయినా అభ్యంతరం చెబుతున్న రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి కిసాన్ యోజన డబ్బుల గురించి ఎందుకు మాట్లాడటం లేదు. ఐటీ దాడులు అన్ని పార్టీల నేతల మీద జరుగుతున్నా కేవలం కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకున్నారని రేవంత్ చెప్పడం విడ్డూరం. బీజేపీని నిలువరించే శక్తి ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉంది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ, ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడులో స్టాలిన్, తెలంగాణలో కేసీఆర్‌కు బీజేపీని ఎదుర్కొనే సత్తా ఉంది'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

కేసీఆర్ ఓడిపోతే ఆంధ్రా పాలన

మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్ రూరల్: సీఎం కేసీఆర్ ఓడిపోతే మళ్లీ తెలంగాణలో ఆంధ్రా పాలన మొదలవుతుందని కరీంనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్ మండలం దుర్శేడ్, ఇరుకుల్ల, వల్లంపహాడ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ ముసుగులో వస్తున్న ఆంధ్రా నాయకులను తరిమికొట్టాలని కోరారు. వాళ్ల మాటలను నమ్మి ఓట్లేస్తే మళ్లీ తెలంగాణ చీకటి అవుతుందని హెచ్చరించారు. ఒక్క తప్పు చేస్తే యాభైఏళ్ల దరిద్రాన్ని చూడాల్సి వస్తుందని గంగుల తెలిపారు. మరోసారి కేసీఆర్‌ను గెలిపించి తెలంగాణను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఎన్నికల్లో భార్య పుస్తెలమ్మి పోటీ చేశానన్న బండి సంజయ్‌కి ఇప్పుడు వేలకోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని నిలదీశారు. సంజయ్ మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని మాయమవుతాడన్నారు. ఎంపీగా గెలిచి నాలుగున్నరేళ్ల గ్రామాలకు ఎందుకు రాలేదో చెప్పాలని గంగుల డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేస్తే మీ భూములన్నింటినీ మాయం చేస్తారని ఆరోపించారు.

కేసీఆర్ ప్రాణం నిలబెడితే మోసం చేశారు: మందకృష్ణ

హన్మకొండ/వరంగల్ చౌరస్తా: 'తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపడితే.. ప్రొఫెసర్ జయశంకర్‌తో కలిసి దీక్ష విరమింపజేసి ప్రాణం నిలబెట్టాను. కానీ ఆయన సీఎం అయ్యాక దళితులను మోసం చేశారు'అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఆదివారం హనుమకొండలో జరిగిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. దళితున్ని సీఎం చేస్తానని, అసైన్డ్ భూములు గుంజుకుని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోతానని మాట తప్పారని మందకృష్ణ ధ్వజమెత్తారు. 30ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ఎస్సీ వర్గీకరణ సమస్యపై ప్రధాని మోదీ స్పష్టమైన హామీ ఇచ్చారని, మాదిగలంతా బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు.

జనవరిలో గల్ఫ్ పాలసీ తెస్తాం

గల్ఫ్ కార్మికులకు రూ.5 లక్షల బీమా కల్పిస్తాం: మంత్రి కేటీఆర్

- బీడీ కార్మికుల పీఎఫ్ కటాఫ్ తేదీని మార్చి మరో లక్ష మందికైనా పెన్షన్లు ఇస్తాం..
- కాంగ్రెస్, బీజేపీలవి డ్రామాలు
- ఈ ఎన్నికలు మార్చిలో ఫెయిలైతే.. సెప్టెంబరులో రాసే పరీక్షల్లాంటివి కాదు..
- ఆగం కావద్దు.. ఆలోచించి ఓటేయాలని పిలుపు
- రాజన్న సిరిసిల్ల, మెదక్ జిల్లాల్లో ప్రచారం



సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల/నర్సాపూర్: తెలంగాణలో గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక గల్ఫ్ పాలసీని తెస్తామని ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారక రామారావు అన్నారు. గల్ఫ్ కార్మికులకు రైతుబంధు తరహాలో రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గల్ఫ్ కార్మికులు చనిపోతే, వారి కుటుంబాలకు రూ.5 లక్షలిస్తామన్నారు. జనవరిలో సమగ్ర గల్ఫ్ పాలసీ తెచ్చి వలస కార్మికుల సంక్షేమానికి బాటలు వేస్తామని చెప్పారు.

దేశంలోని 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులుంటే ఏ రాష్ట్రంలోనూ పెన్షన్ ఇవ్వడం లేదని, తెలంగాణలోనే ఇస్తున్నామని చెప్పారు. బీడీ కార్మికుల పీఎఫ్ కటాఫ్ తేదీని మార్చి మరో లక్ష మందికైనా పెన్షన్ ఇస్తామన్నారు. జనవరి, ఫిబ్రవరిలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామని, వాటిపై 93 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఆదివారం కేటీఆర్ రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఆదివారం నిర్వహించిన రోడ్ షోలు, సభల్లో మాట్లాడారు. 'ఇవి మామూలు ఎన్నికలు కావు. మార్చిలో ఫెయిలైతే సెప్టెంబరులో రాసే పరీక్షల్లాంటివి కాదు. ఐదేళ్ల మీ తలరాతను రాసే ఎన్నికలు. ఆగం కావద్దు.. సంక్షేమం.. అభివృద్ధి కొనసాగాలంటే.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా కొనసాగాలి'అని కేటీఆర్ చెప్పారు. రైతుబంధు దుబారా అని కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారని, ధరణి తీసేసి భూమాత తెస్తామని భట్టి విక్రమార్క అంటున్నారని, మళ్లీ దళారీ వ్యవస్థను తేవాలని చూస్తున్నారని కేటీఆర్ చెప్పారు. వ్యవసాయానికి మూడే గంటల కరెంట్ చాలని రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, పొరపాటున కాంగ్రెస్ వస్తే.. మళ్లీ పవర్ హాలిడేలు.. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడాలు ఉంటాయన్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కరెంటు కనిపిస్త లేదంటున్నాడని, ఎక్కడైనా కరెంటు కనిపిస్తదా అని ఎద్దేవా చేశారు. ఒక్కసారి కరెంటు లైన్‌ను పట్టుకుంటే కరెంటు ఉందో లేదో తెలుస్తుందని, షాక్ కొట్టి పోతే రాష్ట్రానికి దరిద్రం పోతుందన్నారు. రైతులకు రూ.14 వేల కోట్ల రుణమాఫీ అయిందని, ఇంకా కొంత పెండింగ్‌లో ఉందని అది కూడా పూర్తవుతుందని చెప్పారు. రైతుబంధు ఒకటి, రెండురోజుల్లో జమ అవుతుందని వివరించారు.

మోదీ 15 లక్షలు వేశారా?

ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీజేపీ నాయకులు డ్రామాలు వేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. 2014లో తమ ప్రభుత్వం రాగానే అందరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని ప్రధాని మోదీ చెప్పారని, ఎవరి ఖాతాల్లోనైనా పైసలు పడ్డాయా అని ప్రజలను ప్రశ్నించారు. అలాగే, గ్యాస్ ధర తగ్గిస్తామని చెప్పి, రూ.400 ఉన్న సిలిండర్ ధరను రూ.1,200కు పెంచారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రాగానే రూ.400కే సిలిండర్ ఇచ్చి మిగిలిన రూ.800 తమ ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఒక్కసారి చాన్స్ ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారని 50 ఏళ్లలో 11 సార్లు చాన్స్ ఇస్తే ఏం చేశారని నిలదీశారు. రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకున్నారని, బీసీ బిడ్డ గాలి అనిల్‌కుమార్ గొంతు కోసి టికెట్ అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమాల్లో నర్సాపూర్ పార్టీ అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇదండీ సంగతి



ఇంకా మూడు రోజులే ఉంటే మాకేంటీ.. ఇలా అర్ధరాత్రి వస్తే ఎలా..?

నేడు మోదీ, అమిత్‌షా సహా ముఖ్యనేతల ప్రచారం

మహబూబాబాద్, కరీంనగర్‌లలో మోదీ బహిరంగసభ

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సహా కొందరు కేంద్రమంత్రులు, బీజేపీ పాలిత సీఎంలు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు. మహబూబాబాద్, కరీంనగర్‌లలో బహిరంగసభలతో పాటు హైదరాబాద్‌లో మోదీ రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో కోటి దీపోత్సవంలో పాల్గొని, ఓ గురుద్వారాను సందర్శించిన అనంతరం ఢిల్లీకి తిరుగు పయనమవుతారు. హుజూరాబాద్‌లో బహిరంగసభ, పెద్దపల్లి, మంచిర్యాలలో అమిత్‌షా రోడ్‌షో నిర్వహించిన అనంతరం బేగంపేట నుంచి ఢిల్లీ వెళ్తారు. సోమవారం ఉదయం జగిత్యాలలో రోడ్‌షో అనంతరం బోధన్, బాన్సువాడ, జుక్కల్‌లో నిర్వహించే బహిరంగసభలో జేపీ నడ్డా పాల్గొంటారు. దేవరకద్ర, మంథని సభల్లో, పరకాలలో రోడ్‌షో అసోం సీఎం హిమంత బిశ్వశర్మ నిర్వహించనున్నారు. హనుమకొండలోని విష్ణుపురి గార్డెన్స్‌లో ఐటీ ఇంటలెక్చువల్ మీట్‌లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖమంత్రి పీయూష్ గోయల్ పాల్గొంటారు. సిద్దిపేటలో నిర్వహించే ఎన్నికల ప్రచారంలో కేంద్ర సమాచార, క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ పాల్గొంటారు. అలంపూర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి వి.మురళీధరన్ హాజరవుతారు.

మీ స్వలాభం కోసమే జిల్లాల విభజన!

- జిల్లాల విభజనపై ఓ శ్వేతపత్రం విడుదల చేయగలరా?
- లేదంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించగలరా?
- సీఎం కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: 'పది ఉమ్మడి జిల్లాలను 33 జిల్లాలుగా మార్చి ప్రజలను గాలికి వదిలేశారు. అందుకే.. మీ అశాస్త్రీయ పరిపాలనను తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ జిల్లాల విభజనపై ఓ శ్వేతపత్రం విడుదల చేయగలరా? లేదంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించగలరా?' అని సీఎం కేసీఆర్‌కు కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. 'ప్రజల అవసరాలకు అనుగుణంగా కాకుండా.. మీ ఆలోచనలు, మీ నాయకుల స్వలాభం కోసం జిల్లాల విభజన జరిగింది' అని ఆదివారం సీఎంకు రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు. 'చాలామంది ప్రజాప్రతినిధులు భూములను బినామీ పేర్లతో కొని జిల్లాలను ఏర్పాటు చేయించుకున్నారు. ఇప్పుడు చాలా జిల్లాల కార్యాలయాలు ఆయా భూములకు దగ్గర్లోనే వెలిశాయి. అసలు చిన్న జిల్లాలను ఏర్పాటు చేయమని మిమ్మల్ని ఎవరడిగారు? ఇదే ఇప్పుడు తెలంగాణ ప్రజలను తొలుస్తున్న మిలియన్ డాలర్ల ప్రశ్న' అని అన్నారు. 'ఎవరూ కోరకుండానే కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ మొదలుపెట్టారు. మీ అనుచరుడైన ఓ ప్రముఖ వ్యక్తికి కావలసిన సహకారం అందించేందుకు రంగారెడ్డి జిల్లాను, పాలమూరు జిల్లాను హత్య చేసి 'కొత్త రంగారెడ్డి' జిల్లాను సృష్టించి ఇచ్చారు. ఇది ప్రజలకు అర్థం కాకుండా మీ పార్టీ వారిచేత ఎక్కడికక్కడ ఆందోళనలు జరిపించారు' అని ఈ లేఖలో పేర్కొన్నారు. అవసరం ఉన్నా, లేకున్నా ఒక్కో జిల్లాను నాలుగు జిల్లాలుగా మార్చి పరిపాలనను అస్తవ్యస్తం చేశారని మండిపడ్డారు. 'ఈ కొత్త జిల్లాల అధికార యంత్రాంగం చేస్తున్న పాలనాపరమైన తప్పులతో ప్రజలు విసిగిపోతున్నారు. ఈ విసుగు.. ఓచోట తహసీల్దార్‌ను కిరోసిన్ పోసి తగలబెట్టేసేంతవరకు పెరిగింది. ఇంకొన్ని చోట్ల ఎందరో రైతుల భూములు.. వారి పేర్లతో నమోదు కావడం లేదు. వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా మీకు పట్టింపులేదు' అని ఆందోళన వెలిబుచ్చారు. అలాగే ప్రతి నియోజకవర్గ ఎమ్మెల్యేకు కట్టించిన ఎమ్మెల్యేల అధికార కేంద్రం నుంచి ఎంత మంది పాలన కొనసాగిస్తున్నారో.. మీరు చెప్పగలరా?' అని ప్రశ్నించారు.

ఆ రెండు చోట్లా బీజేపీదే గెలుపు

కామారెడ్డి, గజ్వేల్ స్థానాలపై ప్రకాశ్ జవదేకర్ ధీమా



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్‌కు గజ్వేల్, కామారెడ్డిలలో ఓటమి తథ్యమని, ఈ రెండు చోట్లా బీజేపీ గెలవబోతోందని ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. కామారెడ్డిలో కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓడిపోవడం ఖాయమని, గజ్వేల్‌లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుస్తారని పేర్కొన్నారు. తెలంగాణలో రోజురోజుకూ రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయని చెప్పారు. ఎన్నికల ఫలితాలు ఎవరి అంచనాలకు అందనంత స్థాయిలో రాబోతున్నాయన్నారు. ఆదివారం ఇక్కడ బీజేపీ మీడియా సెంటర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. నిరుద్యోగులు ఉద్యోగాల భర్తీపై ఆశలు పెట్టుకుంటే, వాటిని పూర్తిగా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో దశాబ్దాలుగా సాగిన తెలంగాణ ఉద్యమానికి గుర్తింపు లేకుండాపోయిందని విచారం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ అమ్ముడుపోయే పార్టీ

- అది బీఆర్‌ఎస్‌ను బీ టీమ్‌లా కాపాడుతోంది
- మక్తల్, ములుగు, భువనగిరి సభల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- మేం అధికారంలోకి వస్తే బీసీ సీఎం .. ఎస్సీ వర్గీకరణ చేస్తాం
- గిరిజనేతరులకూ పోడు పట్టాలు
- డబుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధి అని వ్యాఖ్య



భువనగిరి నియోజకవర్గం పరిధిలోని రాయిగిరిలో బీజేపీ విజయ సంకల్ప సభకు హాజరైన జనం

సాక్షి, యాదాద్రి/నారాయణపేట/ములుగు: కాంగ్రెస్ అంటేనే అమ్ముడుపోయే పార్టీ అని, అది తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను బీ టీమ్‌లా కాపాడుతోందని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బీఆర్‌ఎస్‌కు వేసినట్టేనని, ఆ రెండింటికీ చెక్‌పెట్టి బీజేపీని గెలిపించాలని కోరారు. మూసీ నదిలా తెలంగాణ మొత్తాన్ని కేసీఆర్ అవినీతితో కలుషితం చేశారని.. ఈ అవినీతి కాలుష్యాన్ని శుద్ధి చేయాలంటే బీజేపీకి అధికారం అప్పగించాలని పేర్కొన్నారు. ఆదివారం మక్తల్, ములుగు, భువనగిరి నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభల్లో అమిత్‌షా మాట్లాడారు. నారాయణపేట సభలో కురుమూర్తిస్వామి, జోగుళాంబదేవి, సంగమేశ్వర స్వామికి.. ములుగు సభలో సమ్మక్క–సారలమ్మ, రామలింగేశ్వరస్వామికి నమస్కరిస్తున్నా అంటూ అమిత్ షా తన ప్రసంగాలను ప్రారంభించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''ఇవి తెలంగాణ భవిష్యత్ కోసం జరుగుతున్న ఎన్నికలు. ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలి. కేసీఆర్ సర్కారు గత పదేళ్లలో అవినీతిలో కూరుకుపోయింది. కుంభకోణాల మయంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టులో, మియాపూర్ భూముల్లో వేల కోట్లు దోచుకున్నారు. బీఆర్‌ఎస్ వీఆర్‌ఎస్ తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. కేసీఆర్ భూకబ్జాల కారును గ్యారేజీకి పంపిస్తాం. కేసీఆర్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి జైలుకు పంపిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని కేసీఆర్ అబద్ధాలు చెప్తున్నారు. అసలు కేసీఆర్ జాతీయ హోదా కోసం ఒక్కనాడు కూడా ప్రధాని మోదీని కలవలేదు.

'డబుల్ ఇంజన్'తో రాష్ట్రం నంబర్‌వన్

రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలని కోరుకుందాం. దేశాన్ని సురక్షితంగా అభివృద్ధిపథంలో నడిపిస్తున్న మోదీని 2024లో మరోసారి ప్రధాని చేసుకుందాం. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారుతో తెలంగాణను నంబర్‌వన్‌గా అభివృద్ధి చేసుకుందాం. బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య డీల్..

కాంగ్రెస్‌కు వేసే ప్రతి ఓటు బీఆర్‌ఎస్‌కు వేసినట్లే. వారిలో ఎవరికి ఓటు వేసినా ఒక్కటే. కాంగ్రెస్ అమ్ముడుపోయే పార్టీ. అది బీఆర్‌ఎస్‌ను బీ టీంలా కాపాడుతోంది. కేంద్ర, రాష్ట్రాల్లో వారి మధ్య అధికారాన్ని పంచుకునే డీల్ కుదిరింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎలాగూ అధికారంలోకి రాదు. ఆ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ఇక్కడ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తారు. బీఆర్‌ఎస్ రాబోయే రోజుల్లో కేంద్రంలో రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాలనేది ఒప్పందం.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తాం

తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తాం. ఎస్సీ వర్గీకరణ చేపడతాం. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తాం. కేసీఆర్ రజాకార్ల పార్టీ ఎంఐఎంకు భయపడి విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదు. మేం అధికారంలోకి రాగానే సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తాం. బీఆర్‌ఎస్ ఇస్తున్న నాలుగు శాతం ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేసి ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెంచుతాం. మేం అధికారంలోకి రాగానే గిరిజనేతరులకు సైతం ఆంక్షలు లేని పోడుపట్టాలు జారీ చేస్తాం. గిరిజన రైతులకు రూ.12 వేల చొప్పున అందజేస్తాం.

అయోధ్యలో రాముడి దర్శనం చేయిస్తాం

భవ్యమైన, దివ్యమైన అయోధ్యలో రామమందిరం నిర్మాణం జరుగుతోంది. జనవరి 22న ప్రాణప్రతిష్ఠ జరగనుంది. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇక్కడి ప్రజలకు ఉచితంగా అయోధ్య ప్రయాణం, వసతి, దర్శనం కల్పిస్తాం..'' అని అమిత్ షా ప్రకటించారు.



షాపూర్‌నగర్‌లో యోగి ఆదిత్యనాథ్ రోడ్‌షోకు హాజరైన జనం (ఇన్‌సెట్లో) యోగి, కూన శ్రీశైలంగౌడ్

ప్రజల కష్టాలు తీరుస్తాం: యోగి

- యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్
- ఆమనగల్లు, మహబూబ్‌నగర్, కర్మన్‌ఘాట్, కుత్బుల్లాపూర్‌లో ప్రచారం

ఆమనగల్లు, సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్, ఎల్బీనగర్/లింగోజిగూడ, కుత్బుల్లాపూర్: బీజేపీకి అధికారం ఇస్తే.. అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హామీనిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే ప్రజల కష్టాలు తీరి తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో జరిగిన ప్రజాదీవెన సభలో, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయసంకల్ప సభలో, కర్మన్‌ఘాట్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో, షాపూర్‌నగర్‌లో జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ఎందరో త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుంటోందని ధ్వజమెత్తారు. ఇక్కడ కూడా గో మాఫియా, పశు మాఫియా ఉన్నాయనీ, ఆ మాఫియాలను హెచ్చరించేందుకు ఇక్కడికి వచ్చానని వ్యాఖ్యానించారు. 2017 కంటే ముందు ఉత్తరప్రదేశ్‌లో మాఫియాలు ఉండేవనీ, ఇప్పుడు మోదీ నేతృత్వంలోని మార్గదర్శకంలో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ ఉండడంతో అక్కడ ప్రశాంతంగా ఉందన్నారు. ''రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు కామన్ ఫ్రెండ్ ఎంఐఎం. ఫెవికాల్ వలే ఎంఐఎం పనిచేస్తుంది. ఈ మూడు పార్టీలు ఒక్కటే. తెలంగాణ ప్రజల మనోభావాలు, జీవితాలతో ఇవి ఆటలాడుకుంటున్నాయి'' అని విమర్శించారు.

హైదరాబాద్‌ను భాగ్యనగరంగా మారుస్తాం

బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే హైదరాబాద్ పేరును భాగ్యనగరంగా మారుస్తామని యూపీ సీఎం యోగి ప్రకటించారు. అమరుల త్యాగాలతో వచ్చిన తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల తెలంగాణగా మార్చిందని, నిరుద్యోగులను రోడ్డుపాలు చేసిందని ఆరోపించారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే రామ మందిరం దర్శనం ఉచితం

అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తవుతోంది.. బీజేపీ అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా గెలిపించి వారితో పాటు మీరంతా 2024, జనవరి 26న జరిగే అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవానికి రండి.. ఉచిత దర్శనం వాళ్లే కల్పిస్తారు'' అంటూ యోగి ఆదిత్యనాథ్ చెప్పుకొచ్చారు.

ఈ రెండు రోజులూ కీలకం

- ప్రచారం ఉధృతం చేయండి
- పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టండి
- గట్టి పోటీ ఇస్తున్న 45–50 సీట్లలో ఎక్కువ గెలవాలి
- బీజేపీ నేతలతో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్న 111 (జనసేన 8 సీట్లు కలిపితే 119) అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుత వాస్తవ పరిస్థితి, అభ్యర్థుల విజయావకాశాలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా సమీక్షించారు. చివరి రెండు రోజుల ప్రచారం ఎంతో కీలకమని, ఉధృతంగా ప్రచారం నిర్వహించడంతో పాటు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని ఆయన పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. పోల్ మేనేజ్‌మెంట్‌ను పటిష్టంగా అమలు చేయాలని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా అన్ని నియోజకవర్గాల్లో పూర్తిస్థాయిలో పోలింగ్ బూత్ కమిటీలు క్రియాశీలక పాత్ర పోషించేలా చూడాలని పార్టీ నాయకులను ఆదేశించినట్టు తెలుస్తోంది. ఇందుకు రాష్ట్ర పార్టీకి జాతీయనాయకత్వం చేదోడువాదోడుగా నిలుస్తుందని నడ్డా భరోసానిచ్చినట్టు చెబుతున్నారు. ఆదివారం నాంపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చిన నడ్డా, తెలంగాణ ఎన్నికలకు సంబంధించిన విధుల్లో నిమగ్నమైన జాతీయనేతలు బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్, సంస్థాగత సహ ఇన్‌చార్జి శివప్రకాష్, బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌తో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు పనిచేసింది ఒక ఎత్తు.. చివరి రోజుల్లో పార్టీకి ప్రజల్లో పెరిగిన మద్దతును ఓట్ల రూపంలో పోలింగ్‌బూత్‌ల దాకా తీసుకెళ్లి విజయం సాధించడం మరొక ఎత్తు అని పేర్కొన్నట్టు తెలిసింది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాలు నిర్వహించిన తర్వాత పరిస్థితిలో అనూహ్యంగా మార్పు వచ్చిందని, అభ్యర్థుల విజయావకాశాలు చాలా సీట్లలో మెరుగయ్యాయని వ్యాఖ్యానించినట్టు చెబుతున్నారు.

ఆ సీట్లపై పూర్తిస్థాయిలో ఫోకస్

45–50 స్థానాల్లో అభ్యర్థులు గట్టి పోటీనిస్తున్నారని, వీటిలో అత్యధిక సీట్లను గెలుచుకోవడం ద్వారా తెలంగాణలో బీజేపీ సత్తా చాటాల్సి ఉంటుందని నడ్డా పేర్కొన్నట్టు సమాచారం. సీఎం కేసీఆర్ పోటీచేస్తున్న గజ్వేల్, కామారెడ్డిలలో పరిస్థితి ఏమిటి అని నడ్డా ప్రశ్నించినపుడు ఆ రెండుచోట్లా కేసీఆర్‌కు బీజేపీ అభ్యర్థులు గట్టి పోటీ ఇస్తున్నారని, గెలిచే అవకాశాలూ ఉన్నాయని ప్రకాష్‌జవదేకర్, సునీల్‌బన్సల్ వెలిబుచ్చినట్టు పార్టీవర్గాల సమాచారం.

30న తెలంగాణ భవిష్యత్తు తేలిపోతుంది

- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య
- ముషీరాబాద్, మక్తల్ కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్)/నారాయణపేట: గత పదేళ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడ ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారని కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. ముషీరాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్‌కు ఆశీస్సులు అందించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిద్ధరామయ్య మాట్లాడుతూ నవంబర్ 30న తెలంగాణ భవిష్యత్తు తేలిపోతుందని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో అన్ని కుల, మతాల ప్రజల సంక్షేమం కోసం పని చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్సే అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ ప్రమేయం లేదని, పార్లమెంటులో ఆయనకు ఎంపీలు లేకపోయినా సోనియా గాంధీ ధైర్యం చేసి రాష్ట్రాన్ని ఇచ్చారని చెప్పారు. రాష్ట్ర సంపదను కేసీఆర్ కుటుంబం లూటీ చేసిందని ధ్వజమెత్తారు. కేసీఆర్, మోదీలకు ఓడిపోతామనే భయం ప్రారంభమైందని, బీజేపీకి మూడు సీట్లు మించి రావని అన్నారు.

కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మూడే రోజులు

'బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్ర అభివృద్ధిని మరచి పక్కనున్న కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారని సిద్ధరామయ్య అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నారాయణపేట జిల్లా మక్తల్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి తరపున ఏర్పాటు చేసి రోడ్‌షోలో సిద్ధరామయ్య మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఇంకా మూడురోజులే గడువు ఉందన్నారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు అన్నారని, కానీ అది మూణ్నాళ్ల ముచ్చటగా మారిందని విమర్శించారు.

మా రాష్ట్రం వస్తే గ్యారంటీల అమలు చూపిస్తాం

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఐదు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తున్నామని, ఈ విషయంలో ఎవరికైనా అనుమానాలుంటే తమ రాష్ట్రానికి వస్తే చూపిస్తామని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. ఐదు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో అమలు చేయడం లేదని తెలంగాణ సీఎం కేసీఆర్, కేటీఆర్‌లు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. ఈ పథకాల అమలు కోసం తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.38 వేల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. ఆదివారం తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఆయన హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ రాష్ట్ర మంత్రులు బోసురాజు, లక్ష్మీ హెబ్బాల్కర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులతో కలసి మాట్లాడారు. ఐదు గ్యారంటీల్లో నాలుగు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేశామని, ఎన్నికల సందర్భంగా కర్ణాటక ప్రజలకిచ్చిన 165 హామీల్లో ఇప్పటివరకు 158 నెరవేర్చామని సిద్ధరామయ్య వెల్లడించారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం గత పదేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 10 శాతం కూడా నెరవేర్చలేదన్నారు. ఐదు గ్యారంటీల అమలు కారణంగా కర్ణాటక ఆర్థిక వ్యవస్థ దివాళా తీసిందని ప్రధాని మోదీ చెపుతున్న మాటల్లో వాస్తవం లేదని సిద్ధరామయ్య అన్నారు.

'డబుల్ ఇంజన్'తోనే అభివృద్ధి

▶ మొదటి పేజీ తరువాయి

జైలుకు వెళ్లేందుకు సమయం ఆసన్నమైంది. ఇది మోదీ గ్యారంటీ.

దిగజారుడు రాజకీయాలు సిగ్గుచేటు

బీజేపీ ఫుడ్‌పార్క్, టెక్స్‌టైల్స్ పార్క్ వంటివి ఏర్పాటు చేస్తుంటే.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు మాత్రం బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నాయి. మత ప్రాతిపదికన రాష్ట్రంలో ఐటీపార్కు ఏర్పాటు చేస్తామని కేసీఆర్ పేర్కొనడం రాజ్యాంగానికే ప్రమాదకరం. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు సిగ్గుచేటు. పదేళ్లు సచివాలయానికి రాకుండా ఫాంహౌస్ నుంచే పాలన సాగించిన కేసీఆర్‌ను చిత్తుగా ఓడించి పర్మినెంట్‌గా ఫాంహౌస్‌కే పరిమితం చేయాలి. కేసీఆర్ మల్లన్నసాగర్ ప్రాజెక్టు బాధితులకు పరిహారం ఇవ్వకుండా నడిరోడ్డుపై వదిలేశారు. ఆ మల్లికార్జున స్వామి కూడా కేసీఆర్‌ను వదలడు.

అసైన్డ్ భూములను లాక్కున్నారు

తెలంగాణలో ధరణి పేరిట భూమాయ నడుస్తోంది. పేదల నుంచి అసైన్డ్ భూములను లాక్కున్నారు. మేం అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేస్తాం. మీభూమి పేరిట కొత్త పోర్టల్ తీసుకువస్తాం. డ్రోన్ల సాయంతో పారదర్శకంగా భూముల లెక్కలు తేలుస్తాం. కేసీఆర్ తెలంగాణకు దళితుడిని తొలి సీఎం చేస్తామని మాటిచ్చి ద్రోహం చేశారు. మేం ఎస్సీ వర్గీకరణపై కమిటీ వేస్తాం. మాదిగలకు సరైన న్యాయం చేస్తాం. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తాం.

ఢిల్లీలో సుల్తాన్లు.. తెలంగాణలో రజాకార్లు..

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటే. రెండూ కుటుంబ పాలన సాగిస్తున్నాయి. ఢిల్లీలో కాంగ్రెస్ సుల్తాన్‌లను పెంచి పోషిస్తే.. తెలంగాణలో కేసీఆర్ రజాకార్లను పెంచి పోషిస్తున్నారు. ఆ రెండు పార్టీలూ ఒక్కటే. కాంగ్రెస్ బోఫోర్స్ మొదలు హెలికాప్టర్ల కొనుగోలు వరకు అవినీతిలో కూరుకుపోతే.. కేసీఆర్ పాలనలో సంక్షేమ పథకాల్లో 30శాతం కమీషన్లు లాగడమే. కాంగ్రెస్‌కు వేసే ప్రతి ఓటూ బీఆర్‌ఎస్‌కు వెళ్తుంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లతోపాటు వాటి వెంట ఉన్న ఎంఐఎంను కూడా ఓడించాలి.

అసమర్థ కాంగ్రెస్‌కు ప్రజలు చెక్‌పెట్టారు

కేంద్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలన కొనసాగించింది. ఉగ్రవాదుల దాడుల్లో ఎంతో మంది అమాయకులు బలయ్యారు. అందుకే ప్రజలు కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడి బీజేపీకి పట్టం కట్టారు. మేం సమర్థ పాలనతో దేశంలో శాంతి నెలకొల్పాం. ఉగ్రవాదులను మట్టి కరిపించాం.



నిర్మల్‌లో జరిగిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభకు హాజరైన ప్రజలు

మీ ఇంటికోసం.. నా ఇంటిని వదిలి తిరుగుతున్నా..

ఈ మోదీ తన ఇంటికోసం తిరగడం లేదు. మీ ఇంటి కోసం తన ఇంటిని వదిలి తిరుగుతున్నాడు. మేం తెలంగాణకు రెండున్నర లక్షల ఇళ్లను ఇచ్చాం. కేసీఆర్ ప్రభుత్వం వేల ఇళ్లను కూడా ప్రజలకు ఇవ్వలేదు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే పేదలందరికీ ఇళ్లు ఇస్తాం. ఇది మోదీ గ్యారంటీ.

ఓటమి భయంతోనే రాహుల్‌గాంధీ యూపీలోని అమేథీ నుంచి కేరళకు పారిపోయారు. ఇక్కడ (గజ్వేల్) ప్రాతినిధ్యం వహిస్తున్న కేసీఆర్ కూడా ఈటల రాజేందర్ చేతిలో ఓటమి తప్పదనే భయంతోనే కామారెడ్డి నుంచి పోటీచేస్తున్నారు..'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

నిజామాబాద్‌ను టర్మరిక్ సిటీ చేస్తాం

బీజేపీ మేనిఫెస్టోలో రైతుల సంక్షేమం కోసం ఎన్నో అంశాలను చేర్చింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా దేశవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.2.75 లక్షల కోట్లు జమచేశాం. నిజామాబాద్, నిర్మల్ తదితర జిల్లాల పసుపు రైతుల కోసం జాతీయ పసుపు బోర్డును తీసుకువచ్చాం. నిజామాబాద్‌ను టర్మరిక్ సిటీ చేస్తాం. ఆర్మూర్ పసుపునకు జియోట్యాగింగ్ తీసుకువస్తాం. కోవిడ్ తర్వాత ప్రపంచానికి పసుపు విలువ తెలిసి వచ్చింది. రైతులు బాగా పండించి లాభాలు పొందాలి. బీజేపీ అధికారంలోకి రాగానే నిర్మల్ కొయ్యబొమ్మల పరిశ్రమను ఆదుకుంటాం. తెలంగాణలో త్వరలో మిల్క్ ప్రాసెసింగ్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తాం. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్రోల్‌పై వ్యాట్ ఎత్తేశాం. అక్కడ ధరలు తక్కువగా ఉన్నాయి. తెలంగాణలోనూ అధికారంలోకి రాగానే పెట్రోల్, డీజిల్‌లపై వ్యాట్ ఎత్తివేసి ధరలు తగ్గేలా చూస్తాం.

తెలుగులో మాట్లాడుతూ.. ఉత్సాహపరుస్తూ..

బహిరంగ సభల్లో ప్రసంగించిన సమయంలో పలుమార్లు ప్రధాని మోదీ తెలుగులో మాట్లాడారు. సభికులను ప్రశ్నలు అడుగుతూ, ఉత్సాహపరిచారు. పలుమార్లు 'నా కుటుంబ సభ్యులారా..' అని సంబోధించడం ఆకట్టుకుంది. ఇక తెలుగులో మాట్లాడుతూ.. 'ప్రజలను కలవని, సచివాలయానికి వెళ్లని ఫామ్‌హౌస్ సీఎం అవసరమా? ఇలాంటి సీఎంను తీసేయాలా వద్దా?'.. 'తెలంగాణలో మొదటిసారి బీజేపీ సర్కార్ ఏర్పాటు కానుంది'.. 'పెట్రోల్ ధరలు తగ్గాలా.. వద్దా..?' అని సభికులను ప్రశ్నించారు. ఇక మోదీ హిందీలో ప్రసంగించినప్పుడు దానిని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలుగులో అనువదించారు.



కాన్హా శాంతివనంలో స్మారక ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో గురూజీ కమ్లేష్ పటేల్

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: మోదీ

నందిగామ: సమాజంలోని ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని.. ధ్యానంతో మానసికంగా ప్రశాంతంగా ఉండొచ్చని ప్రధాని మోదీ సూచించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కాన్హా శాంతివనంలోని ధ్యాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. శ్రీరామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు బాబూజీ మహరాజ్ 125వ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన స్మారక ఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రధాని మోదీ అనురాధా నక్షత్రానికి సంబంధించిన 'బాకుల' అనే మొక్కను నాటారు. గురూజీ కమ్లేష్ పటేల్‌తో కలసి ధ్యానం చేశారు. అనంతరం మాట్లాడారు. ఒకే సమయంలో లక్ష మంది ధ్యానం చేయగలిగేలా అతిపెద్ద ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. యోగా, ధ్యానం మనసుకు ఎంతో ఉల్లాసాన్ని, ప్రశాంతతని ఇస్తాయన్నారు. యువత చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మోదీ కోరారు. మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హాని చేయడమే కాకుండా బంగారు భవిష్యత్తును నాశనం చేస్తాయన్నారు.

క్లుప్తంగా...

'26/11' మృతులకు రాష్ట్రపతి నివాళులు

న్యూఢిల్లీ: 2008 నవంబర్ 26న ముంబైలో ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా దాడిలో మృతిచెందిన భద్రతా సిబ్బందికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. మాతృభూమి సంరక్షణ కోసం వారు ప్రాణాలర్పించారని కొనియాడారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానికి వ్యతిరేకంగా పోరాడుతామంటూ ప్రతిజ్ఞ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్రపతి 'ఎక్స్'లో పోస్టు చేశారు.

30న దుబాయ్‌కి మోదీ

న్యూఢిల్లీ: వరల్డ్ క్లైమేట్ యాక్షన్ సమిట్‌లో పాల్గొనేందుకు ఈ నెల 30న ప్రధాని మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)కు వెళ్లనున్నారు. యూఏఈ అధ్యక్షుడు, దుబాయ్ పాలకుడు అయిన షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ నవంబర్ 30, డిసెంబర్ ఒకటో తేదీల్లో ఆ దేశంలో పర్యటిస్తారని విదేశాంగ శాఖ తెలిపింది.

మాస్కోపై డ్రోన్ల దాడి

మాస్కో: మాస్కో లక్ష్యంగా డజన్ల కొద్దీ డ్రోన్లతో ఉక్రెయిన్ ఆదివారం దాడికి యత్నించినట్లు రష్యా ఆరోపించింది. శనివారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పైకి రష్యా 60కి పైగా డ్రోన్లను ప్రయోగించిన విషయం తెలిసిందే. ఆదివారం మాస్కో పరిసర ప్రాంతాలపైకి దూసుకొచ్చిన 24 వరకు ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా తెలిపింది. మాస్కోలోని మూడు వేర్వేరు చోట్ల జరిగిన డ్రోన్ దాడుల్లో ఎవరూ గాయపడలేదని గవర్నర్ ఆంద్రీ ఒవొబియెవ్ తెలిపారు. మాస్కోకు దక్షిణాన ఉన్న తుల నగరంలోని 12 అంతస్తుల అపార్టుమెంట్‌ను ఒక డ్రోన్ ఢీకొట్టగా ఒకరు గాయపడినట్లు సమాచారం.

అతిపెద్ద టైగర్ రిజర్వ్!

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని రెండు అభయారణ్యాలను కలిపేసి దేశంలోనే అతిపెద్దదైన పులుల అభయారణ్యాన్ని ఏర్పాటుచేయాలని కేంద్రం నిర్ణయించుకుంది. మధ్యప్రదేశ్‌లోని నౌరాదేహి వన్యప్రాణి అభయారణ్యం, రాణి దుర్గావతి వన్యప్రాణి అభయారణ్యాలను కలిపేయనున్నట్లు ఒక నోటిఫికేషన్‌లో కేంద్రం పేర్కొంది. సాగర్, దామోహ్, నర్సింగ్‌పూర్, రేసిన్ జిల్లాల్లో విస్తరించిన ఈ రెండు అభయారణ్యాలను కలిపేస్తే దేశంలోనే పెద్దదైన 2,300 కిలోమీటర్ల విస్తీర్ణంలో నూతన అభయారణ్యం ఆవిష్కృతం కానుంది. ఇది వచ్చే రెండు, మూడు నెలల్లో ఏర్పాటుకానుంది.

కోర్టులను ఆశ్రయించడానికి సంకోచం వద్దు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం

సాక్షి, న్యూఢిల్లీ: భారత సుప్రీంకోర్టు గత ఏడు దశాబ్దాలుగా ప్రజా న్యాయస్థానంగా వ్యవహరిస్తోందని భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. ఎంతో విశ్వాసంతో వచ్చిన వేలాది మంది పౌరులు సుప్రీంకోర్టు ద్వారా న్యాయం పొందారని పేర్కొన్నారు. న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించడానికి భయపడాల్సిన పని లేదని ప్రజలకు సూచించారు. నిస్సంకోచంగా కోర్టులకు రావొచ్చని చెప్పారు. ఆదివారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో సీజేఐ మాట్లాడారు. వ్యవస్థీకృత ప్రజాస్వామ్య సంస్థలు, ప్రక్రియల ద్వారా రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి రాజ్యాంగం మనకు వీలు కల్పిస్తుందని వివరించారు. ఎన్నో రకాల సమస్యల పరిష్కారానికి న్యాయస్థానాల వ్యవస్థ ఉపయోగపడుతుందని వెల్లడించారు. దేశంలోని ప్రతి కోర్టులో ప్రతి కేసు రాజ్యాంగబద్ధమైన పాలనకు పొడిగింపేనని అన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి ఎన్నో విప్లవాత్మక చర్యలు చేపట్టామని గుర్తుచేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నామని ఉద్ఘాటించారు. కోర్టు కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారాలు సైతం ప్రారంభించామని తెలిపారు. దేశ పౌరుల ఆకాంక్షలను నెరవేర్చడానికి తమ వంతు కృషి చేస్తున్నామని సీజేఐ స్పష్టం చేశారు. న్యాయం పొందడానికి కోర్టులను చివరి మజిలీగా భావించాలన్నారు. 2023 నవంబర్ 25 నాటికి సుప్రీంకోర్టు 36,068 తీర్పులను ఆంగ్ల భాషలో వెలువరించిందని చెప్పారు. ఈ తీర్పులను ప్రాంతీయ భాషల్లోకి అనువదించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని సవరించుకొనే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే సామర్థ్యం రాజ్యాంగానికి ఉందని తెలియజేశారు.


రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం సుప్రీంకోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న రాష్ట్రపతి ముర్ము, సీజేఐ జస్టిస్ చంద్రచూడ్. చిత్రంలో కేంద్ర న్యాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, కేంద్ర న్యాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, న్యాయవాదులు పాల్గొన్నారు. అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఏడడుగుల ఈ అంబేడ్కర్ విగ్రహాన్ని శిల్పి నరేష్ కుమావత్ రూపొందించారు.

ఆలిండియా జ్యుడీషియల్ సర్వీసు ఏర్పాటు చేయాలి: రాష్ట్రపతి

నైపుణ్యం కలిగిన యువతను న్యాయ వ్యవస్థలోకి తీసుకురావడానికి, వారి ప్రతిభకు సాన పెట్టడానికి అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు ఏర్పాటు చేయాలని రాష్ట్రపతి ముర్ము సూచించారు. ఆదివారం సుప్రీంకోర్టులో రాజ్యాంగ దినోత్సవంలో ఆమె ప్రసంగించారు. న్యాయం పొందే విషయంలో పౌరులకు ఖర్చు, భాష అనే అవరోధాలు ఎదురవుతున్నాయని చెప్పారు. ఇలాంటి పరిమితులను తొలగించాలన్నారు. న్యాయాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని, ప్రజలే కేంద్రంగా న్యాయ వ్యవస్థను తీర్చిదిద్దాలని అభిప్రాయపడ్డారు. యువత న్యాయ వ్యవస్థలోకి ప్రవేశించడానికి మరిన్ని అవకాశాలివ్వాలన్నారు.

పార్లమెంట్ అభేద్యమైనది: ఉపరాష్ట్రపతి

ప్రజాస్వామ్యానికి ఆత్మ పార్లమెంట్ అని ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ చెప్పారు. ఆదివారం ఢిల్లీలో రాజ్యాంగ దినోత్సవంలో మాట్లాడారు. పార్లమెంట్ ఔన్నత్యాన్ని కార్యనిర్వాహక వ్యవస్థ గానీ, న్యాయ వ్యవస్థ గానీ తగ్గించలేవని పేర్కొన్నారు. పార్లమెంట్ అభేద్యమైనదని స్పష్టం చేశారు. పార్లమెంట్ అధికారాల్లో జోక్యం రాజ్యాంగ ఉల్లంఘన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని చెప్పారు.

నిట్టనిలువుగా డ్రిల్లింగ్ మొదలు

- ఉత్తరకాశీ సొరంగ రెస్క్యూలో మరో ప్లాన్ మరూ
- ఆగర్ మెషీన్ ముక్కలు తొలగించాకే మాన్యువల్ డ్రిల్లింగ్

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ సొరంగంలో 41 మంది కార్మికులను కాపాడేందుకు సహాయక బృందాలు మరో ప్రణాళికను పట్టాలెక్కించాయి. రెండు మూడు రోజులుగా శిథిలాల గుండా సమాంతరంగా చేసిన డ్రిల్లింగ్ పనులను ప్రస్తుతానికి పక్కనబెట్టేశారు. కొండ పై నుంచి నిట్టనిలువుగా 86 మీటర్ల డ్రిల్లింగ్ పనులను ఆదివారం మధ్యాహ్నం మొదలు పెట్టారు. 'మొదలెట్టి నిలువుగా 20 మీటర్లకుపైగా డ్రిల్లింగ్ చేశాం. భారీ బండలు లాంటివి అడ్డుప డకపోతే నవంబర్ 30వ తేదీకల్లా డ్రిల్లింగ్ పూర్తి అయ్యే అవకాశ ముంది. 85 మీటర్ల వరకు డ్రిల్లింగ్ చేశాక సొరంగం పైకప్పుకు చేసిన కాంక్రీట్, ఉక్కు రాడ్ల నిర్మాణాన్ని ఛిద్రం చేసి మార్గం సుగమం చేయాల్సి ఉంది'' అని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎంఏ) సభ్యుడు మాజీ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నాయిన్ చెప్పారు.

''ఇప్పటికి మొత్తంగా ఆరు రకాల రెస్క్యూ ప్లాన్‌లను అమలుచేశాం. అయినా సరే మొదటిదే అన్నింటికన్నా ఉత్తమం, సురక్షితం. సమాంతరంగా తవ్వే ప్లాన్‌ను మళ్లీ అమలుచేస్తాం. దాదాపు 62 మీటర్ల మేర సొరంగం కూలింది. ఇందులో 47 మీటర్ల వరకు శిథిలాల గుండా ఆగర్ మెషీన్‌తో డ్రిల్లింగ్ చేశాం. కూలినభాగంలోని కాంక్రీట్ నిర్మాణ రాడ్లు.. డ్రిల్లింగ్ మెషీన్ బ్లేడ్లను ముక్కలుచేశాయి. దాంతో 47 మీటర్లవరకు ఉన్న మెషీన్‌ను వెనక్కి లాగాం. 15 మీటర్లు లాగాక మెషీన్ విరిగిపోయి ముక్కలు లోపలే ఉండిపోయాయి. ప్లాస్మా, గ్యాస్ కట్టర్లతో ముక్కలను విడివిడిగా కట్‌చేసి బయటకు తీస్తున్నాం. 23 మీటర్లవరకు ముక్కలను తొలగించాం. మొత్తం పొడవునా బ్లేడ్ల ముక్కలను తీయడానికి ఒక రోజంతా పట్టొచ్చు. ముక్కలన్నీ తీసేశాక అదే మార్గంలో భారత సైన్యంలోని మద్రాస్ యూనిట్ ఇంజనీర్లు, ట్రెంచ్‌లెస్ ఇంజనీరింగ్ సంస్థల సంయుక్త బృందం మ్యాన్యువల్‌గా తవ్వడం మొదలుపెడుతుంది'' అని వివరించారు. '' 62 మీటర్ల శిథిలాల గుండా ఇప్పటికే 47 మీటర్ల డ్రిల్లింగ్ పూర్తయింది. మెషీన్ బ్లేడ్లు తొలగించాక మిగతా 15 మీటర్లను మ్యాన్యువల్‌గా తవ్వితే కార్మికులు చిక్కుకున్న చోటుకు చేరుకోవచ్చు'' అని ఆయన వెల్లడించారు. గత 14 రోజులుగా చిక్కుకుపోయిన కార్మికులను బయటకు తెచ్చేందుకు సహాయక సిబ్బంది అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. ఛార్‌ధామ్ ప్రాజెక్టులో భాగంగా రోడ్డుమార్గంలో ప్రయాణ దూరాన్ని తగ్గించేందుకు సిల్‌క్యారా–బార్కోట్ మార్గంలో సొరంగం నిర్మిస్తుండగా నవంబర్ 12వ తేదీన లోపల కొంత భాగం కూలిపోవడంతో కార్మికులు రెండు కిలోమీటర్ల పొడవైన భాగంలో చిక్కుకుపోయారు.


సొరంగం వద్ద ఆదివారం కొనసాగుతున్న తవ్వకం పనులు

చైనాలో నిమోనియా కలకలంపై

కేంద్రం అప్రమత్తం

ఆరోగ్య సంసిద్ధతపై సమీక్ష నిర్వహించుకోవాలని రాష్ట్రాలకు సూచన

న్యూఢిల్లీ: చైనాలో కొత్తగా నిమోనియా కేసులు వెలుగుచూస్తుండటంపై భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. వెంటనే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో సమగ్రస్థాయిలో ఆరోగ్య సంసిద్ధతపై సమీక్ష నిర్వహించుకోవాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటన జారీచేసింది. 'ఉత్తర చైనాలో చిన్నారుల్లో శ్వాససంబంధ కేసుల ఉధృతి కనిపిస్తోంది. ఈ పరిస్థితిని భారత సర్కార్ నిశితంగా పరిశీలిస్తోంది. ఇప్పటికిప్పుడు భయపడాల్సిన పని లేదు. కానీ ముందు జాగ్రత్త చర్యగా మీమీ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆరోగ్య సన్నద్ధతపై సమీక్ష నిర్వహించుకోండి'' అని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పాలనా యంత్రాంగాలకు లేఖ రాశారు. '' ఇంఫ్లూయెంజా తరహా కేసు(ఐఎల్ఐ), అత్యంత తీవ్రమైన శ్వాస(ఎస్ఏఆర్ఐ) కేసుల విషయంలో కోవిడ్‌కాలంలో అనుసరించిన విధానాలనే ఇప్పుడు పాటించండి. ఈ తరహా కేసులు, ముఖ్యంగా చిన్నారుల్లో కనిపిస్తే జిల్లా, రాష్ట్ర స్థాయిలో సమగ్ర వ్యాధి నిఘా వ్యవస్థల నేతృత్వంలో క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోండి. ఈ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయండి. అనుమానిత కేసుల శాంపిళ్లను వైరస్ రీసెర్చ్, డయాగ్నస్టిక్ ల్యాబొరేటరీలకు పంపించండి. ఇలాంటి ముందస్తు, అప్రమత్త చర్యల ద్వారానే ఆరోగ్య అత్యయిక స్థితి దాపురించకుండా పౌరులను కాపాడగలం'' అని లేఖలో కార్యదర్శి పేర్కొన్నారు. ఉత్తర చైనాలో శ్వాస సంబంధ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదికలో వెల్లడైంది. ఇన్‌ఫ్లూయెంజా, మైకోప్లాస్మా నిమోనియా, సార్స్–కోవ్-2 కేసుల ఉధృతి ఎక్కువగా ఉంది. చలికాలం కావడంతో చైనాలో సాధారణంగానే మైకోప్లాస్మా నిమోనియా కేసులు ఎక్కువగా వెలుగుచూస్తుంటాయి. ''కేసులపై అదనపు సమాచారం ఇవ్వాలని చైనా యంత్రాంగాన్ని డబ్ల్యూహెచ్‌ఓ కోరింది. అంతమాత్రాన పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కాదు'' అని కార్యదర్శి స్పష్టంచేశారు.

పెద్దాయన పెద్ద పేగులో ఈగ




వాషింగ్టన్: మానవునిలో పెద్ద పేగు దాకా ఏదైనా ఆహారం వెళ్లిందంటే అప్పటికే అది జీర్ణమైందని అర్థం. అయితే అమెరికాలో ఓ పెద్దాయన పెద్దపేగులో ఒక ఈగ ఛిద్రమవకుండా చక్కగా ఉంది. జీర్ణావస్థలోకాకుండా పేగు గోడలకు అతుక్కుని ఉన్న ఈగను చూసి అక్కడి వైద్యులు అవాక్కయ్యారు. జీర్ణాశయం, చిన్నపేగును దాటి కూడా ఈ కీటకం ఎలా జీర్ణమవకుండా ఉందబ్బా? అని వైద్యులు పలు విశ్లేషణలు మొదలుపెట్టారు. అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఈ వింత ఘటన జరిగింది. 'ది అమెరికన్ జర్నల్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటిరాలజీ'లో సంబంధిత వివరాలతో కథనం వెలువడింది. సాధారణ వైద్య పరీక్షల్లో భాగంగా 63 ఏళ్ల పెద్దాయన ఆస్పత్రికి రాగా ఆయనకు వైద్యులు కొలొనోస్కోపీ చేశారు. అందులో ఈ విషయం వెల్లడైంది. '' కొలొనోస్కోపీకి ముందు ఘన పదార్థాలు ఏవీ నేను తీసుకోలేదు. రెండు రోజుల క్రితం మాత్రం పిజ్జా, తోటకూర తిన్నాను. అసలది ఎలా లోపలికెళ్లిందో నాకైతే తెలీదు'' అని ఆ పెద్దాయన తాపీగా చెప్పారు. '' తిన్న వాటిని జీర్ణరసాలు, పొట్టలోని ఆమ్లాలు జీర్ణం చేస్తాయి. అయినాసరే ఈగ అలాగే ఉందంటే ఆశ్చర్యమే. అయితే ఇది ఇంటెస్టినల్ మయాసిస్ అయి ఉండొచ్చు. ఈగ గుడ్లు లేదా లార్వా ఉన్న ఆహారం తిని ఉండొచ్చు. అవి లోపలికెళ్లి జీర్ణమయ్యాక కూడా జీర్ణవ్యవస్థలోని అసాధారణ వాతావరణాన్ని తట్టుకుని ఒకే ఒక్క లార్వా ఇలా ఈగగా రూపాంతరం చెంది ఉంటుంది'' అని మిస్సోరీ విశ్వవి ద్యాలయంలో గ్యాస్ట్రోఎంటిరాలజీ విభాగ సారథి మ్యాథ్యూ బెక్‌టోల్డ్ విశ్లేషించారు. 'ఇలాంటి సందర్భాల్లోనూ వ్యక్తికి విరేచనాలు, వాంతులు, కడుపు నొప్పి ఉంటాయి. అయినా సరే ఈయనకు అవేం లేవంటే నిజంగా ఇది వింతే'' అని ఆయన వ్యాఖ్యానించారు. చనిపోయిన ఆ ఈగను కొలొనోస్కోపీ ద్వారా ఎట్టకేలకు బయటకు తీశారు. ఇంత జరిగినా పెద్దాయన ఆరోగ్యంగా ఉండటం విశేషం.

వీసా లేకుండానే మలేసియాకు వెళ్లొచ్చు

న్యూఢిల్లీ: మలేసియా ఆర్థికాభివృద్ధిని కాంక్షిస్తూ ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం కొత్త నిర్ణయం తీసుకున్నారు. భారత్, చైనా పర్యాటకులు, పెట్టుబడిదారులను వీసా లేకుండానే మలేసియాలోకి అనుమతిస్తామని అన్వర్ తాజాగా ప్రకటించారు. దీంతో దేశంలో పర్యాటకం పెరిగి ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని భావిస్తున్నారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఇలా వీసా లేకుండానే భారత్, చైనా పౌరులను దేశంలోకి అనుమతిస్తారు. ఇలా వచ్చిన వారు 30 రోజులపాటు వీసాలేకుండానే దేశవ్యాప్తంగా పర్యటించవచ్చు. ఆదివారం పుత్రజయ నగరంలోని తన పీపుల్స్ జస్టిస్ పార్టీ వార్షిక సమావేశంలో అన్వర్ ఈ ప్రకటన చేశారు. భారత్ నుంచి మలేసియాకు పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించేందుకే ఆ దేశ సర్కార్ తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది.

భారత్‌పై హేయమైన దాడి

15 ఏళ్ల నాటి ముంబై దాడులపై మోదీ
- ముష్కరుల దొంగ దెబ్బ నుంచి వేగంగా కోలుకున్నాం
- ఉగ్రవాదం అంతానికి అలుపెరుగని పోరు
- సంపన్న, సౌభాగ్య భారత్‌కు 'వోకల్ ఫర్ లోకల్'
- 'మన్ కీ బాత్'లో ప్రధాని



న్యూఢిల్లీ: సరిగ్గా 15 సంవత్సరాల క్రితం భారత్‌పై అత్యంత హేయమైన దాడి జరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. 2008 నవంబర్ 16న దేశ ఆర్థిక రాజధాని ముంబైలో జరిగిన ఉగ్రవాద దాడిని ఆయన గుర్తుచేశారు. భారత్ ఎదుర్కొన్నవాటిలో ఇది అత్యంత హేయమైన దాడి అని తెలిపారు. ముష్కర మూకల దొంగదెబ్బ నుంచి దేశం వేగంగా కోలుకోవడమే కాదు ఉగ్రవాదాన్ని అంతం చేయడమే లక్ష్యంగా తన శక్తియుక్తులతో అలుపెరుగని పోరాటం సాగిస్తోందని పేర్కొన్నారు. ఉగ్రవాద భూతంపై ఉక్కుపాదం మోపుతున్నామని వెల్లడించారు. ప్రధాని మోదీ ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి రేడియోలో ప్రసంగించారు. 26/11 దాడుల్లో మృతి చెందిన వారికి సంతాపం ప్రకటించారు. వారి ప్రాణత్యాగాలను స్మరించుకున్నారు. ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

రాజ్యాంగానికి 106 సవరణలు

''నవంబర్ 26వ తేదీని ఎప్పటికీ మర్చిపోలేం. 15 ఏళ్ల క్రితం ఇదే రోజు ఉగ్రవాదులు ముంబై నగరాన్ని, మొత్తం దేశాన్ని వణికించారు. అత్యంత హేయంగా దాడికి పాల్పడ్డారు. అయినా మనం వెనక్కి తగ్గకుండా ఉగ్రవాదాన్ని కఠినంగా అణచివేస్తున్నాం. మరో కారణంతోనూ నవంబర్ 26వ తేదీకి చాలా ప్రాముఖ్య ఉంది. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ స్వీకరించింది. ప్రతి ఒక్కరూ వారి విధులకు ప్రాధాన్యం ఇస్తే, కలిసికట్టుగా పనిచేస్తే మన దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చుకోవచ్చు. 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల్లో రాజ్యాంగాన్ని రూపొందించారు. ముసాయిదాలోనే 2,000కు పైగా సవరణలు చేశారు. 1950లో రాజ్యాంగాన్ని ఆమోదించిన తర్వాత ఇప్పటివరకు 106 సార్లు సవరణలు చేశారు. కాలానుగుణంగా పరిస్థితులు, అవసరాలను బట్టి అప్పటి ప్రభుత్వాలు ఈ సవరణలు చేశాయి. భావ ప్రకటనా స్వేచ్ఛకు అడ్డుకట్ట వేస్తూ రాజ్యాంగానికి మొదటి సవరణ జరగడం దురదృష్టకరం.

'వోకల్ ఫర్ లోకల్'కు ప్రజాదరణ

భారత రాజ్యాంగ సభకు నామినేట్ అయినవారిలో 15 మంది మహిళలు ఉన్నారు. మహిళలకు ఓటు హక్కు కల్పించిన అతికొద్ది దేశాల్లో భారత్ కూడా ఉండడం సంతోషకరం. రాజ్యాంగ నిర్మాతల దూరదృష్టికి అనుగుణంగానే లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడానికి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాం. ఈ బిల్లు ఆమోదం పొందడం నాకు చాలా సంతృప్తినిచ్చింది. 'వోకల్ ఫర్ లోకల్' నినాదానికి నానాటికీ ప్రజాదరణ పెరుగుతుండడం ఆనందంగా ఉంది. ఇటీవల పండుగుల సమయంలో దేశంలో రూ.4 లక్షల కోట్ల విలువైన వ్యాపారం జరిగింది. 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. అభివృద్ధి చెందిన, సౌభాగ్యవంతమైన భారత్‌కు 'వోకల్ ఫర్ లోకల్' ఒక నాంది. దీంతో మన ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. సమతుల అభివృద్ధి, ఉపాధికి హామీ లభిస్తుంది. ప్రజలకు సమాన అవకాశాలు దక్కుతాయి.

నెలపాటు పూర్తిగా డిజిటల్ చెల్లింపులే

దేశంలో నగదు లావాదేవీలు తగ్గుముఖం పడుతున్నాయి. యూపీఐ లేదా డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్నాయి. ఒక నెలరోజులపాటు పూర్తిగా ఇలాంటి చెల్లింపులే చేయాలని ప్రజలను కోరుతున్నా. ఆ తర్వాత మీ అనుభవాలు, మీ ఫొటోలు నాతో పంచుకోండి. భారత్‌లో డిజిటల్ విప్లవం పూర్తిస్థాయిలో విజయవంతం అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు'' అని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.

పెళ్లిళ్లకు విదేశాలకెందుకు?

సంపన్న కుటుంబాలు వివాహాల కోసం విదేశాలకు వెళ్తున్న పోకడను ప్రధాని మోదీ తప్పుబట్టారు. 'విదేశాల్లో పెళ్లిళ్ల చేసుకోవడానికే కొన్ని కుటుంబాలు ప్రాధాన్యమిస్తున్నాయి. ఇది అవసరమా? ఈ పోకడ నన్ను కలవరపెడుతోంది. స్వదేశంలోనే పెళ్లి చేసుకోవాలని కోరుతున్నా. తద్వారా మన డబ్బు సరిహద్దులు దాటకుండా ఉంటుంది'' అన్నారు. ''నూతన ఆవిష్కరణల దిశగా యువతను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇండియన్ పేటెంట్లు పదేళ్లలో పది రెట్లు పెరిగాయి. 2022లో పేటెంట్ దరఖాస్తులు 31 శాతం ఎగబాకాయి. సోషల్ మీడియా ఇప్పుడు బలంగా మారింది. టెక్నాలజీ, మొబైల్ సేవలు ప్రతి ఇంటికీ చేరాయి. వీటితో స్థానిక పండుగలు, ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే అవకాశం వచ్చింది'' అని చెప్పారు.

గ్రీస్ సమీపంలో సరకు నౌక మునక నలుగురు భారతీయులు గల్లంతు

ఏథెన్స్: గ్రీస్ పరిధిలోని లెస్బోస్ ద్వీపం సమీప మధ్యధరా సముద్ర జలాల్లో ఒక సరకు రవాణా నౌక మునిగిన ఘటనలో నలుగురు భారతీయుల ఆచూకీ గల్లంతైంది. సిబ్బందిలో ఒక్కరిని మాత్రమే కాపాడగలిగామని గ్రీస్ తీర గస్తీ దళాలు వెల్లడించాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో గాలింపు కష్టంగా మారింది. దాదాపు 6,000 టన్నుల ఉప్పుతో ఈజిప్ట్‌లోని అలెగ్జాండ్రియా నుంచి బయల్దేరిన నౌక తుర్కియేలోని ఇస్తాంబుల్‌కు వెళ్తోంది. మార్గమధ్యంలో గ్రీస్‌కు చెందిన లెస్బోస్ వద్ద మునిగిపోయింది. నౌకలోని 14 మంది సిబ్బందిలో నలుగురు భారతీయులు, ఎనిమిది మంది ఈజిప్ట్‌పౌరులు, ఇద్దరు సిరియన్లు ఉన్నారు. ఆదివారం ఉదయం ఏడింటపుడు మెకానికల్ సమస్య తలెత్తిందంటూ ఎమర్జెన్సీ సిగ్నల్ పంపిన నౌక తర్వాత కనిపించకుండా పోయింది. ఒక ఈజిప్ట్ పౌరుడిని మాత్రం రక్షించగలిగారు. ఎనిమిది వాణిజ్య నౌకలు, రెండు హెలికాప్టర్లు, ఒక గ్రీస్ నావికా యుద్ధ నౌక గాలింపు చర్యల్లో పాల్గొన్నాయి. ఘటన జరిగిన చోట్ల గంటకు 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి.

మన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ.. 2040 కల్లా 40 బిలియన్ డాలర్లకు

కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి

తిరువనంతపురం: భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 2040 నాటికి 40 బిలియన్ డాలర్ల(రూ.3.30 లక్షల కోట్ల)కు చేరుకోనుందని కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ఏకేడీ వంటి కొన్ని విదేశీ సంస్థలైతే భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 2040 నాటికి ఏకంగా 100 బిలియన్ డాలర్లకు కూడా చేరుకోవచ్చని అంచనా వేసినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం మన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ కేవలం 8 మిలియన్ డాలర్లు మాత్రమే. ఇది ఇప్పుడు శరవేగంగా వృద్ధి చెందుతోంది. ఒక్క విదేశీ ఉపగ్రహాల ప్రయోగం విభాగంలో యూరప్ ఉపగ్రహాలను ప్రయోగించడం ద్వారా 240 మిలియన్ యూరోలు, అమెరికా ఉపగ్రహాల ప్రయోగం ద్వారా మరో 180 మిలియన్ డాలర్ల వరకు ఆర్జించగలిగామని శనివారం ఆయన పీటీఐకి చెప్పారు. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, అనుసంధాన్‌ను నెలకొల్పాక అంతరిక్ష పరిశ్రమల ఏర్పాటు వేగంపుంజుకుందని తెలిపారు.

మళ్లీ ఆందోళన బాటలో అన్నదాతలు

చండీగఢ్: పంజాబ్, హరియాణా రైతులు మరోసారి ఆందోళన బాట పట్టారు. పెండింగ్ డిమాండ్ల పరిష్కారానికి మూడు రోజులపాటు నిరసనలు తెలపాలన్న సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) పిలుపు మేరకు ఆదివారం పంజాబ్, హరియాణా రైతులు ట్రాక్టర్ ట్రాలీల్లో వందలాదిగా చండీగఢ్‌కు చేరుకోవడం ప్రారంభమైంది. దీంతో, రైతులను అడ్డుకునేందుకు చండీగఢ్, పంజాబ్, హరియాణా పోలీసులు అంతర్రాష్ట్ర సరిహద్దులను మూసివేశారు. రైతులు ముందుగా మొహాలిలోని అంబ్ సాహిబ్ గురుద్వారాకు చేరుకుని, అక్కడి నుంచి సోమవారం చండీగఢ్ దిశగా తరలివెళ్తారని భావిస్తున్నారు. ఇలా ఉండగా, పంజాబ్ హరియాణా హైకోర్టు ఆదేశాల ప్రకారం..రైతులు రోడ్లపై బైఠాయించడం ధిక్కరణ కిందికి వస్తుందని పంచ్‌కుల పోలీస్ కమిషనర్ తెలిపారు. రైతుల ప్రవేశాన్ని నిరోధించేందుకు చండీగఢ్ యంత్రాంగం మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసింది. చండీగఢ్–పంచ్‌కుల మార్గాన్ని మూసేసింది.

గాజాలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

జెరూసలేం: గాజా స్ట్రిప్‌పై పట్టుబిగించేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోందన్న వాదనకు బలం చేకూరుస్తూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదివారం అక్కడ అడుగుపెట్టారు. యుద్ధంలో మునిగి తేలుతున్న తమ సైనికుల్లో నైతిక స్థైర్యం పెంచేందుకే వచ్చానని చెప్పారు. ఇజ్రాయెల్ బయట పెట్టిన హమాస్ సొరంగం వద్ద తమ కమాండర్లు, సైనికులతో మాట్లాడారు. ''మనవి మూడే లక్ష్యాలు. హమాస్ అంతం. బందీలందరినీ క్షేమంగా విడిపించడం. భవిష్యత్తులో మరెన్నడూ ఇజ్రాయెల్‌కు ముప్పుగా మారకుండా గాజాను 'సరిచేయడం'' అని అన్నారు. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి, చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఉత్తర గాజాలో పర్యటించారు.

మరో 17 మంది బందీల విడుదల

- 14 మంది ఇజ్రాయెలీలు, ముగ్గురు విదేశీయులకు విముక్తి
- 39 మంది పాలస్తీనియన్ ఖైదీలను వదిలిపెట్టిన ఇజ్రాయెల్

గాజాస్ట్రిప్: ఇజ్రాయెల్–హమాస్ గ్రూప్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలు విషయంలో సందిగ్ధత వీడింది. ఒప్పందానికి ఇరుపక్షాలు కట్టుబడి ఉంటున్నాయి. మూడో విడత కింద ఆదివారం మరో 17 మంది బందీలకు హమాస్ విముక్తి కలిగించింది. వీరిలో 14 మంది ఇజ్రాయెలీలు, ముగ్గురు విదేశీయులు ఉన్నారు. అలాగే 39 మంది పాలస్తీనియన్ ఖైదీలను ఇజ్రాయెల్ అధికారులు విడుదల చేశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ హమాస్ మిలిటెంట్లు శనివారం బందీలను విడుదల చేయడానికి నిరాకరించారు. ఒప్పందం అమలుపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, ఒప్పందం యథాతథంగా అమలవుతున్నట్లు కొన్ని గంటల తర్వాత తేటతెల్లమయ్యింది. శనివారం బందీల్లోని 13 మంది ఇజ్రాయెలీలను, నలుగురు థాయ్‌లాండ్ జాతీయులను హమాస్ విడుదల చేసింది. వీరిలో నాలుగేళ్ల అమెరికన్–ఇజ్రాయెలీ చిన్నారి అబిగైల్ ఎడాన్ కూడా ఉంది. ఆమె తల్లిదండ్రులను అక్టోబర్ 7న మిలిటెంట్లు హత్య చేశారు. అమెరికా బందీలంతా సైతం అతిత్వరలో విడుదలవుతారని ఆశిస్తున్నామని శ్వేతసౌధం జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవన్ చెప్పారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై అనూహ్యంగా దాడి చేసిన హమాస్ మిలిటెంట్లు 240 మందిని బందీలుగా మార్చి, గాజాకు తరలించిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్–హమాస్ మధ్య నాలుగు రోజుల కాల్పుల విరమణ ఒప్పందం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఇప్పటిదాకా మూడు విడతల్లో మొత్తం 58 మంది బందీలకు హమాస్ స్వేచ్ఛ కల్పించింది. నాలుగో విడత కింద సోమవారం మరికొంత మంది విడుదల కానున్నారు. మరోవైపు శనివారం రాత్రి ఆక్రమిత వెస్ట్‌బ్యాంకులో ఇజ్రాయెల్ దాడుల్లో ఆరుగురు పాలస్తీనియన్లు మరణించారు.

హమాస్ సీనియర్ కమాండర్ హతం

ఇజ్రాయెల్ దాడిలో హమాస్ సీనియర్ కమాండర్ అహ్మద్ అల్–ఘందౌర్(56) మృతి చెందాడు. ఈ విషయాన్ని హమాస్ ఆదివారం స్వయంగా ప్రకటించింది. అయితే, ఈ దాడి ఎప్పుడు, ఎక్కడ జరిగిందన్న సంగతి బయటపెట్టలేదు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటిదాకా మరణించిన హమాస్ కమాండర్లలో అహ్మద్ అల్–ఘందౌర్ అత్యంత పెద్ద హోదా ఉన్న నేత కావడం గమనార్హం. ఉత్తర గాజాలో హమాస్ గ్రూప్‌నకు నాయకత్వం వహిస్తున్నాడు. హమాస్ సాయుధ విభాగంలో హై–ర్యాంకింగ్ కలిగి ఉన్నాడు. 2002నుంచి ఇజ్రాయెల్ సైన్యం సాగించిన హత్యాయత్నాల నుంచి మూడుసార్లు తప్పించుకున్నాడు.


చెర నుంచి విడుదలైన ఎడాన్

సాక్షి కరీంనగర్

సోమవారం ၊ 27 ၊ నవంబర్ ၊ 2023



రాజన్నకు జనసందడి

వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



మల్లన్నకు పట్నాలు

ఓదెల: ఓదెల శ్రీమల్లికార్జునస్వామిని ఆదివారం వేలాది మంది దర్శించుకున్నారు. పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/22.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోటీ పరీక్షలు విద్యార్థుల నైపుణ్యానికి దోహదం



సావనీర్ ఆవిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సరళ రేఖ

సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రస్తుతకాలంలో పోటీపరీక్షలతో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొంది ఉన్నతస్థాయికి ఎదుగుతారని 3వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సరళరేఖ అన్నారు. ఆదివారం సిద్ధార్థ స్కూల్ చైర్మన్ దివంగత దాసరి నర్సింహారెడ్డి స్మారకార్థం పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్విజోన్–2023 ప్రిలిమినరీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి పరీక్షలతో విద్యార్థులలో పోటీతత్వం అలవడుతుందని అన్నారు. సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం క్విజోన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరు గ్రూపులను ఫైనల్ రౌండ్‌కు ఎంపిక చేసి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన గ్రూప్‌లకు నగదు పారితోషికాలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలకు చెందిన సావనీర్‌ను జూనియర్ సివిల్ జడ్జి సరళరేఖ ఆవిష్కరించారు.

ఆలోచించి ఓటేయాలి..



అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

- వేములవాడ, జగిత్యాలలో సీఎం ప్రజా ఆశీర్వాద సభ
- వేములవాడలో లక్ష్మీనర్సింహారావుకు మద్దతుగా సభ, జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ తరఫున కేసీఆర్ ప్రచారం

వేములవాడ/జగిత్యాల: సీఎం కేసీఆర్ ఆదివారం ఉమ్మడి జిల్లాలోని వేములవాడ, జగిత్యాల నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. ముందుగా జగిత్యాలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మూడోసారి అధికారం చేపట్టి జగిత్యాలను కరీంనగర్‌లా మార్చుతామన్నారు. ప్రజలు ఆగం కావొద్దని, ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను రెండోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారని వెల్లడించారు. కాంగ్రెస్ హయాంలో నీరు లేక, ఉద్యోగాలు లేక, కరెంట్ లేక గోస పడ్డామని, రైతుల ఆత్మహత్యలు, ఎన్నో ఘోరాలు చూశామని, తెలంగాణ తెచ్చుకున్నాక ఆ సమస్యలన్నీ తీరాయని వెల్లడించారు. జిల్లా అభివృద్ధి కళ్లముందే కనబడుతోందని, మెడికల్ కళాశాల, వరదకాలువ, సంక్షేమ పథకాలు కనిపిస్తున్నాయని తెలిపారు. రైతు రాజు కావాలనే ఉద్దేశంతో రైతుబంధు ఇస్తున్నామని, రైతులు ఎలాంటి సమస్యతో చనిపోయినా రైతుబీమా అందిస్తున్నామని వివరించారు. సాగునీటి సమస్య లేకుండా చేయడంద్వారా జిల్లా మొత్తం ధాన్యంరాశులతో నిండిపోయిందన్నారు. నీటిపన్ను లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని అన్నారు. జిల్లాలో బస్తీ దవాఖానాలు, రోళ్లవాగు ప్రాజెక్ట్, వరద కాలువ వంటి అనేక పనులు చేసుకున్నామని వివరించారు. పొరబాటున కాంగ్రెస్ వస్తే కరెంట్ మళ్లీ మూడు గంటలే వస్తుందన్నారు.

లక్ష్మీనరసింహారావు అభివృద్ధి చేస్తాడు..

వేములవాడలో మాట్లాడుతూ.. వేములవాడ అభ్యర్థి లక్ష్మీనర్సింహారావు యువకుడని, కచ్చితంగా అభివృద్ధి చేసి తీరుతాడని వెల్లడించారు. రమేశ్‌బాబు గొప్ప వ్యక్తి అని, కోర్టు కేసులతోనే ఆయనను మార్చాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో వేములవాడ, సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాలను కల్లోలిత ప్రాంతంగా ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మరాజ్యం తెస్తామంటున్నారని.. ఇందిరమ్మ రాజ్యం బాగుంటే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ఎందుకు పెట్టేవారని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే మళ్లీ ఆకలికేకలు వినిపిస్తాయన్నారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు.

భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే రమేశ్‌బాబు

తొలుత ప్రసంగించిన ఎమ్మెల్యేర మేశ్‌బాబు ఈ ప్రాంత సమస్యలు సీఎంకు వివరిస్తూనే భావోద్వేగానికి గురయ్యారు. కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు, ముంపు గ్రామాల సమస్య, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించండి



పోస్టల్ బ్యాలెట్ తీరును పరిశీలించి, సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

- నేడే ఆఖరు
- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: పోస్టల్ బ్యాలెట్ తీసుకున్న వారంతా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి సూచించారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాలలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు వచ్చిన చిట్టచివరి వ్యక్తి వరకు వారి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించి పోస్టల్ బ్యాలెట్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం రాత్రి కరీంనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో, కలెక్టరేట్ ఆడిటోరియంలో కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. శాసనసభ ఎన్నికల్లో భాగంగా ఉద్యోగులతో పాటు ఎసెన్సియల్ సర్వీసెస్‌లో ఉన్నవారికి ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించిందని అన్నారు. కరీంనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరుకౌంటర్లను పరిశీలించారు. ఒక్క కరీంనగర్ ఆర్‌ఓ కార్యాలయం ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు 5,960 మంది నుంచి దరఖాస్తులు వచ్చాయని, అందులో శనివారం వరకు 2,022 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకు 870మంది వారి ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. సోమవారం నాటికి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియకు చివరి రోజు కావడంతో అవసరమైతే రాత్రివరకు కూడా కౌంటర్లను నిర్వహించాలని తెలిపారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆడిటోరియంలో కరీంనగర్, మానకొండూర్, చొప్పదండి, హుజురాబాద్ నియోజక వర్గాలతో పాటు రాజన్న సిరిసిల్ల, వేములవాడ ఇతర జిల్లా కౌంటర్లను పరిశీలించారు. కరీంనగర్ రిటర్నింగ్ అధికారి కుందారపు మహేశ్వర్, ఇన్‌చార్జి సీఈవో పవన్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.సదానందం, తహసీల్దార్‌లు నవీన్, రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఎస్సారార్ కళాశాలలో జరగనున్నందున సదరు ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఆదివారం పరిశీలించారు. ఓట్ల లెక్కింపు రోజున ఏలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలుండాలని అధికారులకు సూచించారు. ఏజెంట్లకు, అధికారులకు కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు వేర్వేరు దారులుండాలని సూచించారు.

డ్రోన్లు, స్కై బెలూన్ వినియోగంపై నిషేధం



సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్ క్రైం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా, భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్టులు స్థానిక ఎస్సారార్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల గ్రౌండ్ నుంచి 12 కిలోమీటర్ల పరిధి వరకు, స్కై ఎయిర్ బెలూన్లు కిలోమీటర్ పరిధి వరకు వినియోగాన్ని నిషేధించడం జరిగిందని కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు సోమవారం ఉదయం 6 గంటల నుంచి ఈనెల 28వ తేదీ ఉదయం 6గంటల వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

విద్యుత్ భవన్‌లో రాజ్యాంగ దినోత్సవం

కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ విద్యుత్ భవన్‌లో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఈ చాంబర్‌లో రాజ్యాంగ సభ పీఠికను అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎస్ఈ వి.గంగాధర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ సభ ఈ పీఠికను నవంబర్ 26న ఆమోదించగా 1950 జనవరి 26న అమలులోకి వచ్చిందన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించడంతో పాటు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. డీఈలు జె.రాజం, గోపికృష్ణ, ఏడీఈలు నరేందర్, సుధీర్‌కుమార్, రాజలింగు, ఎస్ఏవో రాజేశం, ఏవోలు అరవింద్, రాజేంద్రప్రసాద్, మునీందర్, కె.శ్రీనివాస్, శ్రీహరి, కాళిదాసు, కుసుమ శ్రీనివాస్, జీవీరావు, కె.శ్రీనివాస్, మల్లయ్య, సృజన, రమ్యకృష్ణ, శ్రీలత, శ్రీకాంత్, పీవో చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ దినోత్సవంలో విద్యుత్ ఉద్యోగులు

కోడ్ పక్కాగా అమలు చేయాలి

- ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు బీఆర్.బాలకృష్ణ

కరీంనగర్ అర్బన్: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాల అమలులో అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు బి.ఆర్.బాలకృష్ణ, ఎన్నికల సాధారణ ప్రత్యేక పరిశీలకులు అజయ్ వినాయక్, స్పెషల్ పోలీస్ ఎలక్షన్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా అధికారులకు సూచించారు. ఆదివారం కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌజ్‌లో నాలుగు నియోజకవర్గాలలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. పోలింగ్ రోజు కన్నా ముందే ఓటర్లకు ఎపిక్ కార్డులు, ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి కావాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు

జిల్లాలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్ల గురించి జిల్లా ఎన్నికల అధికారి, సీపీలు పీపీటీ ద్వారా అబ్జర్వర్లకు వివరించారు. ఈ సమావేశంలో కేంద్ర ఎన్నికల జిల్లా పోలీస్ అబ్జర్వర్ ఎ.సతీష్‌గణేష్, జనరల్ అబ్జర్వర్లు డా.సి.ఆర్.ప్రసన్న, యం.ఆర్.రవి కుమార్, వ్యయపరిశీలకులు శివశంకర్, చిట్టే యోగేష్ సుగ్దే, జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి, సిపి అభిషేక్ మహంతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

పుస్తెలమ్ముకున్న వ్యక్తికి వేల కోట్లు ఎక్కడివి?

- అంగట్లో పశువులను కొన్నట్లు కొంటున్నారు
- బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓట్లేస్తే కటిక చీకట్లే
- స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్



తెలంగాణ చౌక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు

కరీంనగర్: ఎంపీ బండి సంజయ్ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా భార్య పుస్తెలు అమ్మి పోటీ చేశానని చెప్పుకున్నాడని, నాలుగున్నరేళ్లలోనే వేల కోట్లు ఎక్కడి నుంచి సంపాదించాడని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కరీంనగర్‌లోని రాంనగర్, తెలంగాణ చౌక్, మంచిర్యాల చౌరస్తా, నాకా చౌరస్తాలలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మవద్దని, ఓట్లు వేయించుకుని కనబడకుండా మాయమైపోతారని ఆరోపించారు. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి భూకబ్జాదారుడని, బీజేపీ అభ్యర్థి అవినీతిపరుడని మండిపడ్డారు. బండి సంజయ్ అవినీతి డబ్బుతో ఎంపీటీసీ, సర్పంచులు, కౌన్సిలర్లను అంగట్లో పశువులను కొన్నట్లు కొంటున్నాడని ఆరోపించారు. బండి సంజయ్ కేంద్రం నుంచి కరీంనగర్‌కు నిధులు తేవడంలో విఫలమయ్యాడని, అభివృద్ధిని పట్టించుకోలేదని అన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా ఓటమి చెంది ఎంపీ ఎన్నికల్లో గుండెపోటు డ్రామాలాడి గెలిచాడని, కొద్దికాలంలోనే వేల కోట్లకు పడగలెత్తాడని, ఆయన అవినీతిని భరించలేకే బీజేపీ అధిష్టానం ఉన్నఫలంగా రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతల నుంచి తప్పించిందని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధి చేసే బీఆర్ఎస్ పార్టీకి ఓటేయాలని కోరారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని సూచించారు. మేయర్ వై.సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్, కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, దిండిగాల మహేశ్, కచ్చు రవి, గందె మాధవి, రమణారావు, సరిళ్ల ప్రసాద్, అర్ష కిరణ్మయి, కుర్ర తిరుపతి, ఎడ్ల సరిత పాల్గొన్నారు.

గంగులకు ఎమ్మార్పీఎస్ మద్దతు

గంగుల కమలాకర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాతంగి రమేశ్, జిల్లా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గాలిపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం మీసేవా కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్ రమేశ్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దళితబంధు లాంటి పునరావృతమవుతాయని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న వినోద్ కుమార్

బీఆర్ఎస్‌కు 90 సీట్లు ఖాయం: వినోద్ కుమార్

బీఆర్ఎస్ 90 సీట్లను కైవసం చేసుకొని ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడబోతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ పార్టీ మధ్యనే పోటీ జరుగుతుందని, బీజేపీ సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతుందని, రానున్న ప్రభుత్వం మళ్లీ బీఆర్ఎస్‌దేనని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ గెలుస్తుందనేది కేవలం గాసిప్ మాత్రమేనని, పోల్ మేనేజ్‌మెంట్ తరహాలో కిరాయి వ్యక్తులు కాంగ్రెస్ గెలుస్తుందని ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ అన్ని సీట్లను కైవసం చేసుకుంటుందని, సగం స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు దరిదాపుల్లో కూడా ఉండదని అన్నారు. ఎన్నికల తరువాత కాంగ్రెస్ కనుమరుగు కావడం ఖాయమని, బీజేపీ పత్తా లేకుండా పోతుందని అన్నారు. ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా బీజేపీ, కాంగ్రెస్‌ల ఆటలు తెలంగాణలో చెల్లవని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, నాయకులు అక్బర్, జక్కుల నాగరాజు యాదవ్, దూలం సంపత్ కుమార్ గౌడ్, సాయికృష్ణా, వర్థినేని సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

ఎంపీపీ పిల్లి శ్రీలత ప్రచారం

కొత్తపల్లి: మంత్రి గంగుల కమలాకర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరుతూ ఆదివారం కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ఓట్లు అభ్యర్థించారు.

జిల్లా అభివృద్ధికి రూ.9వేల కోట్లు తెచ్చా!

- కేంద్రం సొమ్ముతో రాష్ట్రం సోకులు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు భూకబ్జాదారులు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎంపీ బండి సంజయ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: జిల్లాకు రూ.9వేల కోట్లు తెచ్చానని కరీంనగర్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్రం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం సోకులుపడుతుందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఆయన 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.



సాక్షి: గెలిపిస్తే కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ చేసిందేమీ లేదనే ప్రచారం జరుగుతోంది?

బండి: నేను ఎంపీగా ఎన్నికైనప్పటి నుంచి కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం దాదాపు రూ.9 వేల కోట్ల నిధులు తీసుకొచ్చిన. తీగలగుట్టపల్లి లెవెల్ క్రాసింగ్ (ఎల్‌సీ.నెం.18) వద్ద కేంద్రం రైల్వే ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేసింది. రాష్ట్రం వాటా ఇవ్వకపోయినా కేంద్రాన్ని ఒప్పించి సేత బంధన్ స్కీం కింద రూ.153 కోట్లు తీసుకొచ్చిన. కానీ నేను ఢిల్లీలో ఉన్న సమయాన్ని చూసి అధికారులతో కలిసి గంగుల కొబ్బరికాయ కొట్టి నిధులు తానే తీసుకొచ్చినట్లు ప్రచారం చేసుకున్నాడు. స్మార్ట్ సిటీ నిధులు రూ.196 కోట్లు నేను తీసుకొచ్చిన. వాటిని దారి మళ్లించుకున్నరు. జాతీయ రహదారుల నిర్మాణానికి మొత్తం రూ.4,624 కోట్లు మంజూరయ్యాయి. ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట ఎన్‌హెచ్–765 డీజీ, కరీంనగర్ నుంచి జగిత్యాల ఎన్‌హెచ్– 563, కరీంనగర్– వరంగల్ ఎన్‌హెచ్– 563 వరకు రూ.578 కోట్లు. కేంద్ర ప్రభుత్వం ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ కింద కరీంనగర్‌కు రూ. 24,106 కోట్లు కేటాయించింది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీ.ఎం.జీ.ఎస్.వై) కింద రోడ్ల కోసం రూ.13,486 కోట్లు, వంతెనల కోసం రూ.3,039 కోట్లు మంజూరయ్యాయి. దీపం, ఉజ్వల కార్యక్రమాలలో భాగంగా 1.3లక్షల ఎల్పీజీ కనెక్షన్లు జారీ అయ్యాయి. ఇలా కేంద్ర నిధులతో రాష్ట్రం సోకులు చేసుకుంటుంటే.. ఇక్కడ అంతా తానే చేసినట్లు గంగుల చెబుతుంటే జనం నవ్వుకుంటున్నరు.

సాక్షి: బీసీ సీఎం నినాదం తీసుకున్న బీజేపీ, మిమ్మల్ని అధ్యక్షుడిగా ఎందుకు తొలగించారు?

బండి: అధిష్టానం నాకు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్నత పదవి ఇచ్చింది. రాష్ట్రమంతా తిరిగి ప్రచారం చేయాలని స్టార్ క్యాంపెయినర్ హోదా ఇచ్చి ప్రత్యేక హెలికాప్టర్ సమకూర్చింది. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సిట్టింగ్ ఎంపీ నైనా నన్ను కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టారు. అంతే తప్ప గంగుల చేస్తున్న ప్రచారంలో ఇసుమంతైనా నిజం లేదు.

సాక్షి: బీఆర్ఎస్ గెలుపు కోసం బీజేపీ తెలంగాణలో పని చేస్తుందని కాంగ్రెస్ ఆరోపణలపై ఏమంటారు?

సాక్షి: దొంగే దొంగ అని అరిచినట్లుంది కాంగ్రెస్ నేతల యవ్వారం. గతంలో పొత్తులు పెట్టుకుని, అధికారం పంచుకుంది ఎవరు?. కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లోకి వెళ్లి పదవులు అనుభవిస్తోందెవరు? సిద్ధాంతాలు, విధానాల ప్రాతిపదికగా నడిచే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమే.

సాక్షి: కవితను అరెస్టు చేయకపోవడం వల్ల బీజేపీ గ్రాఫ్ తగ్గినట్లుంది కదా?

బండి: బీజేపీ ప్రభుత్వ హయాంలోనే ఆమెపై కేసు నమోదైంది. కేసు కోర్టులో ఉంది. దర్యాప్తు సంస్థలు చట్టపరంగా ముందుకు సాగుతున్నాయి. అంతే తప్ప మీడియా రాసిందనో, కాంగ్రెస్ అడిగిందనో అరెస్ట్ చేయరు.

సాక్షి: మీకు బీఆర్ఎస్‌తో ఒప్పందం ఉందా?

బండి: ఇదో పెద్ద జోక్. ఎంపీగా, రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ప్రజా సమస్యలపై పోరాడాను. ఆ సమయంలో కరీంనగర్‌పై ఫోకస్ కొంత తగ్గించాను. అంతే తప్ప బీఆర్ఎస్‌తో నాకెలాంటి ఒప్పందం లేదు. పైగా గంగుల నా రాజకీయ ప్రత్యర్థి. రెండుసార్లు ఆయనపై పోటీ చేసిన సంగతిని మర్చిపోతున్నారు.

సాక్షి: ఎమ్మెల్యేగా ఈసారి మీ విజయావకాశాలు ఎలా ఉన్నాయి?

బండి: కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులిద్దరూ భూకబ్జాదారులు. మూడుపర్యాయాల గంగుల హయాంలో అవినీతి పెరిగిందన్న భావన ప్రజల్లో నెలకొంది. ఈ నియోజకవర్గంలో పేదల గొంతుకగా ఉన్నా. ప్రజల ఆశీర్వాదంతో నేను ఎమ్మెల్యేగా ఎన్నికవడం ఖాయం.

సాక్షి: అధికారంలోకి రాలేని బీజేపీ బీసీని ముఖ్యమంత్రిగా ఎలా చేస్తుంది?

బండి: ఇదంతా కాంగ్రెస్, బీఆర్ఎస్ దుష్ప్రచారం. 2018 తరువాత జరిగిన దుబ్బాక, జీహెచ్ఎంసీ, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో, టీచర్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ స్థానం ఎక్కడుంది? ఈ అన్ని ఎన్నికల్లో బీజేపీవి అద్భుత ఫలితాలు. ప్రజా పోరాటాలు చేసే బీజేపీ కాకుండా, ఏనాడూ పోరాటాలు చేయని కాంగ్రెస్‌ను ఎలా గెలిపిస్తారు?

సాక్షి: ఎస్సీ వర్గీకరణ కేవలం ఎలక్షన్ స్టంటేనా?

బండి: మందకృష్ణ మాదిగ తన జీవితమంతా మాదిగ సమాజ అభ్యున్నతికి అంకితం చేశారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ మొదటి నుంచి కట్టుబడి ఉంది.

సాక్షి: మోదీ బహిరంగ సభ ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

బండి: యావత్ ప్రపంచమే 'ది బాస్'గా అభివర్ణిస్తున్న నేపథ్యంలో ప్రధాని మోదీని చూసేందుకు స్వచ్ఛందంగా జనం తరలివస్తున్నారు. మోదీ వల్లే దేశం, తెలంగాణ సుస్థిరంగా ఉంటుందనే భావన ప్రజల్లో నెలకొంది. కనీవినీ ఎరగని రీతిలో మోదీ సభ సక్సెస్ అవుతుందనే నమ్మకం నాకుంది.

క్లుప్తంగా

అల్ఫోర్స్‌ స్కాలర్‌షిప్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌కు స్పందన



టెస్ట్‌ గురించి వివరిస్తున్న డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్‌): అల్ఫోర్స్‌ ఆధ్వర్యంలో వివిధ బ్రాంచ్‌లలో ఆదివారం నిర్వహించిన 'అల్ఫోర్స్‌ స్కాలర్‌షిప్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌'కు అనూహ్య స్పందన లభించినట్లు విద్యా సంస్థల చైర్మన్‌ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 4,753 మంది పదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలో అద్భుత మెరిట్‌ సాధించిన విద్యార్థులకు ఐఐటీ, నీట్‌లలో రెండేళ్ల ప్రోగ్రాంలో స్కాలర్‌షిప్‌ అందించడం జరుగుతుందని వివరించారు. స్కాలర్‌షిప్‌ టెస్టు రాసిన విద్యార్థులను అభినందించారు.

ముక్కెర రాజుకు న్యాయశ్రీ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న సాహితి శ్రీకావ్య

హుజూరాబాద్‌: పట్టణానికి చెందిన సీనియర్‌ న్యాయవాది ముక్కెర రాజు హైదరాబాద్‌లోని మదర్‌ ఫౌండేషన్‌ తరఫున న్యాయశ్రీ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆదివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో హైకోర్టు న్యాయమూర్తి ఎస్‌.నంద, భీంరావ్‌ యశ్వంత్‌ అంబేద్కర్‌ చేతుల మీదుగా రాజు కుమార్తె హైకోర్టు న్యాయవాది సాహితి శ్రీకావ్య పురస్కారం స్వీకరించారు.

'కాళేశ్వరం ప్రాజెక్టులో వేలకోట్ల అవినీతి'



వేణుగోపాల్‌

కరీంనగర్‌: బీఆర్‌ఎస్‌ అవినీతి ప్రభుత్వాన్ని ఓడించాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్‌ డెమోక్రటిక్‌ ఫ్రంట్‌ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్‌ అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో మాట్లాడారు. రైతులకు ఉపయోగపడని కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కేసీఆర్‌ వేలకోట్ల అవినీతి చేయడానికి ఉపయోగపడిందని ఆరోపించారు. హైదరాబాద్‌లో 111 జీవోను ఎత్తివేయడంతో కేసీఆర్‌కు కోట్లాది రూపాయల ముడుపులు ముట్టాయని ఆరోపించారు. ధరణి పోర్టల్‌ ద్వారా 20 లక్షల ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టి భూ యజమానులను భయభ్రాంతులకు గురిచేశారని అన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తున్నామని గొప్పలు చెప్పి ఎక్కడా ఇవ్వలేదన్నారు. దళిత బంధు, బీసీ బంధు నామమాత్రంగానే ఉండిపోయిందని, బీఆర్‌ఎస్‌ బంధువుగా మారిపోయిందని మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే చాలామందిపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. ఇలాంటి అహంకార ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు.

వివాహిత అదృశ్యం

జమ్మికుంట(హుజూరాబాద్‌): మండలంలో ఓ వివాహిత అదృశ్యమైంది. పట్టణ సీఐ రమేశ్‌ వివరాల ప్రకారం.. మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత తన కుమారుడితో ఈ నెల 24న జమ్మికుంట పట్టణానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. కుటుంబ సభ్యులు తమ బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. వివాహిత భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పేర్కొన్నారు.

ఇదీ సెక్షన్‌.. తప్పదు యాక్షన్‌

- నిబంధనలు అతిక్రమిస్తే ఎవరైనా శిక్షార్హులే
- ఎన్నికల చట్టాలపై యువతలో పెరిగిన ఆసక్తి
- ఇంటర్నెట్‌లో సర్చ్‌ చేస్తున్న విద్యార్థులు, యువత

కరీంనగర్‌ అర్బన్‌: ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకులను ఎన్నుకోవడానికి చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఎన్నికల సమయంలో ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం ఎక్కువ కేసులు నమోదు చేస్తుంటారు. ప్రచారంలో పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు అదుపుతప్పి వ్యవహరిస్తే దండన తప్పదు. సామాన్య పౌరులు సైతం ఫిర్యాదు చేసినా.. పోలీసులు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు. పలువురు విద్యార్థులు, యువత ఇంటర్నెట్లో ఎన్నికల చట్టాలు– నిబంధనల గురించి సెర్చ్‌ చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కొన్ని ఎన్నికల చట్టాలను వివరించే కథనం.



సెక్షన్‌ 123: జాతి, మతం, కులం, సంఘం, భాషను రెచ్చగొట్టేలా వ్యవహరించడం, ఒత్తిడికి లోను చేస్తే.. ఈ సెక్షన్‌ కింద ఫిర్యాదు చేయొచ్చు.

125: ఎన్నికల సందర్భంగా వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంపొందిస్తే మూడేళ్ల పాటు జైలు శిక్ష లేదా జరిమానా రెండింటినీ విధించే అవకాశం ఉంటుంది.

126: ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు నిర్వహిస్తే శిక్షార్హులు. దీనికి రెండేళ్ల జైలు లేదా జరిమానా విధిస్తారు.

127: ఎన్నికల సమావేశం సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడినా.. పోలీస్‌ అధికారి అయినా ఆ వ్యక్తులను అరెస్టు చేయొచ్చు. ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.2 వేల జరిమానా.

128: బహిరంగంగా ఓటేస్తే మూడు నెలల జైలు లేదా జరిమానా.

129: ఎన్నికలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది, పోలీసులు పోటీచేసే అభ్యర్థికి సహకరించినా, ప్రభావం కలిగించినా శిక్షార్హులు. దీనికిగాను 3 నెలల జైలుశిక్ష లేదా జరిమానా విధిస్తారు.

130: పోలింగ్‌ స్టేషన్‌కు 100 మీటర్ల లోపల ప్రచారం చేయొద్దు. ఒకవేళ చేస్తే రూ.250 జరిమానా పడుతుంది.

131: పోలింగ్‌ కేంద్రానికి సమీపంలో నిబంధనలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే.. ఏ పోలీస్‌ అధికారి అయినా ఆ సామగ్రిని స్వాధీనం చేసుకోవచ్చు. 3 నెలల జైలుశిక్ష లేదా జరిమానా, రెండూ అమలు చేయొచ్చు.

132: ఓటేసే సమయంలో నియమ నిబంధనలు పాటించనివారికి 3 నెలల జైలు శిక్ష లేదా జరిమానా.

134: అధికార దుర్వినియోగానికి పాల్పడితే శిక్షార్హులే. ఇందుకు రూ.500 జరిమానా విధిస్తారు.

134(అ): ఠాణా పరిసర ప్రాంతాలకు మారణాయుధాలతో వెళ్లడం నిషేధం. అలా వెళ్లినవారికి 2 నెలల జైలుశిక్ష, జరిమానా వేస్తారు.

135: పోలింగ్‌ కేంద్రం నుంచి బ్యాలెట్‌ పత్రం, ఈవీఎం అపహరిస్తే శిక్షార్హులు. ఏడాది పాటు జైలుశిక్ష, రూ.500 జరిమానా.

135(ఇ): పోలింగ్‌, కౌంటింగ్‌ రోజున మద్యం విక్రయించడం, మద్యం, డబ్బు ఇవ్వడానికి ఆశ చూపడం నేరం. అందుకు 6 నెలల జైలుశిక్ష, రూ.2 వేల వరకు జరిమానా.

133: ఎన్నికల సందర్భంగా ఓటర్లను పోలింగ్‌ బూత్‌ వద్దకు చేరవేసేందుకు వాహనాలు సమకూర్చినా, అద్దెకు తీసుకున్నా శిక్షార్హులు. అందుకు 3 నెలల జైలుశిక్ష, జరిమానా.

135(అ): ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల రోజు వేతన సెలవుగా మంజూరు చేసినా శిక్ష, అందుకు రూ. 5వేల జరిమానా విధించొచ్చు.

49పీ: ఒక వ్యక్తి ఓటు మరొకరు వేస్తే పోలింగ్‌ ఆఫీసర్‌కు సదరు ఓటరు 49–పీ సెక్షన్‌ ప్రకారం తన ఆధారాలు చూపాలి. ప్రిసైడింగ్‌ ఆఫీసర్‌ సదరు ఓటరుకు ఓటు వేసే అధికారం కల్పిస్తారు.

134(అ): ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల ఏజెంటుగా గానీ పోలింగ్‌ ఏజెంటుగా గానీ, ఓట్ల లెక్కింపు సందర్భంగా గానీ ఏజెంటుగా వ్యవహరిస్తే శిక్షార్హులు. అందుకు 3 నెలల జైలుశిక్ష లేదా జరిమానా.

బీఆర్‌ఎస్‌, ఎంఐఎం.. బీజేపీ బీ టీం

- దోచుకోవడమే పనిగా కేసీఆర్‌ కుటుంబం
- నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌దే విజయం
- అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు
- ఛత్తీస్‌గఢ్‌ సీఎం భూపేష్‌ బగేల్‌



అభివాదం చేస్తున్న ఛత్తీస్‌గఢ్‌ సీఎం భూపేష్‌ బగేల్‌, కాంగ్రెస్‌ నాయకులు

కరీంనగర్‌ కార్పొరేషన్‌: బీఆర్‌ఎస్‌, ఎంఐఎంలు బీజేపీకి బీ టీం అని, ఈ మూడు పార్టీలు ఒక్కటేనని ఛత్తీస్‌గఢ్‌ ముఖ్యమంత్రి భూపేష్‌ బగేల్‌ అన్నారు. దేశంలో ఎన్నికలు జరుగుతున్న నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌పార్టీ విజయం సాధిస్తుందన్నారు. కాంగ్రెస్‌ అంటేనే భరోసా అని, అధికారంలోకి రాగానే తెలంగాణలో ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తుందని ఆయన తెలిపారు. ఆదివారం నగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే మైదానంలో నిర్వహించిన కాంగ్రెస్‌ పార్టీ బహిరంగసభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 30న నాలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌ ఘన విజయం సాధిస్తుందని, తెలంగాణలో కాంగ్రెస్‌ ప్రభుత్వం రాబోతోందని చెప్పారు. కాంగ్రెస్‌ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తెలంగాణను కేసీఆర్‌ లూటీ చేస్తుంటే, ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉంటున్నాడన్నారు. తెలంగాణలో బీజేపీ గెలిచే సత్తా లేదన్నారు. దేశవ్యాప్తంగా సిలిండర్‌ను రూ.500కు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ప్రజల కోసం సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, కేసీఆర్‌ ఆ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. ఆరు గ్యారంటీ పథకాలను ఛత్తీస్‌గఢ్‌ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్‌ అధికారంలోకి రావడంతోనే ఆరు గ్యారంటీలు అమలు చేసి చూపిస్తామని అన్నారు. రోటీని కాల్చేటప్పుడు తిప్పకపోతే మాడిపోతుందని, ఈ సారి రాష్ట్రంలో అలా రోటీని తిప్పితేనే తినగలుగుతామని చమత్కరించారు. ఈ సభలో కాంగ్రెస్‌ నాయకులు మస్తాన్‌అలీ, వైద్యుల అంజన్‌కుమార్‌, మేనేని రోహిత్‌రావు, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కట్ల సతీష్‌, ఆరిఫ్‌ అహ్మద్‌, ఎం.డి.తాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ద్వారానే స్వేచ్ఛ

రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే వ్యక్తి స్వేచ్ఛ సాధ్యమైందని కాంగ్రెస్‌ పార్టీ నాయకులు తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీసీసీ ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్‌, పీసీసీ మాజీ ఆర్గనైజింగ్‌ కార్యదర్శి ముల్కల ప్రవీణ్‌, బొబ్బిలి విక్టర్‌, కవిత, షబానా, జ్యోతి, రమేష్‌, సతీశ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట వేసిన బీజేపీని గెలిపిద్దాం

- బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాను సురేశ్‌



మాట్లాడుతున్న సురేశ్‌

కరీంనగర్‌: బీసీలకు పెద్దపీట వేస్తూ బీసీని ముఖ్యమంత్రి చేస్తామన్న బీజేపీని గెలిపిద్దామని, బీసీరాజ్యం తెచ్చుకుందామని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాను సురేశ్‌ అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. జాతీయస్థాయిలో అధికారంలో ఉన్న పార్టీ, ఒక బీసీ ప్రధానిగా ఉన్నటువంటి పార్టీ తెలంగాణాకు బీసీని సీఎం చేస్తామని ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. కరీంనగర్‌లో సమస్యలు పదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని విమర్శించారు. చేనేతల ఆత్మహత్యలను ప్రభుత్వం నివారించలేక పోయిందని ధ్వజమెత్తారు. కరీంనగర్‌ను డల్లాస్‌ సిటీగా చేస్తానన్న కేసీఆర్‌ హామీ పేద ప్రజల జేబులను ఖల్లాస్‌ చేసిందని తెలిపారు. కేసీఆర్‌ హయాంలో కరీంనగర్‌లోని సహజ వనరులు దోపిడీకి గురయ్యాయని ఆరోపించారు.. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర మీడియా కన్వీనర్‌ మారెపల్లి లక్ష్మణ్‌, కరీంనగర్‌ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రాచకొండ విఠలేశ్వర్‌, కార్యదర్శి రజనీకాంత్‌, సామనపల్లి లక్ష్మి, శంకరాచారి, కారపర్తి రమేశ్‌, గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షురాలు బండారు పద్మావతి, కార్యదర్శి మిర్యాల శ్రీలత, రాష్ట్ర కమిటీ సభ్యులు బలరాం, రాష్ట్ర యువజన కన్వీనర్‌ మడత కిశోర్‌ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో అల్ఫోర్స్‌ విద్యార్థిని ప్రతిభ



సరస్వతిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): ఇటీవల జాతీయస్థాయి అండర్‌– 14 కరాటే కటాస్‌ విభాగంలో రామడుగు మండలం గోపాల్‌రావుపేటలోని అల్ఫోర్స్‌ స్కూల్‌ విద్యార్థి వి. సరస్వతి సిల్వర్‌ మెడల్‌ సాధించింది. ఈసందర్భంగా విద్యార్థిని అల్ఫోర్స్‌ విద్యాసంస్థల అధినేత డాక్టర్‌ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలు పట్టివేత

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండం బైపాస్‌ వద్ద పోలీసులు ఆదివారం రాత్రి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్‌, ఎస్సై వెంకట్‌, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ టీం (ఎఫ్‌ఎస్‌టీ) స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం వద్ద రాజీవ్‌ రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. ఈక్రమంలో గోదావరిఖని నుంచి రామగుండం వైపు వస్తున్న ఇన్నోవా వాహనంలో సోదాలు చేశారు. ఇందులో రూ.50లక్షల నగదు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నగదుకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు చూపించలేదన్నారు. నిబంధనల మేరకు సదరు సొమ్ము సీజ్‌ చేసినట్లు పోలీసులు వివరించారు.

వీణవంకలో మద్యం..

వీణవంక(హుజూరాబాద్‌): మండలంలోని చల్లూరు గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో సుమారు రూ.91వేల విలువగల మద్యం పట్టుకున్నట్లు ఎస్సై ఆసిఫ్‌ తెలిపారు. ఎస్సై వివరాలు.. దేశాయిపల్లి గ్రామానికి చెందిన దాగు అశోక్‌రెడ్డి చల్లూరు వైన్స్‌ నుంచి తన కారులో మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకొని అతడిని ప్రశ్నించగా.. బీజేపీ కార్యకర్తలకు, ఓటర్లకు మద్యం పంచాలని దేశాయిపల్లికి చెందిన పాకాల శ్రీనివాస్‌రెడ్డి, గాలేటి సురేందర్‌రెడ్డి రూ.91వేలు ఇచ్చారని అశోక్‌రెడ్డి చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు. మద్యం, కారును సీజ్‌ చేసి అశోక్‌రెడ్డి, పాకాల శ్రీనివాస్‌రెడ్డి, గాలేటి సురేందర్‌రెడ్డి, వైన్స్‌ షాపు మేనేజర్‌ నారాయణదాసు అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్‌ బోల్తాపడి యువకుడి మృతి

కోనరావుపేట: ట్రాక్టర్‌ బోల్తాపడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని నిజామాబాద్‌ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈర్ల లచ్చయ్య–లక్ష్మి దంపతుల కుమారుడు బాబు (24) వెంకట్రావుపేట–నిజామాబాద్‌ గ్రామాల మధ్య ఉన్న పొలం వద్దకు వెళ్లాడు. ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా బోల్తాపడడంతో బాబు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య నేహా, కుమారుడు విఘ్నేష్‌ (4), కూతురు తన్విత (3) ఉన్నారు. మృతుడి తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురిట్లోనే శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే అని బంధువుల ఆందోళన

సిరిసిల్లటౌన్‌: మెరుగైన వైద్యం అందుతుందని జిల్లాసుపత్రికి వస్తే..పురిట్లోనే పసికందు మృతిచెందిన సంఘటన సిరిసిల్లలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..బీవైనగర్‌కు చెందిన బల్ల మీనాక్షిను భర్త శ్రీకాంత్‌ శనివారం సాయంత్రం డెలివరీ కోసం జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చాడు. అడ్మిట్‌ చేసుకున్న వైద్యులు ఆదివారం ఉదయం తమకు ఎలాంటి సమాచారం లేకుండానే డెలివరీ చేశారని, మృతిచెందిన పసికందు పుట్టిందని చెప్పడంతో కన్నీరుమున్నీరయ్యారు. తాము ఆస్పత్రికి తీసుకువచ్చినప్పుడు ఆపరేషన్‌ చేయకుండా నిర్లక్ష్యం చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. ఇందులో తమ పొరపాటు ఏమీలేదని, ఇతర కారణాల వల్ల శిశువు మృతిచెందిందని పేర్కొన్నారు.

బీఎస్పీ అభ్యర్థి వాహనంపై దాడి

చందుర్తి (వేములవాడ): నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి గోలి మోహన్‌పై మండలకేంద్రంలో ఆదివారం దాడిచేశారు. మండలకేంద్రంలోని బీఎస్పీ పార్టీకి చెందిన కార్యకర్త మృతిచెందడంతో పరామర్శించేందుకు వెళ్లిన తమ వాహనంపై బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు దాడి చేశారంటూ ఆరోపించారు. మహిళా కార్యకర్తపై దుర్భాషలాడి, కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ రెండు వాహనాలపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అత్తలకు ఆసరా పింఛన్లు.. కోడండ్లకు సౌభాగ్యలక్ష్మి

- చొప్పదండి సభలో మంత్రి కేటీఆర్‌



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్‌

చొప్పదండి: అత్తలకు ఆసరా పింఛన్లు ఇస్తున్నారని కోడండ్లు నారాజ్‌గా ఉన్నారని, బీఆర్‌ఎస్‌ మళ్లీ అధికారంలోకి రాగానే వారికి సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.3 వేలు అందిస్తామని మంత్రి కేటీఆర్‌ అన్నారు. ఆదివారం చొప్పదండిలో నిర్వహించిన సభలో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్‌తో కలిసి మాట్లాడారు. తాగు, సాగు నీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్‌ అభ్యర్థి ఓడిపోతే సచ్చిపోత అంటున్నాడని, వాళ్లకు ఓటు వేస్తే మనం సచ్చిపోతామని ఎద్దేవా చేశారు. మరో అభ్యర్థి బీజేపీ తరుపున పోటీ చేస్తున్న బొడిగె శోభకు నోరు ఎక్కువని, ఏం మాట్లాడుతుందో తెలువదన్నారు. చొప్పదండి ప్రజలు చైతన్యవంతులని బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ చైర్‌పర్సన్‌ ఇప్పనపల్లి విజయలక్ష్మి, ఎంపీపీ చిలుక రవీందర్‌, జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, గడ్డం చుక్కారెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, స్వర్ణ, చంద్రశేఖర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

- సీపీఐ జాతీయ నేత చాడ



పార్టీలో చేరిన యువకులతో చాడ, తదితరులు

చిగురుమామిడి: యువత సన్మార్గంలో నడుస్తూ ప్రజల కోసం పనిచేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. చిగురుమామిడిలోని ముస్కురాజిరెడ్డి స్మారకభవనంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బొమ్మనపల్లి గ్రామానికి చెందిన 30 మంది యువకులు సీపీఐలో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలని, కార్యకర్తలకు సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుందని, హుస్నాబాద్‌ నుంచి పోటీ చేస్తున్న పొన్నం ప్రభాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్‌, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్‌ సభ్యులు అందె చిన్నస్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, రాకం అంజవ్వ, చట్ల సమ్మయ్య, మామిడి సంపత్‌, అందె సంపత్‌, పలువురు పాల్గొన్నారు.

దుడ్డెల వెంకటయ్య మృతి తీరనిలోటు

మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన మొదటి తరం సీపీఐ నాయకుడు దుడ్డెల వెంకటయ్య మృతి పార్టీకి తీరనిలోటని చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం వెంకటయ్య మృతదేహానికి ఎర్రజెండా కప్పి నివాళి అర్పించారు. వెంట పలువురు సీపీఐ నాయకులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ మోదీతోనే సాధ్యం

- ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మానకొండూర్‌: గత ప్రభుత్వాలు ఎస్సీవర్గీకరణను నిర్లక్ష్యం చేశాయని, ప్రధాని నరేంద్ర మోదీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారని, వర్గీకరణ మోదీతోనే సాధ్యమని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో ఆదివారం దళితులను ఉద్దేశించి మాట్లాడారు. దళితజాతి ఏళ్లుగా ఏబీసీడీ వర్గీకరణకు పోరాటం చేస్తుందన్నారు. అనేక ప్రభుత్వాలు వర్గీకరణకు అనుకూలమని చెబుతూ దాటవేసే ధోరణి అవలంబించాయన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం దళితులను మోసం చేసిందని, బీజేపీకి దళితులు మద్దతుగా నిలవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆరెపల్లి మోహన్‌, కులసంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం అందజేస్తున్న నాయకులు

జమ్మికుంట(హుజూరాబాద్‌): దేశ సంపదను కార్పొరేట్‌ సంస్థలకు తాకట్టు పెడుతున్న బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణంలో సీపీఎం రాజకీయ విధానం తెలిపే కరపత్రాన్ని ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్‌ఐసీ, బీఎస్‌ఎస్‌ఎల్‌, రైల్వే, రక్షణ రంగం, విమానాశ్రయాలను అనిల్‌ అంబానీ, అదానీలకు అప్పనంగా అమ్ముకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువులపై జీఎస్టీ పన్నులు వేసి పేద, మధ్యతరగతి ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని, నల్లధనం అకౌంట్లలో వేస్తానని ప్రజలు, నిరుద్యోగ యువతను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. నల్ల చట్టాలు తెచ్చి రైతులను బలితీసుకున్నారని, అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. కుల, మతాల మధ్య చిచ్చుపెడుతూ, రాజకీయ పబ్బం గడుపుకునే బీజేపీని ఓడించాలని అన్నారు. కార్యక్రమంలో జోన్‌ కార్యదర్శి శీలం అశోక్‌, కమిటీ సభ్యులు చెల్పూరి రాములు, దండిగారి సతీశ్‌, తిప్పరబోయిన శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

'జ్యోతిష్మతి'లో అ'పూర్వ'సమ్మేళనం



చైర్మన్‌ సాగర్‌రావు, పూర్వ ప్రిన్సిపాల్‌ థామస్‌తో విద్యార్థులు

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): జ్యోతిష్మతి సీబీఎస్‌ఈ పాఠశాల అకాడమీ విద్యాసంస్థల్లో 1995 నుంచి 2008 వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్‌ కళాశాలలో జరిగింది. ఈసందర్భంగా జ్యోతిష్మతి కళాశాల చైర్మన్‌ జువ్వాడి సాగర్‌రావు ఆధ్వర్యంలో గురువులను ఘనంగా శాలువాతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. పాఠశాలలో తమ అనుభవాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి ఇంతటివారిని చేసిన గురువులతోపాటు చైర్మన్‌ సాగర్‌రావుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలువురు గురువులు మాట్లాడుతూ.. జ్యోతిష్మతి విద్యాసంస్థలు ఎంతోమంది విద్యార్థులను ఉన్నతస్థానానికి తీసుకెళ్లాయని గుర్తుచేశారు. కళాశాలకు వెన్నుదన్నుగా నిలిచి ఎందరికో బతుకు నిచ్చిన చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సెక్రెటరీ సుమిత్‌ సాయిరావు, జ్యోతిష్మతి సీబీఎస్‌ఈ పాఠశాల పూర్వ ప్రిన్సిపాల్‌ థామస్‌, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

మానకొండూర్‌: మండలంలోని సదాశివపల్లి స్టేజీ సమీపంలో కరీంనగర్‌–వరంగల్‌ ప్రధాన రహదారిపై ఆదివారం లారీ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైనాయి. స్థానికుల కథనం మేరకు.. సదాశివపల్లి గ్రామానికి చెందిన సంగసాని రాజిరెడ్డి, కమటం సత్తయ్య ద్విచక్రవాహనంపై అల్గునూర్‌ వెళ్తుండగా, కరీంనగర్‌ నుంచి వరంగల్‌ వెళ్తున్న లారీ అతివేగంతో ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు గంటసేపు రహదారిపై బైఠాయించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీసంఖ్యలో వాహనాలు నిల్చిపోయాయి. మానకొండూర్‌ సీఐ రాజ్‌కుమార్‌, తిమ్మాపూర్‌ సీఐ ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు.

బైక్‌ ఢీకొని యువకుడికి గాయాలు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలకేంద్రంలో ఆదివారం ఓ పార్టీకి చెందిన ర్యాలీ ఉండటంతో ట్రాఫిక్‌ను వన్‌వేలో మళ్లించారు. దీంతో ఎదురెదురుగా వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి గ్రామానికి చెందిన చుక్క రాజశేఖర్‌, అంకారపు సాయికృష్ణ వెళ్తుండగా పెద్దలింగాపూర్‌కు యువకుడు బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో సాయికృష్ణ తలకు తీవ్రగాయాలు, రాజశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో ఆసుపత్రికి తరలించారు.

- ఓటేసేందుకు పేరెంట్స్‌ను తీసుకెళ్తాం
- 30న పోలింగ్‌లో పాల్గొనేలా చూస్తాం
- ప్రజాస్వామ్య పరిరక్షణకు మేముసైతం అంటున్న చిన్నారులు

అమ్మానాన్న.. ఓటేయండి!


స్టూడెంట్ ఎలక్షన్స్‌లో ఓటేసిన విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని ఇటీవల ఎన్నికల కమిషన్ నుంచి మొదలుకొని ప్రభుత్వ అధికారులు కోరుతున్నారు. 'మేము భవిష్యత్ ఓటర్లం.. మాకు ఓటు విలువ అనేది ఎప్పుడో ఐదేళ్లకు వచ్చే ఎన్నికలతో కాదు.. ఏటా మా స్కూల్‌లో జరిగే స్టూడెంట్ ఎన్నికల్లో తెలుస్తుంది. ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మా పేరెంట్స్ తప్పకుండా ఓటు వేసేలా మేం నడుం బిగిస్తాం. సమాజాన్ని బాగుపరిచే వారికే ఓటేయాలని కోరుతాం. నిస్వార్థ, నిజాయితీపరులను ఎన్నుకోవాలని వేడుకుంటాం' అని అంటున్నారు పదో తరగతి చదువుతున్న విద్యార్థులు. స్టూడెంట్ ఎన్నికల్లో పోటీ చేశాం, కొందరం గెలిచాం.. కొందరం ఓడినం. ప్రతీ విద్యార్థిని కలిసి ఓటు వేయాలని అడిగాం.. అలాగు ప్రతీ విద్యార్థి కూడా తమ పేరెంట్స్ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని కోరుతున్నారు. ప్రస్తుతం తమకు ఓటు హక్కు లేదని, వచ్చే ఎన్నికల్లో తామే ఓటేస్తాం అని పేర్కొన్నారు. మన భవిష్యత్ మనం వేసే ఓటు అనే విధంగా పేరెంట్స్‌కు అవగాహన కల్పిస్తామంటున్న చిన్నారులతో 'సాక్షి' చిట్ చాట్.

మంచి నాయకుడిని ఎన్నుకోవాలని చెబుతా..



ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో మంచి నాయకున్ని ఎన్నుకోవాలని పేరెంట్స్‌కు చెబుతా. నిజాయితీపరుడు ఎవరో తెలుసుకొని ఓటేయమంటా. వచ్చే ఎన్నికల నాటికి నా ఓటు రెడీ అవుతుంది. అప్పుడు నేను కూడా మంచి నాయకుడికి ఓటు వేస్తా.

– ఐజా

తప్పకుండా ఓటేయాలని చెబుతా..



ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో మా పేరెంట్స్ తప్పకుండా తమ ఓటును వినియోగించుకోవాలని చెబుతా. మా స్ట్రీట్‌లో ఉన్న వారందరికీ చెబుతా. ఓటింగ్‌లో ప్రతిఒక్కరూ పాల్గొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరుతా. ఇలాగే ప్రతి ఒక్కరూ చేస్తే ఓటింగ్ పర్సంటేజీ పెరుగుతుంది.

– యశ్వంత్

విద్యావంతులను..



రాజకీయాలంటే నేటి కాలంలో ఎవరు పడితే వారు వచ్చేస్తున్నారు. విద్యావంతులై మంచి నాయకత్వ లక్షణాలు ఉంటాయో వారికే ఓటేయాలని నేను మా పేరెంట్స్‌ను కోరుతా. ప్రతీరోజు ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటారో వారికే ఓటేయాలని చెబుతా.

– పరుశరాములు

సొసైటీకి ఉపయోగపడే వారిని..



యువర్ ఓట్ ఈజ్ యువర్ ఫ్యూచర్. ఇది తెలుసుకోవాలి. సొసైటీకి ఉపయోగపడే వారిని, ప్రజలకు అందుబాటులో ఉండే వారిని ఎన్నుకోవాలని నేను మా పేరెంట్స్‌కు సలహా ఇస్తా. ప్రస్తుతం ఓటు వేసేందుకు దూరంగా ఉంటున్నారు. అలా కాకుండా స్కూల్ విద్యార్థులందరూ తమ పేరెంట్స్ ఓటు వేసేలా చూడాలి.

– సన్విత

నేనే దగ్గరుండి తీసుకెళ్తా..



ఈనెల 30న జరిగే ఎన్నికల్లో మా పేరెంట్స్ ఓటేసేందుకు నేను దగ్గరుండి తీసుకెళ్తా. ప్రతిఒక్కరూ వారి పేరెంట్స్‌ను ఓటేసేందుకు దగ్గరుండి తీసుకెళ్లాలి. అప్పుడే ఓటింగ్ శాతం పెరుగుతుంది. సమాజానికి మంచి నాయకుడిని అందించిన వారిలో మనం కూడా భాగస్వాములం అవుతాం.

– రుత్విక్

నిజాయితీపరులను..



ఐదేళ్లకోసారి వినియోగించే ఓటు నిజాయితీపరులకు వేయాలని మా పేరెంట్స్‌కు చెబుతా. హామీలు నెరవేర్చే వారినే ఎన్నుకోవాలని, ఓటు వేసే ముందు మన అభివృద్ధిని ఆకాంక్షించే వ్యక్తి ఎవరో చూసి ఆలోచించి ఓటు వేయాలని చెబుతా.

– సుశాంత్

స్కూల్‌లో జరిగిన ఎన్నికలతో..



ఏటా స్కూల్‌లో జరిగే స్టూడెంట్ ఎలక్షన్స్‌తో మాకు ఓటు విలువ తెలిసింది. నేను ప్రస్తుతం స్కూల్‌కి హెడ్ గర్ల్. మొత్తం 320 ఓట్లు పోల్ అయితే నాకు 186 వచ్చాయి. అందరిని నాకే ఓటు వేయాలని అడిగా. మా పేరెంట్స్‌కు కూడా చెప్పి ఓటేసేందుకు పంపిస్తా.

– చిన్మయ

ఓటు విలువ తెలుసు..



ఏటా మా స్కూల్‌లో స్టూడెంట్ ఎలక్షన్స్ జూన్‌లో నిర్వహిస్తారు. బ్యాలెట్ పేపర్, స్టాంపు, సిరా మార్క్ ఇలా అచ్చం ప్రభుత్వం నిర్వహించే ఎన్నికల మాదిరిగానే జరుగుతాయి. నాకు అప్పటి నుంచి ఓటు విలువ తెలుసు. మా పేరెంట్స్‌కు ఓటు విలువ చెప్పి ఓటేసేందుకు పంపిస్తా.

– అలేఖ్య

అంతిమ నిర్ణయం మీదే..


అంబేడ్కర్ మైదానంలో వాకర్స్‌తో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్

- కబ్జా కోర్లు కావాలో.. ప్రశ్నించే గొంతుక కావాలో ఆలోచించండి
- ఎంపీ, కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రమాదంలో పడింది. భూకబ్జాదారులు, చీటర్లు, అవినీతి కేసులున్న వారు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పక్షాన పోటీ చేస్తున్నారు.. నేను ధర్మం కోసం పోరాడుతున్న.. ప్రజా సమస్యలపై పోరాడుతున్న.. ఎటువైపు ఉంటారో ఆలోచించండి.. అంతిమ నిర్ణయం మీదే.. అంటూ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ నియోజకవర్గ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ప్రజలను కోరారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వివిధ కుల సంఘాల ఆత్మీయ సమావేశాల్లో పాల్గొన్నారు. తొలుత శుభమంగళ గార్డెన్స్‌లో బ్రాహ్మణ సంఘీభావ సమావేశానికి హాజరయ్యారు. ఆ తర్వాత బృందావన్ గార్డెన్స్‌లో రెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి, ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై ప్రసంగించారు. ఎంపీగా పార్లమెంట్ యోజకవర్గానికి దాదాపు రూ.9 వేల కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చానని తెలిపారు.

మద్దతు ప్రకటించిన ప్రైవేట్ టీచర్స్ ఫోరం, వాకర్స్

దేశం, ధర్మం కోసం ఈసారి కరీంనగర్‌లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్‌కు ఓటేయాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం ప్రకటించింది. కరీంనగర్‌లోని 10వేల మంది ప్రయివేటు ఉపాధ్యాయులు బండి సంజయ్‌కే పూర్తి మద్దతు తెలిపేందుకు సంసిద్ధంగా ఉన్నారని పేర్కొంది. ఈ మేరకు ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నర్సింహారెడ్డి, అనిల్ కుమార్ ఆదివారం బండి సంజయ్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలతో ప్రజలు బీఆర్‌ఎస్‌పై విముఖతతో ఉన్నారని అన్నారు. ఉదయం బండి సంజయ్ కుమార్ అంబేడ్కర్ స్టేడియంతో పాటు ఎల్‌ఎండీ డ్యాంకట్టపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీకి ఓటేసి గెలిపిస్తే వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు వాకర్స్ బండి సంజయ్‌కి బాహాటంగానే మద్దతు తెలిపారు. అనంతరం కరీంనగర్‌లోని గౌతమ్‌నగర్ వెళ్లిన సంజయ్ ఇంటింటా ప్రచారం చేశారు.

నరేంద్ర మోదీకి కృతజ్ఞులై ఉండాలి

విద్యానగర్ (కరీంనగర్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓసీలో కూడా నిరుపేదలు ఉన్న విషయాన్ని గుర్తించి వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించినందున అగ్రవర్ణ పేదలు మోదీకి కృతజ్ఞులై ఉండాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెడ్డి సంఘం నాయకులు రేకులపల్లి రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం కరీంనగర్‌లో జరగబోయే మోదీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో న్యాలకొండ ప్రసన్న కుమార్‌రెడ్డి, గుడి రవీందర్‌రెడ్డి, నేరేళ్ల శ్రావణ్ రెడ్డి, ఎడబోయిన రామకృష్ణారెడ్డి, కాల్వ పూర్ణచందర్‌రెడ్డి, బోడ భాస్కర్‌రెడ్డి, వంగల గణపతిరెడ్డి, వర్ణ పెద్దిరెడ్డి, లెంక అరవింద్‌రెడ్డి, దారం జగన్నాథ్ రెడ్డి, కాంతాల తిరుపతిరెడ్డి, గంకిడి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు


సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

కరీంనగర్‌రూరల్: భారత రాజ్యాంగం అవతరణ దినోత్సవం పురస్కరించుకుని బొమ్మకల్ బైపాస్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో ఆదివారం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎన్‌వైకే ప్రోగ్రాం అధికారి బి.రవీందర్, సీనియర్ లెక్చరర్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో సీహెచ్.శ్రీనివాస్ రాజ్యాంగ విశిష్టత, ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన జి.నరేశ్, అనురూప్ సాయి, జి.నితిన్‌లకు సర్టిఫికెట్లు అందించారు.

గురునానక్ జయంతికి గురుద్వార్ ముస్తాబు


ముస్తాబైన గురుద్వార్

కరీంనగర్ కల్చరల్: సిక్కు మత తొలి గురువు గురునానక్ దేవ్‌జీ మహరాజ్ 554 జయంతి సందర్భంగా నగరంలోని గురుద్వార్ ముస్తాబైంది. ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ప్రభాతభేరి ఆదివారంతో ముగిసింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం జరుగనుంది.


ప్రభాతభేరి నిర్వహిస్తున్న సిక్కులు

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



నగరంలోని భగత్‌నగర్ అంజనాద్రి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. పాల్గొన్న దంపతులకు తిరమల శ్రీవారి ప్రతిమ, లడ్డూప్రసాదం, మంత్రాంక్షతలు, కంకణాలు, పార్థివ శివలింగం అందజేశారు. బొజ్జ రేవతి బృందం అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి. వ్రతాల అనంతరం అన్నదానం జరిగింది.

– కరీంనగర్‌కల్చరల్

భగవన్నామ స్మరణతో బాధలు దూరం


మాట్లాడుతున్న అహోబిల రామానుజ జీయర్‌స్వామి

కొత్తపల్లి: భగవన్నామ స్మరణతోనే బాధలు దూరమవుతాయని అహోబిల రామానుజ జీయర్‌స్వామి అన్నారు. కొత్తపల్లిలోని శ్రీ సచ్చిదానంద ఆశ్రమం, రామాలయ ప్రాంగణంలో మూడు రోజులుగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత సప్తాహ మహోత్సవానికి హాజరై మాట్లాడారు. మాధవుని నామస్మరణతో మనశ్శాంతి కలుగుతుందన్నారు. భాగవతం భక్తి, జ్ఞాన, వైరాగ్య మోక్ష గ్రంథం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేద భవన్ వరప్రసాదాచార్యులు, ప్రముఖ జ్యోతిష్య వాస్తు పండితులు నమిలకొండ రమణాచార్యులు, వికాస్ తరంగిణి సభ్యులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్ జెన్‌నెక్ట్స్'లో కార్తీక మాసోత్సవ్


కార్తీక మాసోత్సవ్‌లో విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్ట్స్‌లో ఆదివారం కార్తీక మాసోత్సవ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసిన అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి శివకేశవుల చిత్రపటాలకు పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. పార్వతి పరమేశ్వరుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకోగా.. కార్తీక మాస మహత్యం నాటిక అలరించింది. కార్తీక మాసంలో పూజలు, దానాలు చేయడం వల్ల ఎన్నో ఫలాలు పొందుతామని, ఆయురారోగ్యాలు మెరుగుపడతాయని అన్నారు. సంతోషవంతమైన జీవనాన్ని గడిపేందుకు దోహదపడుతుందని తెలిపారు. శివునికి అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీకమాసమని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న 'తేమ' గండం

- తుపాన్ ప్రభావంతో ఆరని ధాన్యం
- కొనుగోళ్లలో జాప్యం
- ఆందోళనలో రైతాంగం


నగునూరులో ధాన్యం ఆరబెడుతున్న రైతు

కరీంనగర్‌రూరల్: వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లలో జాప్యమేర్పడుతోంది. చలితీవ్రతకు తోడుగా మూడు రోజుల నుంచి తుఫాన్ ప్రభావంతో పలుచోట్ల చిరుజల్లులు కురువడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆకాశంలో మబ్బులు పట్టి ఎండ కాయకపోవడంతో ధాన్యం ఆరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమశాతం 17 రాకపోవడంతో నిర్వాహకులు ధాన్యం కాంటా పెట్టక రోజుల తరబడి పడిగాపులు పడుతున్నారు.

తేమ సాకుతో కాంటాకు నిరాకరణ

కరీంనగర్ మండలంలోని 17గ్రామాలతో పాటు కార్పొరేషన్‌లో విలీనమైన ఆరెపల్లి, వల్లంపహాడ్, తీగలగుట్టపల్లిలో ఈనెల 2వ తేదీ నుంచి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. అయితే కొనుగోలు కేంద్రాలకు పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్నప్పటికీ తేమసాకుతో సకాలంలో నిర్వాహకులు కాంటా పెట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మూడు రోజుల నుంచి తుఫాన్ ప్రభావంతో ఆకాశంలో మబ్బులతో ధాన్యంలో తేమ ఆరడం లేదు. ప్రధానంగా నగునూరు, జూబ్లీనగర్, చామనపల్లి, చెర్లభూత్కూర్ తదితర గ్రామాల్లో ధాన్యం తూకం వేయడంలో జాప్యమవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. నిర్వాహకులు తేమశాతం 17 ఉంటేనే కాంటా పెడుతుండటంతో పలువురు రైతులు కేంద్రాల్లోనే పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే వాతావరణంలో వచ్చిన మార్పులతో ధాన్యంలో తేమ ఆరకపోవడంతో కొనుగోళ్లలో కొంత జాప్యమేర్పడుతుందని కరీంనగర్, దుర్శేడ్ సహకార సంఘాల సీఈవోలు రమేశ్, వేణు, ఐకేపీ ఏపీఎం భార్గవ్ తెలిపారు. మాయిశ్చర్ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా పెట్టించి రైసుమిల్లుల్లోకి తరలిస్తున్నామని, ఇప్పటివరకు 92,117 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు.

ధాన్యం కొనుగోళ్ల వివరాలు

సంస్థ	కేంద్రాలు	క్వింటాళ్లు
కరీంనగర్ సింగిల్‌విండో	11	47,718
దుర్శేడ్ సింగిల్‌విండో	06	36,457
ఐకేపీ	03	7,942

వడ్లు తెచ్చి పదిరోజులవుతోంది



నాలుగు ఎకరాల పొలం కోసి పదిరోజుల క్రితం నాలుగు ట్రాక్టర్లలో వడ్లు తెచ్చా. రోజు ఆరబెడుతున్నా, మబ్బులతో వడ్లు మంచిగా ఎండుతలేవు. తేమ ఎక్కువగా ఉందని కాంటా పెడుతలేరు.

– దామరపల్లి లక్ష్మీనారాయణ, రైతు, నగునూరు

కాంటా పెడుతలేరు



పదిరోజుల క్రితం ఎకరం పొలం కోసి వడ్లు తీసుకొచ్చా. కాంటా పెట్టుమంటే వడ్లు పచ్చిగా ఉన్నాయని అంటున్నారు. రోజు వడ్లను పొద్దంతా ఆరబెట్టడం రాత్రయితే కుప్పపోస్తున్నా. నిర్వాహకులు వెంటనే కాంటా పెట్టాలి. – భారత మల్లయ్య, రైతు, నగునూరు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


మాట్లాడుతున్న శ్రీనివాస్

కరీంనగర్: నగరంలోని తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఆదివారం గురజాడ స్ఫూర్తి యువశక్తి జాతీయ పురస్కార గ్రహీత గసికంటి సంజీవ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. భారత రాజ్యాంగం–ప్రాముఖ్యత అంశంపై చర్చా కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి గొప్ప రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రచించారని కొనియాడారు. రాజ్యాంగంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, రేవతి, ప్రీతి, వందన, చందు, శివాజీ, అమూల్య, నవీన్, దేవేందర్, తిరుపతి, మనస్విని, శివాని తదితరులు పాల్గొన్నారు.

'పద్యహంస' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

కరీంనగర్‌కల్చరల్: ఉపాధ్యాయ మిత్రమండలి, పద్యకవితా సదస్సు, జాతీయ సాహిత్యపరిషత్, సమైక్యసాహితి అధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన పద్యకవి జీవీ కృష్ణమూర్తి యాదిలో రూపొందించిన పద్యహంస పుస్తకాన్ని ఆదివారం మంకమ్మ తోటలోని సిద్ధార్థ విద్యాసంస్థల్లో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పద్యసాహిత్యం అజరామరమైందని, పద్యానికి ప్రాణం పోసిన జీవీ కృష్ణమూర్తి ధన్యులని అన్నారు. దీనికి ఓ కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళి అర్పించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సామిరామచందర్ రావు, ప్రమీలానరసింగరావు, కేఎస్ అనంతాచార్య, రామక విఠలశర్మ, రాజారాంమోహన్, స్తంభంకాడి గంగాధర్, జీవీ నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కర్ణాటక తరహాలో తెలంగాణలోనూ కాంగ్రెస్‌దే గెలుపు

• కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్



భిక్కనూరు: సీఎంగా కేసీఆర్ చేసిన పాపాలు తెలంగాణ ప్రజలకు శాపాలుగా మారాయని కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ విమర్శించారు. ఆదివారం ఆయన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణను తొమ్మిదిన్నరేళ్లుగా పాలిస్తున్న కేసీఆర్.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించి ప్రజలను ఎన్నో ఇబ్బందుల పాలు చేశారని ఆరోపించారు. కేసీఆర్ కబంధ హస్తాల నుంచి తెలంగాణను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేయడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కర్ణాటక తరహాలోనే తెలంగాణలోనూ కాంగ్రెస్ గెలవడం ఖాయమని శివకుమార్ ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణలో డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరుతుందని, అదే రోజు ఆరు గ్యారంటీ పథకాలపై సీఎం తొలి సంతకం చేస్తారని చెప్పారు. తెలంగాణ ప్రజలు అన్నీ ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని శివకుమార్ పిలుపునిచ్చారు. ఆయన వెంట పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బల్యాల రేఖ, ఎంపీపీ గాలి రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జి నేరెళ్ల శారద, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, మండలాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, నేతలు అంకం రాజు, సుధాకర్ రెడ్డి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నిజాం మనవడు



సాక్షి, హైదరాబాద్: నిజాం మనవడు నవాబ్ మీర్ నజాఫ్ అలీఖాన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో ఆదివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికారున ఖర్గే ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నవాబ్ మీర్ నజాఫ్ అలీఖాన్ మాట్లాడుతూ తమకు నాలుగు తరాలుగా గాంధీ కుటుంబంతో సత్సంబంధాలున్నాయని తెలిపారు. అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

ఏడాదిలో లక్ష ఉద్యోగాలు

• కన్హయ్యకుమార్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పదేళ్ల కాలంలో ఉద్యోగాల కల్పన జరగలేదని, పేపర్ లీకేజీలతో విద్యార్థులను అష్టకష్టాల పాలు చేశారని ఏఐసీసీ నేత, ఎన్ఎస్‌యూఐ జాతీయ ఇన్‌చార్జి కన్హయ్యకుమార్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకోవడమే మానేసిందని, విద్యను వ్యాపారం చేసిందని ఆరోపించారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌తో కలిసి కన్హయ్య మాట్లాడారు. హైదరాబాద్‌ను ఐటీ హబ్ చేశామని, లక్షల ఉద్యోగాలిచ్చామని బీఆర్ఎస్ చెప్తున్న మాటల్లో నిజం లేదని, తెలంగాణలోని ప్రతి ఒక్కరిపై లక్షకు పైగా అప్పు ఉన్న మాట వాస్తవమని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన విద్యార్థుల ఆకాంక్షలు నెరవరలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నేడు ఖర్గే, ప్రియాంకల ప్రచారం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పక్షాన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీలు సోమవారం రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం నర్సాపూర్ ప్రచార సభలో పాల్గొననున్న ఖర్గే రాత్రికి ఢిల్లీ వెళ్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ప్రియాంకాగాంధీ భువనగిరి, గద్వాల, కొడంగల్ నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొంటారని పేర్కొన్నాయి. కొడంగల్‌లో సాయంత్రం జరిగే భారీ బహిరంగసభకు ఆమె హాజరవుతారని తెలిపాయి.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తాం

• తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ

సాక్షి, హైదరాబాద్: పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ చైర్మన్, ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మయ్య, టి.సుభాకర్‌రావు ప్రకటించారు. పెన్షనర్ల సమస్యలను మేనిఫెస్టోలో పొందుపరచాలని అనేక పార్టీలను కోరగా, కాంగ్రెస్ పార్టీ మాత్రమే తన మేనిఫెస్టోలో చేర్చిందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్న చిన్న సమస్యలు చెప్పుకుందామంటే ప్రస్తుత ప్రభుత్వంలో వినే నాథుడే కరువయ్యారని విమర్శించారు.

కాంగ్రెస్‌కు ఒక్క చాన్స్ ఇవ్వండి

• 2024లో ఢిల్లీ ఎర్రకోటలో తిరంగా జెండా ఎగురవేస్తాం
• కాంగ్రెస్‌లో గ్రూపులు, గుంపులు లేవు
• అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం
• ఉమ్మడి పాలమూరు జిల్లా, పటాన్‌చెరు, గచ్చిబౌలిలో ప్రచారం

ఈ సెమీఫైనల్ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం: రేవంత్‌రెడ్డి



నారాయణపేట బహిరంగ సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/పటాన్‌చెరు/గచ్చిబౌలి (హైదరాబాద్): తాను ఓడిపోతే రెస్ట్ తీసుకుంటామని చెబుతున్న సీఎం కేసీఆర్‌ను ఫామ్ హౌస్‌కే పరిమితం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఓటమి తప్పదని తెలిసే కేసీఆర్ ఇలా అంటున్నారని చెప్పారు. తథాస్తు దేవతలు ఉన్నారని, వారంలోనే ఆయన మాట నెరవేరనుందన్నారు. 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండుసార్లు సీఎంగా కేసీఆర్‌కు అవకాశం ఇచ్చారు. ఒక్కసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వండి. ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు చేస్తాం'అని చెప్పారు. ఇవి సెమీఫైనల్ ఎన్నికలని, రాష్ట్రంలో ప్రజలందరి సహకారంతో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దీంతో 2024లో ఢిల్లీ ఎర్రకోటలో తిరంగా జెండా ఎగుర వేయడానికి మార్గం సుగమవుతుందని, మోదీని ఇంటికి పంపిస్తామన్నారు. రేవంత్ ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, పటాన్‌చెరు, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నారాయణపేట, దేవరకద్ర, మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ప్రచార సభల్లో మాట్లాడారు. 'ఈ బకాసురుడికి రూ. లక్ష కోట్లు దోచినా చాలట్లేదు. ధరణి పేరుతో రాష్ట్రంలో పదివేల ఎకరాలు మింగాడు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ ఎక్కడ దాక్కున్నా తోకబట్టి ఈడ్చుకొచ్చి రూ.లక్ష కోట్లను కక్కిస్తాం. సీఎం కేసీఆర్‌కు చర్లపల్లి జైల్లోనే డబుల్ బెడ్రూం నిర్మిస్తాం.. దోపిడీలో భాగమైన కొడుకు, బిడ్డ, అల్లుడికీ చోటు కల్పిస్తాం'అని వ్యాఖ్యానించారు.

పాలమూరు బిడ్డ సంతకంతోనే..

పదేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్నా కేసీఆర్ ఏనాడూ పాలమూరును పట్టించుకోలేదని రేవంత్ అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి పూర్తిచేసే బాధ్యత కాంగ్రెస్‌దని చెప్పారు. ఈసారి ఎన్నికల్లో పాలమూరు బిడ్డను గెలిపించుకోకుంటే మళ్లీ గుంపు మేస్త్రీలు సంతల్లో పశువుల్లా వలస తీసుకెళ్లే పరిస్థితి వస్తుందన్నారు. కాంగ్రెస్‌లో శషభిషలు, గ్రూపులు, గుంపులు లేవన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలపై ఎవరైనా చేయిచేసుకుంటే వారి గుడ్లు పీకి గోళీలు ఆడతానని హెచ్చరించారు. రాష్ట్రంలోని 119 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో ఎంతోమంది పెద్దవాళ్లు, ఉద్దండులున్నా పాలమూరు బిడ్డ సంతకంతోనే పోటీలో నిలుస్తున్నారని, ఇది పాలమూరు గడ్డ గొప్పతనమని చెప్పారు. పాలమూరు బిడ్డలు నాటిన మొక్కను నరికేందుకు ఢిల్లీ నుంచి మోదీ, గల్లీ నుంచి కేడీ, కేటీఆర్, హరీశ్ గొడ్డళ్లు పట్టుకుని వస్తున్నారని, పాలమూరు బిడ్డలు చైతన్యంతో ఎదురు తిరగాలని పిలుపునిచ్చారు.

మూడోసారి మనవడికి ఇస్తారా?

కేసీఆర్ మూడోసారి గెలిపించాలని కోరుతున్నారని, ఇప్పటికే తాను సీఎం అయి, కొడుకు, అల్లుడిని మంత్రులను చేశారని, సంతోష్‌రావును ఎంపీగా చేశారని, నిజామాబాద్‌లో నేలకేసికొడితే బిడ్డను మళ్లీ ఎమ్మెల్సీని చేశారని, ఈసారి గెలిస్తే మనవడిని మంత్రి చేస్తారని రేవంత్ వ్యాఖ్యానించారు. లక్కీ నెంబర్ ఆరులాగా మనవడు మంత్రి అయ్యాడంటే అందరికీ పదవులొచ్చినట్లవుతుందని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. టీఎస్‌పీఎస్సీ 17 పరీక్షలను నిర్వహించి పల్లీలను అమ్మినట్లు పరీక్ష పేపర్లను అమ్మి మోసం చేసిందని, నిరుద్యోగులంతా కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేసే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమాల్లో యెన్నం శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్), పర్ణికారెడ్డి (నారాయణపేట), జి.మధుసూదన్‌రెడ్డి (దేవరకద్ర), జగదీశ్వర్‌గౌడ్ (శేరిలింగంపల్లి), కాట శ్రీనివాస్ గౌడ్ (పటాన్‌చెరు) పాల్గొన్నారు.

పల్లెరుణం తీర్చుకునే తరుణం ఇదే..

• పార్టీలు, జెండాలకతీతంగా కాంగ్రెస్‌ను గెలిపించండి
• రాష్ట్రంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ లేఖ

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులందరూ పార్టీలు, జెండాలకతీతంగా ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కోరారు. పల్లెరుణం తీర్చుకునే తరుణం ఇదేనని ఆయన పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం కూడా జెడ్పీటీసీగానే ప్రారంభమైనందున, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో స్థానిక ప్రజాప్రతినిధుల అవస్థలు, అవమానాలు తనకు తెలుసని అన్నారు. ఈ మేరకు స్థానికసంస్థల ప్రజాప్రతినిధులకు ఆదివారం రేవంత్ బహిరంగలేఖ రాశారు. 'ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని కేసీఆర్ పురుగుల కంటే హీనంగా చూశారు. నిర్ణయాధికారంలేక, నిధులు రాక మీరు పడిన బాధలు అన్నీఇన్నీ కావు. భార్య మెడలోని బంగారం అమ్మి అభివృద్ధి పనులు చేశారు. నిధులు సకాలంలో విడుదలకాక అప్పులు చేసినవారు, వాటికి వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకున్నవారు కూడా ఉన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల్లో కొందరు ఉపాధి హామీ పథకం కూలీలుగా, పట్టణాలు, నగరాల్లో వాచ్‌మెన్‌లుగా మారారు'అని లేఖలో పేర్కొన్నారు. స్థానిక ప్రతినిధుల కష్టాలు తీర్చి వారికి పూర్వవైభవాన్ని తెచ్చే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని హామీనిచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులందరూ అసెంబ్లీ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించి కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలని కోరారు. వార్డుసభ్యుల నుంచి సర్పంచ్ వరకు, కౌన్సిలర్ల నుంచి మున్సిపల్ చైర్మన్ల వరకు, కార్పొరేటర్ల నుంచి మేయర్ వరకు అందరూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.

ఏచూరి వర్సెస్ తమ్మినేని

• 'ఇండియా' కూటమిలో ఉన్నందున రాష్ట్రంలో కాంగ్రెస్‌కే ఏచూరి మద్దతు
• కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఎక్కడా చెప్పని తమ్మినేని వీరభద్రం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మద్దతు విషయంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రానికి మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నట్టు తెలుస్తోంది. 'తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా ఎన్నికల బరిలోకి దిగాం. కాబట్టి మేం పోటీ చేయని నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఓటేయ్యాలి'అని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చాలా స్పష్టంగా చెప్పారు. కానీ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అలాంటి స్పష్టత ఎక్కడా ఇవ్వడంలేదు. 'మా పార్టీ పోటీ చేసే 19 నియోజకవర్గాలు మినహా బీజేపీ బలంగా ఉన్నచోట్ల దానిని ఓడించగల పార్టీకి ఓటు వేయాలని కోరుతున్నాం. కొత్తగూడెంలో సీపీఐ, పినపాకలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ, శేర్‌లింగంపల్లిలో ఎంసీపీఐ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నాము. మిగిలిన స్థానాలలో ఎవరిని బలపరచాలో పార్టీ జిల్లా కమిటీలు తగు నిర్ణయం తీసుకొని ప్రజాతంత్ర, లౌకిక, సామాజిక, పోరాట శక్తులకు మద్దతు ఇస్తాయ'ని తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. ఇక్కడ ఏచూరి ప్రకటనకు, తమ్మినేని ప్రకటనకు మధ్య వైరుధ్యం ఉందని ఆ పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. 'ఇండియా'కూటమిలో ఉన్నందున తాము కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామని ఏచూరి స్పష్టం చేయగా, తమ్మినేని మాత్రం అలాంటి స్పష్టత ఇవ్వలేదు. రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉన్న స్థానాల్లో ఆ పార్టీని ఓడించగలిగే పార్టీలకు ఓటు వేయాలని కోరుతున్న తమ్మినేని, మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయమని ఎందుకు పిలుపునివ్వడంలేదని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

ఏచూరికి సమాచారం ఇవ్వలేదా?

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 19 స్థానాల్లో సీపీఎం ఒంటరిగా పోటీ చేస్తుంది. మిగిలిన స్థానాల్లో బీజేపీ బలంగా ఉన్నచోట దాన్ని ఓడించే పార్టీలకు ఓటేయ్యాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. బీజేపీ బలంగా లేనిచోట ఏ పార్టీకి ఓటు వేయాలన్న దానిపైనే కేంద్ర కమిటీకి, రాష్ట్ర కమిటీకి మధ్య భిన్నాభిప్రాయం నెలకొంది.. సీతారాం ఏచూరికి రాష్ట్ర పార్టీ నిర్ణయాన్ని తెలియజేయలేదని తెలిసింది. కాగా, తాము పోటీ చేస్తున్న 19 స్థానాలలో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో కోరారు.

'ప్రజల తెలంగాణ' కల నిజం చేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 8 లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, దీనికి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ప్రధాని మోదీకి లోక్‌సభలో అవసరం ఉన్నప్పుడల్లా అండగా నిలవడం వల్లే కేసీఆర్‌పై సీబీఐ, ఈడీ లాంటి కేసులు నమోదు కాలేదని చెప్పారు. ఒకవేళ కేసీఆర్ మద్దతు ఇవ్వకపోయి ఉంటే సీఎం కుర్చీకీ ఎసరొచ్చేదని రాహుల్ దుయ్యబట్టారు.

తొలి సమావేశంలోనే...

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ప్రతినెలా బ్యాంకు ఖాతాలో రూ. 2,500 జమ చేస్తామని, బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా నెలకు రూ.5 వేల మేరకు ప్రయోజనం కల్పిస్తామని, గ్యాస్ సిలిండర్‌ను రూ.ఐదు వందలకు ఇస్తామని, రైతులకు రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని, అలాగే రైతు కూలీలకు ఏటా రూ.12వేలు అందిస్తామని తెలిపారు. రైతులకు 24 గంటలపాటు ఉచితంగా కరెంటు ఇస్తామని, ఇళ్లు లేనివారందరికీ రూ.5 లక్షలు ఇచ్చి సొంతింటి కల నిజం చేస్తామని చెప్పారు. తెలంగాణ కోసం ప్రాణాలొదిలిన అమరుల కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగాల కోసం ఎంతో మంది రూ.లక్షలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకుంటున్నారని, తాను వాళ్ల దగ్గరకు వెళ్లి మాట్లాడానని రాహుల్ చెప్పారు. విద్యాభరోసా కార్డులను ఇచ్చి, వారి ఉన్నత చదువులు, కోచింగ్ కోసం రూ.5 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగాల కోసం పరీక్షలు రాసిన విద్యార్థులు ఇంటికి చేరేలోపు పరీక్ష పత్రాలు లీకైనట్టు తెలిసి గుండెలు బాదుకోవలసిన పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు.

అవినీతి సొమ్ము ప్రజల ఖాతాల్లోకి..

తొమ్మిదేళ్ల పాలనలో కేసీఆర్, ఆయన కుటుంబం దోచుకున్న అవినీతి సొమ్మునంతా కక్కిస్తామని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. కక్కించిన ఈ సొమ్మును నిరుపేదల ఖాతాల్లో వేస్తామని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలన్నీ ఒక్కటేనన్నారు. బీజేపీతో కాంగ్రెస్ పోరాడిన ప్రతి ఎన్నికల్లో ఎంఐఎం తమ అభ్యర్థులను బరిలోకి దించి బీజేపీకి సహకరిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు నష్టం చేసేలా అస్సాం, గోవా, రాజస్తాన్ ఎన్నికలో ఎంఐఎం వ్యవహరించిందని గుర్తుచేశారు. బీజేపీతో పోరాడుతున్నందుకు తనపై 24 కేసులు నమోదు చేశారని, తన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేసి, తన నివాసాన్ని కూడా లాక్కున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్న మోదీ సర్కారునూ వదిలిపెట్టేది లేదన్నారు. విద్వేషాల బజార్‌లో ప్రేమ అనే దుకాణం తెరిచిన కాంగ్రెస్‌కు మద్దతు పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, నిజామాబాద్ అర్బన్, బాన్సువాడ, ఎల్లారెడ్డి అభ్యర్థులు షబ్బీర్‌అలీ, ఏనుగు రవీందర్‌రెడ్డి, కె.మదన్‌మోహన్ పాల్గొన్నారు.



సంగారెడ్డిలో రాహుల్ బహిరంగ సభకు హాజరైన జనం

కామారెడ్డి ప్రజల తీర్పు చరిత్రలో నిలిచిపోతుంది

'ప్రజల రక్తానికి మరిగిన పులిని వేటాడేందుకు వేటగాన్ని రంగంలోకి దింపుతారు. అట్లనే తెలంగాణ సంపదను దోచుకుంటున్న కేసీఆర్‌ను రాజకీయంగా బొందపెట్టేందుకే నన్ను ఇక్కడికి పంపారు. కామారెడ్డి ప్రజలు ఇచ్చే తీర్పు చరిత్రలో నిలిచిపోతుంది. దేశం మొత్తం మీవైపే చూస్తోంది' అని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగిన విజయభేరి సభలో ఆయన మాట్లాడారు. నలభై ఏళ్లుగా ఎన్నో పదవులు అనుభవించినప్పుడు గుర్తుకురాని అమ్మ, అమ్మమ్మ ఊరు కేసీఆర్‌కు ఇప్పుడు గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. ఇక్కడి భూముల మీద కన్నేసి కామారెడ్డికి వచ్చారని, కేసీఆర్‌ను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని రేవంత్‌రెడ్డి ప్రజలను కోరారు.

తెలంగాణ మార్పు కోరుతోంది... మేం గెలుస్తాం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజానీకం మార్పు కోరుతోందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా విజయం సాధిస్తుందని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రజలకు ఏమీ చేయలేకపోయిందని, కేసీఆర్ హయాంలో అవినీతి పెరిగిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో జరిగిన అవినీతి, కేసీఆర్ పనితీరు కారణంగానే తెలంగాణ నిండా మునిగిందని చెప్పారు. ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్, టీపీసీసీ సీనియర్ నేత జి.నిరంజన్‌లతో కలిసి దిగ్విజయ్ మాట్లాడుతూ, కేసీఆర్ ఎన్ని చెప్పినా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత సోనియాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీదేనని చెప్పారు. ఆమె అంకితభావం, రాజకీయ చిత్తశుద్ధి కారణంగానే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందన్నారు. దేశ ప్రజలను బీజేపీ మోసగిస్తోందని, పెరిగిన ధరలు, నిరుద్యోగం పేద కుటుంబాలను ఆందోళనకర పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్నాయన్నారు. తెలంగాణలో కూడా నిరుద్యోగం పెరిగిందని, ఉద్యోగాల భర్తీ కూడా బీఆర్ఎస్ చేయలేకపోతోందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇచ్చినవే తప్ప మతం ప్రాతిపదికన కాదని దిగ్విజయ్ స్పష్టం చేశారు.

వైఎస్సార్ విజన్‌తోనే ప్రపంచ స్థాయి నగరం

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విజన్ ఉన్న నాయకుడని దిగ్విజయ్‌సింగ్ వ్యాఖ్యానించారు. ఆయన విజన్‌తోనే హైదరాబాద్ మెగాసిటీగా రూపాంతరం చెందిందని, ఔటర్ రింగురోడ్డును నిర్మించిన కారణంగానే బెంగళూరుతో పోటీపడి హైదరాబాద్ ఐటీ హబ్‌గా రూపాంతరం చెందుతోందన్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగానే పారిశ్రామిక అనుకూల విధానాలతో కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా మారుస్తుందని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని దిగ్విజయ్ చెప్పారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

• సీడబ్ల్యూసీ సభ్యురాలు అల్కాలాంబ



సమావేశంలో మాట్లాడుతున్న అల్కాలాంబ, చిత్రంలో గౌతమ్‌సేథ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యురాలు అల్కాలాంబ అన్నారు. ఆదివారం నల్లగొండలో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ మిగులు బడ్జెట్‌తో ఇస్తే కేసీఆర్ రూ.5 లక్షల కోట్ల అప్పుల తెలంగాణగా మార్చారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటేనని, అవి కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తప్పించడానికి బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చుకున్న సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు రిటైర్మెంట్ ఇవ్వాలని కోరారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జోడోయాత్ర జరిగిన హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని, అదేతరహాలో తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. నల్లగొండలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గెలిపించాలని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన ఉన్నతస్థాయి లో ఉంటారని చెప్పారు. కోమటిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడినా పేదల బతుకుల్లో మార్పు రాలేదని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌతమ్ సేథ్, నల్లగొండ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే: భట్టి విక్రమార్క

• బీఆర్ఎస్ నోట్లకట్టలు తమ విజయాన్ని ఆపలేవని వ్యాఖ్య



రోడ్ షోలో అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క, శ్రీనివాసరెడ్డి, తుమ్మల

మధిర: బీఆర్ఎస్ నోట్లకట్టల సంచులు కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఆపలేవని, వచ్చే నెల 3న వెలువడే అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అత్యధిక స్థానాలు దక్కనున్నాయని సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి, మధిర, బోనకల్, ఎర్రుపాలెం, వైరాలో కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన ప్రచారం చేశారు. మధిరలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజాబలాన్ని నమ్ముకుంటే బీఆర్ఎస్ పాలకులు నోట్లకట్టలను నమ్ముకున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లలో ప్రజల వద్ద దోచుకున్న డబ్బును వెదజల్లి మళ్లీ అధికారంలోకి రావాలని బీఆర్ఎస్ కుట్ర పన్నిన నేపథ్యంలో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలని కోరారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ మధిర ప్రజల గుండెల్లో ఉన్న భట్టి విక్రమార్కను మరోమారు గెలిపించాలని కోరారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ సంపద సీఎం కేసీఆర్ కుటుంబం పాలైందని, ప్రజల ఆశలు, ఆకాంక్షలను అడియాసలు చేసిన బీఆర్ఎస్‌ను ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 9న ఎల్బీ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మధిర నుంచి భారీగా ప్రజలు తరలిరావాలని కోరారు.

30న కేసీఆర్ కుటుంబానికి వీడ్కోలే

కర్ణాటక ఎన్నికలు, జోడోయాత్రతో బీజేపీ గ్రాఫ్ తగ్గింది: జైరాం రమేశ్



ఖలీల్‌వాడి (నిజామాబాద్ అర్బన్): ఈనెల 30న కేసీఆర్ కుటుంబానికి తెలంగాణ ప్రజలు వీడ్కోలు పలుకుతారని సీడబ్ల్యూసీ సభ్యుడు జైరాం రమేశ్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలు, రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రతో బీజేపీ గ్రాఫ్ తగ్గిందన్నారు. నవంబర్ 30న జరిగే పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడతారని, అదేరోజు కేసీఆర్ కుటుంబానికి తెలంగాణ ప్రజలు వీడ్కోలు పలికే రోజు అవుతుందని చెప్పారు. తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని జైరాంరమేశ్ పేర్కొన్నారు. హైదరాబాద్ తప్ప మిగతా జిల్లాలు అభివృద్ధికి నోచుకోలేకపోయాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని, దీంతో యువత ఆత్మహత్యలు చేసుకునేదాకా వచ్చిందని తెలిపారు. తొమ్మిదేళ్లలో తెలంగాణలో బాగుపడింది కేసీఆర్ కుటుంబమేనన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అన్ని వర్గాలకు మేలు చేస్తాయని, ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సోనియా గాంధీ ఇవ్వకుంటే తెలంగాణ రాష్ట్రం వచ్చేదే కాదని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి 60 సీట్ల కంటే ఎక్కువ వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే కేసీఆర్ అవినీతిపై విచారణ చేస్తామని జైరాంరమేశ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బోధన్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు

• ఈసీకి కాంగ్రెస్ పార్టీ లేఖ

సాక్షి, హైదరాబాద్: రైతుబంధు పథకాన్ని బీఆర్ఎస్ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. రైతుబంధు నిధులు తమ సొంత జేబుల నుంచి ఇస్తున్నట్లు ప్రతి బీఆర్ఎస్ నాయకుడు ఓటర్లను ప్రభావితం చేసేవిధంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయంలో వారిని నియంత్రించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ఆదివారం లేఖ రాశారు. రైతుబంధు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ అడ్డుపడిందని ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించినా ఎన్నికల సంఘం రైతుబంధు పంపిణీకి అనుమతినిచ్చిందని మంత్రి హరీశ్‌రావు చెప్పడం సరికాదన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.



'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 246

సోమవారం 27-11-2023

SIMULTANEOUSLY PRINTED AT NIZAMABAD | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

గప్పుడు దొర గిప్పుడు దొర

ప్లేటు ఫిరాయింపులో.. తనకు తానే సాటి.. దొరకు లేరు పోటీ!





నువ్వు అబద్ధమాడినందుకు నేను దిగులు పడటం లేదు.
ఇక నుంచీ నేను నిన్ను నమ్మలేను కదా అని దిగులు పడుతున్నాను.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి

సోమవారం, 27 నవంబర్ 2023

మాటకు కట్టుబడి...

మన తెలుగు రాజు హాలుడు సంస్కృతం నేర్చుకోవాలనుకున్నప్పుడు ఇద్దరు పండితులు వస్తారు నేర్పేందుకు. ఒకడు గుణాఢ్యుడు. రెండు శర్వవర్మ. 'నేను మీకు సంస్కృతం నేర్పాలంటే 12 సంవత్సరాలు పడుతుంది' అంటాడు గుణాఢ్యుడు. రాజుగారి అర్జెన్సీ గమనించిన శర్మవర్మ 'నేను ఆరు నెలల్లో నేర్పుతాను' అంటాడు. అది అసాధ్యం. కనుకనే గుణాఢ్యుడు ఆగ్రహంతో 'అదే జరిగితే నాకు తెలిసిన సంస్కృత, ప్రాకృత, దేశ భాషలన్నింటినీ విడిచి పెట్టేస్తాను' అంటాడు. శర్వవర్మ ఏవో తిప్పలు పడి కొత్త వ్యాకరణం రాసి ఆరు నెలల్లో రాజుగారికి సంస్కృతం వచ్చు అనిపిస్తాడు. ఇందుకు గుణాఢ్యుడు ఆశ్చర్యపోయి, మొత్తానికి సాధించావ్ అనేసి తన దోవన తాను పోతే ఎవరూ ఏమీ అనరు. తల తీసి మొలేయరు. కాని మాటకు విలువ ఇచ్చే కాలం అది. గుణాఢ్యుడు మహా పండితుడు. భాషే జీవంగా జీవించేవాడు. అలాంటివాడు తానిచ్చిన మాటకు విలువనిచ్చి తనకు తెలిసిన అన్ని భాషలను వదిలిపెట్టి, మౌనిగా మారి, అడవులకు వెళ్లిపోతాడు. అక్కడ అతను పైశాచి భాష నేర్చుకుని 'బృహత్కథ' రాయడం వేరే విషయం. కాని మాటకు కట్టుబడటం వల్లే కదా ఇన్ని వందల ఏళ్ల తర్వాత గుర్తు చేసుకుంటున్నాము.

మనిషి గుంపు జీవనం మొదలెట్టే నాటికి లిపి లేదు. రాతకోతలు లేవు. నోటి మాటే శిలాశాసనం. మాట ఇవ్వడం అంటే ఒప్పందం చేసుకోవడమే. రాజ్యాలు ఏర్పడ్డాక 'మాటకు కట్టుబడటం' ఒక విలువగా, యుగ స్వభావంగా స్థాపన చేసేందుకు సత్య హరిశ్చంద్రుడి కథ విశేషంగా వ్యాప్తిలోకి వచ్చింది. హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి ఇచ్చింది కేవలం మాటే. హరిశ్చంద్రుడు పాలకుడు, రాజు. ఇచ్చిన మాట నెరవేర్చకపోతే ఎవరూ ఏమీ చేయరు. కాని మాట తప్పిన అపప్రథను శిరస్సున మోయడం కంటే రాజ్యాన్ని, భార్యను, కుమారుణ్ణి కూడా కోల్పోయేందుకు సిద్ధమవుతాడు. శ్రీరాముడు మరింత ఉదాత్తుడు. తన మాటకు కాదు, తండ్రి ఇచ్చిన మాటకు కట్టుబడి అడవులకు వెళ్లాడు. 'నువ్వు మాటిస్తే నేనెందుకు వెళ్లాలి నాన్నా' అనంటే దశరథుడు చేయగలిందేముంది? అందుకే రాముడు దేవుడు.

గాంధీ గారు దక్షిణాఫ్రికా వెళుతూ తన తల్లికి 'మద్యం, మగువ, మాంసం జోలికి వెళ్లను' అని మాట ఇచ్చారు. అక్కడకు వెళ్లాక మద్యం ఎలాగూ అలవాటు లేదు. మగువకు లోబడలేని నిష్ఠ ఉంది. కాని మాంసం జోలికి వెళ్లకుండా, అక్కడ అదే దొరుకుతుంది కనుక, ఎలా ప్రాణాలు నిలబెట్టుకోవాలో ఆయనకు అర్థం కాలేదు. అయినా సరే, మాట తప్పలేదు– ఆకలికి తాళలేక పచ్చి బియ్యం బొక్కాడు తప్ప. నిజం. అలా ఉండేవారు జనులు, తల్లికి మాట ఇస్తే, గురువు మాట ఇస్తే, తమకు తాము మాట ఇచ్చుకుంటే జీవితాంతం కట్టుబడేవారు. ఉత్తరాదిలో 'ప్రాణ్ జాయ్ పర్ వచన్ నా జాయ్' అంటారు. మాట పోతే ప్రాణం పోయినట్టే!

మరి కల్తీ సరుకు రాకుండా ఉంటుందా? 'కన్యాశుల్కం'లో కరటక శాస్త్రి తన శిష్యుణ్ణి ఆడవేషం కట్టమని చెప్పి, ఆ వేషంలో లుబ్ధావధాన్లను పెళ్లి చేసుకోమని 'నువ్వు నెగ్గుకొస్తే మా పిల్లన్నీకిచ్చి ఇల్లరికం వుంచుకుంటాను' అంటాడు. 'మాట తప్పితే భూమి తోద్రా' అనంటాడు. దానికి శిష్యుడు 'మీరు యగేస్తే భూవేం చేస్తుందిలెండి?' అనంటాడు. మాట ఇవ్వడాన్ని పాతకాలపు చాదస్తంగా, మాట తప్పడాన్ని కొత్త జీవన మంత్రంగా పసిగట్టి గురజాడ 'కన్యాశుల్కం'లో ఆనవాలు వదిలాడు. నిజమే. మనుషులు కాగితాన్ని తప్ప మాటను నమ్మని పరిస్థితి వచ్చింది. ఎక్కడి మాట అక్కడే మర్చిపోవాలి అనే గిరీశాలు మూలకొకడు, మలుపుకొకడు తయారయ్యారు. 'ఆడిన మాటలు తప్పిన గాడిద కొడకంచు తిట్టగా విని అయ్యో వీడా నాకొక కొడుకని గాడిద ఏడ్చెన్ గదన్నా ఘన సంపన్న' అనే పద్యం వీరి ఎదుట చదివితే 'తిట్టుకో తిట్టుకో... అలాగే అలాగే' అని కాఫీ తాగి లేచ్చక్కా పోతుంటారు.

కాని ఎంత అధ్వాన్న రోజుల్లోనైనా వడగడితే జారిపోని విలువలు ఎన్నోకొన్ని మనుషులు మిగుల్చుకునే ఉంటారు. మాట తప్పని స్వభావాన్ని వారు నేటికీ గౌరవిస్తూనే ఉన్నారు. ఈ భూమి, ఈ వనరులు, ఈ సంపద, ఈ గాలి, నీరు... వీటన్నింటికీ తాము సమాన హక్కుదార్లమని తెలిసినా, పోరాడి పొందగలిగే శక్తి ఉన్నా, పాలకులుగా... ఏలికలుగా సింహాసనాల్లో కూర్చున్నవారు తమకు నాలుగు మెతుకులుగా విదిల్చితే పొందాలేమోనన్న స్థితికి వారు నెట్టబడినా, ఇలాంటి స్థితిలో కూడా వారు ఎవరి మాట సత్తుదో, ఎవరి మాటలో సత్తువున్నదో సూక్ష్మంగా గమనిస్తూనే ఉంటారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ తమ ఇంగితజ్ఞానం అనే గీటురాయిని బయటకు తీస్తూనే ఉంటారు. నమ్మిన మాటను గెలిపిస్తారు. ఒకవేళ అది నమ్మించిన మాట మాత్రమే అని గ్రహిస్తే సందర్భం కోసం కాచుకుని ఉంటారు. 'తప్పుడు వెధవ' అనే తిట్టు ఉంది. అంటే తప్పు చేసినవాడు మాత్రమే కాదు మాట తప్పినవాడు కూడా!

ప్రజల నుంచి తీసుకుని తిరిగి ప్రజలకు అందించడం అనే ఒక సరళ సూత్రంలో పాలకుడు వాహిక మాత్రమే. ప్రజలకు మంచి చేస్తాను అనే మాట మాత్రమే అతనికి శిరోధార్యం కావాలి. జనం చెవిలో పువ్వు పెట్టే నాలుగు మాటలు చెప్పి తమ మెడలో విజయహారాలు ధరిద్దామను కుంటే అది గేమ్‌లో భాగమే కావచ్చు. కాని అలాంటి గేమ్‌లో తక్కున ఔటవడమే గాక మాటగా కూడా గుర్తురాని స్థితికి దిగజారి పోతారు. మాటలు వెదజల్లకండి. ఇవ్వగలిగిన మాట మాత్రమే ఇవ్వండి. మాట జాగ్రత్త!

ఓటమిని ఒప్పుకోవడమే క్రీడాస్ఫూర్తి

కామెంట్



కరణ్ థాపర్

పది వరుస విజయాల తర్వాత ప్రపంచ కప్ ఫైనల్‌లో ఓడిపోవడం హతాత్పాతమే. తట్టుకోలేని దెబ్బే. అయితే అది ఒక వ్యక్తి ప్రవర్తనను, ప్రవర్తన విధానాన్ని ప్రభావితం చేసినందువల్ల... అతడిలో మనం ఆశించిన సౌమ్యతను, మర్యాదను అతడు విస్మరిస్తే దానిని మనం చూసీ చూడనట్లు వదిలేయాలా? 2021 యు.ఎస్. టెన్నిస్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ ఫైనల్... నొవాక్ జొకోవిచ్‌కి చాలా పెద్ద మ్యాచ్. అతడు ఆ మ్యాచ్‌ని గెలిస్తే ఒకే ఏడాదిలో మొత్తం నాలుగు గ్రాండ్ స్లామ్‌లలోనూ విజయం సాధించినట్లు అవుతుంది. అద్భుతంగా ఆడాడు. కానీ ఓడిపోయాడు. కన్నీళ్లు పెట్టుకున్నాడు. అయినప్పటికీ మెద్వెదేవ్‌ను మనస్ఫూర్తిగా అభినందించాడు. మన క్రికెటర్లు తమ ఓటమిని హుందాగా ఎలా స్వీకరించాలో నేర్చుకోవలసే ఉంది.

పెద్దమనిషి అని ఒకర్ని అంచనా వేయడానికి ఉన్న అనేకమైన మార్గాలలో బహుశా అత్యంత సునిశితమైనది... వారు ఓటమిలో సైతం సహజ నిశ్చల శాంత గాంభీర్యాన్ని కలిగి ఉండటమేనని నేను చెప్పగలను. ఇక ఆ పెద్దమనిషి క్రీడాకారుడు అయితే కనుక ఓటమిలోని అతడి నిశ్చలతకు మరింతగా ప్రాముఖ్యం ఉంటుంది. ఏదైనా మీరు తీవ్రంగా కోరుకున్నదీ, 'మన చేతుల్లో పనే' అనేంతగా మీరు తిరుగులేని నమ్మకంతో ఉన్నదీ... ఊహించని విధంగా మీ పట్టు నుంచి జారి, మిమ్మల్నొక కలలు కల్లలైన పరాజితునిగా మిగిల్చినప్పుడు మీ కదలికలు, మీ కవళికలు ఎలా ఉంటాయన్నది మీ వ్యక్తిత్వంలోని నాణ్యత పాలును పైకి తేలుస్తుంది.



ఆస్ట్రేలియాతో వరల్డ్ కప్ ఫైనల్స్‌లో విరాట్ కోహ్లీ



గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో తనను ఓడించిన మెద్వెదేవ్‌తో జొకోవిచ్ (తెల్ల చొక్కా)

గత ఆదివారం ఓటమి అనంతరం మన క్రికెట్ జట్టు నిలదొక్కుకోలేక పోయిన పరీక్ష ఇటువంటిదే. అందుకే నేను గుండెల్ని ముక్కలు చేసిన ఆ ప్రపంచ కప్పు పరాజయానికి భారత జట్టు ఎలా స్పందించిందో ఒక ఎంపికగా ఈ వారం రాయదలచాను. గొప్ప వీరులను మీరు మీ హృదయ పీఠాలపై ప్రతిష్ఠించుకున్నప్పుడే, వారి రూపాలను పంకిలపరిచే లోపాలను సైతం సమస్థాయిలో అంగీకరించడం అన్నది కూడా మీ ఆరాధనలోని ఒక తప్పనిసరి బాధ్యత అవుతుంది.. ముఖ్యంగా టీవీల ప్రత్యక్ష ప్రసారంలో వీరులైన మీ జగజ్జెట్టీలను ప్రపంచం అంతా క్లోంత చేసుకుని చూస్తున్నప్పుడు!

''భారతజట్టులోని చాలామంది ఆటగాళ్లు... విజేతలైన ఆసీస్ జట్టులోని క్రీడాకారులతో కరచాలనం చేసిన తర్వాత మైదానం విడిచిపెట్టారు. కనీసం ప్యాట్ కమిన్స్ ట్రోఫీని పైకెత్తి చూపడాన్ని వీక్షించేంత వరకైనా అక్కడ ఉండలేకపోయారు'' అని మేథ్యూ సాల్విన్ 'న్యూస్.కామ్.ఎయు'లో రాశారు. అదే నిజమైతే అటువంటి ప్రవర్తన అమర్యాదకరమైనది మాత్రమే కాదు, క్షమించరానిది కూడా! ఈ ధోరణి భారత జట్టును, భారత ప్రజలను కూడా చెడుగా ప్రపంచానికి చూపెడుతుంది.

విరాట్ కోహ్లీ 'మ్యాన్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డు అందుకున్నప్పుడు అతడి ప్రవర్తనను నాకు నేనుగా గమనించాను. అతడు నిరుత్సాహానికి గురవడాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ స్థాయికి తగని అతడి వైఖరి మాత్రం నేను అంగీకరించలేనిది. సచిన్ టెండూల్కర్‌తో మాత్రమే కరచాలనం చేసి, తక్కిన వాళ్లలో ఒక్కర్ని కూడా కోహ్లీ పట్టించుకోలేదు. అది అమర్యాద మాత్రమే కాదు, క్షమార్హం కాని స్వీయాధిక్య భావన కూడా!

కోహ్లీని మాత్రమే నేనెందుకు వేరు చేసి చూస్తున్నాను? రెండు కారణాల వల్ల. కోట్లాది మందికి అతడు హీరో. తన ఆదర్శపాత్రను గొప్ప సంపదగా సృష్టించుకున్నవాడు. అతడేం చేస్తే వాళ్లు దానిని అనుసరిస్తారు. అంతేనా, అనుకరిస్తారు కూడా! అందుకే అతడి తప్పిదాలు కనిపించకుండా పోవు. ఒక స్టార్‌గా అతడు ప్రశంసలకు ఎలాగైతే అర్హుడో, విమర్శలకూ అంతే యోగ్యుడు.

నేను కఠినంగా మాట్లాడుతున్నానని మీరు అనవచ్చు. పది వరుస విజయాల తర్వాత ఫైనల్‌లో ఓడిపోవడం హతాత్పాతమే. తట్టుకోలేని దెబ్బే. అయితే అది ఒక వ్యక్తి ప్రవర్తనను, ప్రవర్తన విధానాన్ని ప్రభావితం చేసినందువల్ల అతడిలో మనం ఆశించిన సౌమ్యతను, మర్యాదను అతడు విస్మరిస్తే దానిని మనం చూసీ చూడనట్లు వదిలేయాలా? అది నాకు సమ్మతి కాని వాదన.

ఎందుకో నన్ను చెప్పనివ్వండి. 2021 యు.ఎస్. టెన్నిస్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ ఫైనల్... నొవాక్ జొకోవిచ్‌కి చాలా పెద్ద మ్యాచ్. అందరి మదిలోనూ ఒకటే, అతడు ఆ మ్యాచ్‌ని గెలిస్తే ఒకే ఏడాదిలో అది అతడి నాలుగో గ్రాండ్ స్లామ్ విజయం అవుతుంది. 1969 నాటి రాడ్ లేవర్ ఘనతకు అతడిని సమం చేస్తుంది. పురుషుల టెన్నిస్‌లో ఒక ఏడాదిలోని గ్రాండ్ స్లామ్‌లు అన్నింటిలో విజయం సాధించిన మూడవ వ్యక్తిగా చరిత్రలో నిలుస్తాడు. కానీ ఏమైంది? ఓడిపోయాడు!

ఏ లెక్కన చూసినా గత ఆదివారం విరాట్ కోహ్లీ చవి చూసిన ఓటమి కన్నా కూడా జొకోవిచ్‌ది చాలా పెద్ద ఓటమి. అంతేకాదు – అది చిన్న సంగతేం కాదు – పైగా వ్యక్తిగతమైనది. కనుక అది అసలు సిసలు పరీక్ష.

జొకోవిచ్ అద్భుతంగా ఆడాడు. సందేహమే లేదు. అందుకే ఓటమి అతడిని కుంగదీసింది. అతడి కళ్లలో నీళ్లు చిప్పిల్లాయి. డేనియల్ మెద్వెదేవ్ అతడిని ఓడించిన క్షణాలలో జొకోవిచ్ అతడితో ఏమన్నాడో చూడండి: ''ఈ గ్రాండ్ స్లామ్ టైటిల్‌కు అర్హులు ఎవరైనా ఉన్నారంటే అది మీరు మాత్రమే. చక్కగా ఆడారు. నిజంగానే చాలా చక్కగా! మంచి సమన్వయంతో ఉన్నారు. గ్లాండ్ స్లామ్ ప్రస్తుత పర్యటనల్లోని గొప్ప ఆటగాళ్లలో మీరు ఒకరు. మన మధ్య మంచి స్నేహపూర్వకమైన పోటీ నడిచింది. మీరింకా మరిన్ని గ్లాండ్ స్లామ్‌లు గెలవాలని, మరిన్ని మేజర్ లీగ్స్‌లో ఆడాలని నేను కోరుకుంటున్నాను. మళ్లీ కూడా మీరు ఇలాంటి విజయాన్ని నిశ్చయంగా సాధించ గలరని నేను కచ్చితంగా చెప్పగలను'' అని మెద్వెదేవ్‌ను మనస్ఫూర్తిగా అభినందించాడు జొకోవిచ్.

అదీ క్రీడాస్ఫూర్తి అంటే. అదీ పెద్దరికం అంటే. దురదృష్టవశాత్తూ గతవారం మన క్రికెట్ జట్టు ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించింది.

ఇక జొకోవిచ్ ప్రేక్షకులను ఉద్దేశించి ఏమన్నాడో తెలుసా! ''నేను మ్యాచ్ గెలవనప్పటికీ ఈ రాత్రి నా హృదయం పట్టనలవి కాని ఆనందంతో నిండి ఉందని మీకు చెప్పాలనుకుంటున్నాను. మీ అభిమానంతో మీరు నాకు కలిగించిన ప్రత్యేకమైన అనుభూతి కారణంగా నేనిప్పుడు భూమి మీద జీవించి ఉన్నవారిలో అత్యంత సంతోషకరమైన వ్యక్తిని. మీరు నా హృదయాన్ని స్పృశించారు. న్యూయార్క్‌లో నేనెప్పుడూ ఇలా లేను. నిజాయతీగా చెబుతున్నాను. నేను మీ అందరినీ ప్రేమిస్తున్నాను మిత్రులారా! నాకు మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు. మీరు నాకోసం చేసిన ప్రతిదానికీ కూడా'' అని ఉద్వేగంగా మాట్లాడాడు.

మన క్రికెటర్లు– ప్రధానంగా కోహ్లీ – గొప్ప క్రీడాకారులే అయినప్పటికీ వారు తమ ఓటమిని హుందాగా ఎలా స్వీకరించాలో నేటికింకా నేర్చుకోవలసే ఉంది. ఇందుకు రెండు కావాలి. మొదటిది క్రీడా పరాక్రమం. రెండోది శ్రేష్ఠమైన అంతఃచేతనాశక్తి. రెండోది లేకుండా మాత్రం నిజంగా మీరు గొప్పవారు కాలేరు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

శాస్త్రాలు కావు!



రామాయణం, మహాభారతం, వేదాలు, ఆయుర్వేదాలను 'సామాజిక శాస్త్రాలు'గా ఎన్సీఈఆర్టీ బోధించలేదు. పురాణం పురాణమే. సైన్సు సైన్సే. సామాజిక శాస్త్రాలు సమాజాన్ని శాస్త్రీయంగా స్వీకరిస్తాయి. అవి పురాణాన్ని శాస్త్రంగా బోధించకూడదు.

– సూర్యకాంత్ వాగ్‌మోరే, సోషియాలజీ ప్రొఫెసర్

వినలేని విషయాలు



ఇది చిత్రం. ప్రతి భారతీయుడూ బెర్ట్రాండ్ రసెల్ పుస్తకాలను చదవాలని 1926లో నెహ్రూ ఒక స్నేహితుడికి ఉత్తరం రాశారు. 1963లో నెహ్రూను విమర్శిస్తూ రసెల్ ఒక పుస్తకం రాశారు. నెహ్రూ దాన్ని నిషేధించారు. (ఇండో–చైనా యుద్ధం పై రాసిన అన్‌ఆర్మ్‌డ్ విక్టరీ.)

– అభిషేక్ బెనర్జీ, రచయిత

నవ్విస్తే అవార్డా?



బెంగళూరు విమానాశ్రయంలో భద్రతాధికారి నా బ్యాగులో ఉన్నది పురస్కారం అని తెలిశాక– "అభినందనలు, ఏం చేస్తుంటావు?" "కమెడియన్ సర్, జోకులు వినిపిస్తాను." "జోకులకు కూడా పురస్కారాలు ఇస్తున్నారా?" "నాకు కూడా చిత్రంగానే అనిపించింది సర్." ఇద్దరమూ నవ్వుకున్నాం.

– వీర్ దాస్, కమెడియన్

బాగా తినాల్సిందే!



నేను ఇండియాను వదిలిపెట్టినట్టే అనిపించదు. తైవాన్‌లో ఏ భారతీయ వేడుక జరిగినా, కనీసం ఐదు మంది నేను సరిగ్గా తినట్లేదనీ, సన్నబడ్డాననీ అంటారు. మన భారతీయులకు, ఇప్పటికే సన్నగా ఉన్నవాళ్లు వ్యాయామం చేయనే కూడదు. ప్రేమ మనుషులు!

– సనా హాష్మీ, ఫెలో

ప్రపంచ సమస్య




హమాస్ అనేది ఇజ్రాయెల్ సమస్య అని మీరు అనుకుంటే, అది పూర్తిగా తప్పు. రాజకీయ ఇస్లాం అనేది మొత్తం ప్రపంచ సమస్య.

– లూయీ అహ్మద్, యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

నూతన ఒరవడి సృష్టికర్త

వెయ్యేళ్ళుగా వస్తున్న సాహిత్య ఒరవడిని మార్చి మరో వెయ్యేళ్ళ ముందు చూపుతో రచనలు చేసి సంఘ సంస్కరణ కావించిన మహాకవి, మార్గదర్శి, యుగకర్త గురజాడ వేంకట అప్పారావు. అప్పటి విశాఖ జిల్లా ఎస్. రాయవరంలో 1862 సెప్టెంబర్ 21న జన్మించారు. విజయనగరం మహారాజావారి కళాశాలలో బి.ఎ. ఉత్తీర్ణులయ్యారు. సంస్కృతాంధ్ర, ఆంగ్లభాషా పాండిత్యంతో పాటు లాటిన్, పారసీ, కన్నడ, బెంగాలీ భాషలను కూడా బాగా చదివారు. ఆనంద గజపతి మహారాజు వద్ద శాసన పరిశోధకునిగా పనిచేశారు.



గురజాడ అప్పారావు

గిడుగు రామ్మూర్తి పంతులు వీరికి సహాధ్యాయులు. వీరిరువురూ వ్యవహారిక భాషకు పట్టం కట్టారు. అప్పుడే గురజాడ వారు 'అసమ్మతి పత్రం' రాశారు. ఆయన వ్యాకరణ శృంఖలాలను ఛేదించారు. సకల జనులు ఆదరించే విధంగా ముత్యాల సరాల మాత్రా ఛందస్సులో కరుణ రస ప్రధానంగా 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' లాంటి గేయాలను రాశారు. 'కన్యాశుల్కం' నాటకాన్ని వ్యవహారిక భాషలో రాశారు. నేటికీ ఇటువంటి గొప్ప నాటకం ఇంకొకటి రాలేదు. గురజాడ రాసిన 'దేశభక్తి' గేయం ఆయనను విశ్వకవిగా నిలుపుతుంది.


కులమతాలు అభివృద్ధికి ఆటంకాలని నిరసించారు. మంచి చెడు లనేవి మానవులలో రెండే కులాలు అన్నారు. 'అన్నీ మన వేదాల్లో ఉన్నాయిష' అన్న 'కన్యాశుల్కం'లోని అగ్నిహోత్రావధాని మాటలు ఆలోచింపదగినవి. ప్రపంచ దేశాలు హేతువాద దృక్పథంతో విజ్ఞాన శాస్త్ర ఫలాలు పొందుతుంటే మన దేశం నమ్మకాలు, ఆచారాలు అంటూ అనాలోచితంగా వెనుకబడిపోతోంది అన్నారు. వితంతు వివాహాలు చేయడానికి, కన్యాశుల్కం ఆపడానికి నడుం బిగించిన వీరేశలింగం పంతులు ఉద్యమాల స్ఫూర్తి, సౌజన్యారావు పంతులు లాటి సుజనమూర్తులను గురజాడ రచనల్లో ప్రతిబింబిస్తారు. 'మంచి గతమున కొంచెమేనోయి మందగించక ముందు కడుగు' వేయమన్నారు. ఇంతటి మహానుభావుడు 1915 నవంబర్ 30వ తేదీన తుదిశ్వాస విడిచారు.

– జక్కుల రామకృష్ణ

(నవంబర్ 30న మహాకవి గురజాడ వర్ధంతి)

ప్లాస్టిక్ భూతాన్ని మింగేసే బ్యాక్టీరియా

అభిప్రాయం



కె.బి. గోపాలం

ఈ ప్రపంచం మొత్తం మునిగిపోయినా చివరకు వజ్రాలు, ప్లాస్టిక్ మాత్రం మిగిలిపోతాయని చాలా సందర్భాల్లో చెబుతుంటారు. మనిషి తన సౌకర్యం కోసం తయారు చేసుకున్న కొత్త పదార్థాలలో ప్లాస్టిక్ అన్నిటికన్నా పెద్ద శత్రువుగా మారింది. ప్లాస్టిక్‌ను ఏ రకంగానూ పనికివచ్చే విధంగా తిరిగి మార్చడానికి వీలు లేదని పరిశోధకులంతా తలలు పట్టుకుని తరుణోపాయాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఎక్కడా అటువంటి మార్గం దొరికిన దాఖలా కనబడదు. కానీ ఈ మధ్యనే ఒక చిత్రమైన వార్త అందరికీ ఆశలు కలిగేలా చేసింది.

2001 సంవత్సరంలోనే జపనీస్ పరిశోధకులు ఒక వింత విషయాన్ని గమనించారు. మురికి నీరు గుంటలలో పడి ఉన్న ప్లాస్టిక్‌ను కరకరా నమిలేస్తున్న సూక్ష్మ జీవులు వారికి కనిపించాయి. ఆ ప్లాస్టిక్‌లోని కార్బన్‌ను సూక్ష్మజీవులు తిండిగా వాడుకుంటున్నాయి. మిగతా పదార్థాలు అన్నీ తిరిగి తమ సహజ పరిస్థితిలోకి మారు తున్నట్టు అక్కడ వారు గమనించారు. సూక్ష్మ జీవులు మరింతగా పెరుగుతున్నాయి. వాటి ఆకలి మరింతగా పెరుగుతున్నది. అవి మరింతగా ప్లాస్టిక్‌ను తింటున్నాయి.



ప్లాస్టిక్‌ను తినే బ్యాక్టీరియాను గమనించిన పరిశోధక బృందానికి నాయకుడు కోహెయి ఓడా. క్యోటో ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అతను ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. అతని బృందం వారు కనుగొన్న ఈ సూక్ష్మజీవులు అంతకు ముందు ఎక్కడా కనిపించినట్లు లేదు.

రాను రాను ప్లాస్టిక్ కాలుష్యం మాత్రం భయంకరంగా పెరిగిపోతోంది. దాన్ని పట్టించుకోకుండా ఉండే పరిస్థితి లేకుండా ఉంది. సూక్ష్మ జీవులు కనిపించిన నాటి నుండి ఇవాల్టి వరకు ప్రపంచంలో కొన్ని బిలియన్ టన్నుల ప్లాస్టిక్ తయారైంది అంటున్నారు. పసిఫిక్ సముద్రంలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ మేటలు పడి ఉన్నాయని కూడా గమనించారు. చివరకు పండ్లు, పాలలో కూడా మైక్రోప్లాస్టిక్ కాలుష్యం కనబడుతున్నది. మొత్తం ప్రపంచంలో తయారవుతున్న ప్లాస్టిక్‌లో 9 శాతం మాత్రమే రీసైక్లింగ్‌కు అందుతున్నట్లు లెక్క తేలింది. పెద్ద ఎత్తున ప్లాస్టిక్ పదార్థాలను మండిస్తున్నారు. దాని వల్ల మరింత కాలుష్యం కలుగుతున్నది.

మొదట్లో ప్లాస్టిక్‌ను నములుతున్న సూక్ష్మజీవులు కనిపించిన తర్వాత ఆ బృందం వారు వాటిని మరిచిపోలేదు. కాజుమి హిరాగా అనే విద్యార్థి ఈ అంశం గురించి పరిశోధనలు సాగిస్తూనే ఉన్నారు. 2016లో ఓడాతో కలిసి ఒక పరిశోధన పత్రాన్ని 'సైన్స్' అనే ప్రసిద్ధ పత్రికలో ప్రకటించారు కూడా. వెంటనే ఆ పత్రం అందరి దృష్టిని ఆకర్షించింది. కేవలం సూక్ష్మ జీవి గురించి మాత్రమే కాకుండా ప్లాస్టిక్‌ను కరిగించడానికీ, అరిగించడానికీ బ్యాక్టీరియా వాడుతున్న ఎంజైమ్ గురించి కూడా పరిశోధన పత్రంలో వివరాలు అందించారు. సూక్ష్మజీవికి 'ఐడియొనెల్లా సకాయియెన్సిస్' అని పేరు కూడా పెట్టారు. సకాయి అనే ఊళ్లో ఆ సూక్ష్మజీవి కనిపించింది మరి. వారి పరిశోధన పత్రాన్ని గురించి ఆ తర్వాత వచ్చిన 1000 పత్రాల్లో రాసినట్టు కూడా తెలిసింది.

40 సంవత్సరాలుగా ప్లాస్టిక్‌ను తినే బ్యాక్టీరియా గురించి పరిశోధన సాగుతూనే ఉన్నది. ఈ సంగతి పెద్దగా ప్రచారానికి మాత్రం రాలేదు. ఎంజైమ్‌ను పరిశీలించి జెనిటిక్ ఇంజనీరింగ్ ద్వారా అటువంటి ప్లాస్టిక్‌ను కరిగించే రసాయనాలను తయారు చేయవచ్చన్న భావన కూడా పరిశీలనలో ఉంది. అయితే ఈ రకమైన రసాయనాల పనితీరు గురించి సులభంగా చెప్పడానికి మాత్రం ఉండదు. కనుకనే పరిశోధన రెండు అడుగులు ముందుకు పడితే, ఒక అడుగు వెనక్కు పడుతున్నట్లు సాగుతున్నది. ఈ పరిశోధన కొత్త మార్గాల్లో ముందుకు సాగవలసిన అవసరం ఉందని కొలరాడో పరిశోధకులు బెల్ ఈ మధ్యనే ప్రకటించారు. పెట్ ప్లాస్టిక్‌ను కరిగించే 'పెటేస్' అనే ఎంజైమ్ గురించి వారి బృందం పరిశోధిస్తున్నది. రసాయనాన్ని కావాల్సిన రకాలుగా మార్చి చూచి మరింత ముందుకు సాగాలని వారు ప్రయత్నిస్తున్నారు.

దక్షిణ కొరియాలోని 'చోనామ్ నేషనల్ యూనివర్సిటీ' వారు ఈ మధ్య తమ పరిశోధనలో మంచి ఫలితాలను సాధించినట్లు తెలియవచ్చింది. ఒక చోట చాలా కాలంగా మేట పడిన ప్లాస్టిక్‌లో కొన్ని సూక్ష్మజీవులు హాయిగా ప్లాస్టిక్ తింటూ బతుకుతున్నట్టు గమనించారు. వియత్నాం, థాయిలాండ్ లాంటి చోట్ల కూడా ఇటువంటి సూక్ష్మ జీవులు కనిపించాయి.


సూక్ష్మ జీవులు అనగానే అందరికీ వాటి వల్ల రోగాలు వస్తాయి అన్న భావన మాత్రమే కలుగుతుంది. కానీ మనుషులు అనే మనం బ్రతకడానికి అవి ఎంతో ఉపయోగపడుతున్నాయన్న సంగతి ఇప్పటి వరకు కూడా చాలామందికి తెలియదు. ప్లాస్టిక్ కాలుష్యానికి సమాధానంగా సూక్ష్మ జీవులు దారి చూపిస్తే అది అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. మనిషిని కలకాలంగా కలవరపెడుతున్న ప్లాస్టిక్ కాలుష్యానికి నివారణోపాయం దొరికే అవకాశం ఉందంటే అది ఎంతో గొప్ప విషయం.

వ్యాసకర్త సైన్స్ రచయిత | 98490 62055

దూతకార్యం

సీతను అన్వేషించేందుకు బయలుదేరిన వానర వీరులందరిలో హనుమ ఒకడు కనక, సీత ఎక్కడ ఉన్నదో ఏ స్థితిలో ఉన్నదో తెలుసుకొని, తిరిగి వచ్చి, ఆ సమాచారం మాత్రమే చేరవేసి ఉన్నా అదొక అద్భుతమయిన ఘనకార్యంగా మిగిలిపోయేది. మనో జవంతో, మారుత తుల్య వేగంతో, నూరు యోజనాల సముద్రాన్ని లంఘించి, ఆవల ఉన్న సీత జాడ తెలుసుకొని రావడం సామాన్య విషయమా?

అయినా, అంజనీపుత్రుడు అంతమాత్రంతో తృప్తి పడలేదు. సీతమ్మను చూడడమే కాదు, ఆమెను కలిసి ఏకాంతంలో సమగ్రంగా సంభాషించి, చెప్పవలసిందంతా చెప్పి ఆమెకు ఊరట కలిగించాడు. అయ్యవారికి చేరవేసేందుకు అమ్మ సందేశాన్నీ, ఆనవాలుగా ఆమె చూడామణినీ అందుకొన్నాడు. వాటితో తిరిగి వచ్చినా, ఆ దూతకార్యం అసమానమయినదిగా చరిత్రలో నిలిచిపోయేది.



జ్యోతిర్మయం

ఆ మాత్రంతో మాత్రం కేసరినందనుడు సరిపెట్టుకొంటాడా? ఆయన దృష్టిలో, ఒక పని అప్పగిస్తే దానితోపాటు పనిలో పనిగా దానికి సంబంధించిన ఇతర కార్యాలు వీలయినన్ని చక్కబెట్టుకొచ్చేవాడే సమర్థుడైన కార్యసాధకుడు. అందుకే, వెంటనే తిరిగి వచ్చి 'చూశారా, చెప్పిన పని చేసుకొచ్చేశాను!' అని ప్రకటించుకొనేందుకు ఆయన తొందరపడలేదు. 'ఇంత దూరం వచ్చినప్పుడు ఇంకా ఏం చేయచ్చు?' అని ఆలోచించాడు.

'సీతను చూశాను. ఆమె రావణుడి చెరలో ఉంది' అని చెప్పినంత మాత్రాన అరణ్యవాసంలో ఉన్న శ్రీరాముడేం చేయగలడు? వెంటనే వచ్చి యుద్ధం చేసి శత్రువును జయించాలి. యుద్ధం చేయాలంటే శత్రువు శక్తి గురించి సరయిన సమాచారం ఉండాలి. అది పాపం ఆయనకు ఎలా దొరుకుతుంది? కనక నేనే సాహసించి, ఇప్పుడు ఇక్కడ ఒక స్థాయిలో యుద్ధం పెట్టుకొంటే, శత్రువు బలాబలాలూ, రణనీతులూ అంచనా కట్టే అవకాశం వస్తుంది' అని ఆలోచించాడు. అశోకవనాన్ని ధ్వంసం చేసి, కజ్జా పెట్టుకొని ఎనభయివేల మంది రాక్షసవీరులను హతం చేశాడు.

అదీ చాలదన్నట్టు, ఒక ఎత్తుగడ వేసి, నేరుగా నిర్భయంగా రావణుడి కొలువుకే వెళ్ళి, ఆయనతో ముఖాముఖి రాయబారం జరిపాడు. హితవు చెప్పడమే కాక, మాటలతోనూ చేతలతోనూ కూడా తీవ్రమైన హెచ్చరిక చేసి, అప్పుడు తిరిగివెళ్ళాడు. కర్తవ్య నిష్ఠా, భుజబలం, బుద్ధిశక్తీ, సహనం, సాహసం... ఒకటేమిటి సకల సద్గుణ సంపత్తిని ప్రదర్శించి, లోకమంతటి చేత 'శ్రీరామదూతం శిరసా నమామి' అనిపించాడు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** పౌర్ణమి ప.2.10 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** కృత్తిక ప.1.48 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** తె.5.52 నుండి 7.29 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.10 నుండి 12.58 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.13 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.26 నుండి 1.01 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.15, **సూర్యాస్తమయం:** 5.20.

మంచిమాట

దానం ధర్మం

దానధర్మాలు ద్వంద్వ సమాసం. జంటగా కనపడతాయి. రెండూ ఒకటే అనుకుంటారు. ధర్మంలో దానం కూడా భాగం. దానం అంటే తన కున్నదానిని ఇతరులకు ఇవ్వటం. 'ద' అంటే ఇవ్వటం. ఆ ప్రక్రియ దానం. దానం, ధర్మం అనే రెండింటిని సమానార్థకాలుగా ఉపయోగిస్తూ ఉంటాం. అడుక్కునేవాడు "అయ్యా! ధర్మం చేయండి." అంటాడు. తనకున్న దానిని లేనివాడికి పంచటం ధర్మాచరణలో భాగం అని అర్థం చేసుకోవాలి. "నీ కిదేమైనా ధర్మంగా ఉందా?" అని అడిగి నప్పుడు ధర్మం అంటే న్యాయం అని అర్థం చేసుకోవాలి.



రసాయన శాస్త్రంలో ఉదజని ధర్మాలు అని అంటే దాని సహజగుణాలు అని అర్థం. ''సూర్యుడు తూర్పున ఉదయించును'' అన్నది ఏ కాలం అని వ్యాకరణంలో అడిగినప్పుడు తద్ధర్మ కాలం అని సమాధానం వస్తుంది. ఇక్కడ కర్తవ్యం, విధి, తప్పక చేయవలసినది అనే అర్థం. తన దగ్గర ఉన్న దానిని ఇతరులతో పంచుకోవటం ధర్మంలో భాగం కనుక దానానికి పర్యాయ పదంగా ధర్మం అని అనటం జరుగుతోంది.

దానం ఇచ్చేటప్పుడు ఎట్లా ఇవ్వాలో పెద్దలు మనకి చెప్పారు. ''శ్రియా దేయం హ్రియా దేయం, సంవిదా దేయం'' అని. తన దగ్గర ఉన్న సంపదకి తగినట్టుగా ఇవ్వాలట. ఒక కోటీశ్వరుడు ఒక రూపాయి దానం చేస్తే ఎంత సిగ్గుచేటు? వంద సంపాదించే రోజుకూలీ రూపాయి ఇస్తే పరవాలేదు కాని యాభై ఇస్తే తన తాహతుకి మించింది. తరవాత కష్టపడతాడు. సిగ్గుపడుతూ ఇవ్వాలట. ఇంతకన్న ఇవ్వలేక పోతున్నాను అని. తానే సిగ్గు పడుతూ ఉంటే తీసుకున్నవారు ఇంకెంత సిగ్గుపడాలో! **తెలిసి ఇవ్వాలట.**

''గాలికి పోయిన పేలపిండి కృష్ణార్పణం'' అన్నట్టు కాకుండా మన చేతిలో నుండి జారిపోయింది దానం అనుకోకూడదు. ఇస్తున్నాను అని ఎరిగి ఇవ్వాలట. ఎవరికి ఇచ్చేది కూడా తెలిసి ఉండాలి. అంతా అయినాక వీళ్ళకా నేను ఇచ్చింది అని, ఇంత ఎందుకు ఇచ్చాను అని బాధపడకూడదు.

దానాలు చాలా కారణాలుగా, చాలా రకాలుగా చేస్తూ ఉంటారు. గ్రహదోషాలు ఉన్నాయి అంటే జపాలు తాము చేయలేరు కనుక ఎవరి చేతనైనా చేయిస్తారు. ఆ గ్రహానికి సంబంధించి కొన్ని వస్తువులు, ధనం దానం చేస్తారు. ఇది ప్రతిఫలాపేక్షతో చేసేది. ఒక రకమైన వ్యాపారం అని కొంతమంది వ్యాఖ్యానిస్తూ ఉంటారు. కొంతమంది ఆడంబరం కోసం దానాలు చేస్తూ ఉంటారు. తాము చేసిన దానిని ప్రకటించటం, ప్రచారం చేసుకోవటం, ఫోటోలు తీయించుకుని వార్తా పత్రికలలో వేయించుకుంటూ ఉండటం చూస్తాం. తీసుకున్న వారిని చులకనగా చూస్తూ తమకు కృతజ్ఞులై ఉండాలని ఆశించటం కనపడుతుంది. కొద్ది మంది ఎదుటి వారి అవసరం ఎరిగి అడగకుండానే దానం చేస్తూ ఉంటారు. వీళ్ళకి ఎటువంటి ప్రతిఫలాపేక్ష ఉండదు. పైగా ఎవరికీ చెప్పనీయరు. కుడి చేత్తో చేసినది ఎడమ చేతికి తెలియ కూడదట. ఎందుకు దానం చేశావు అంటే నా దగ్గర ఉన్నది, వాళ్ళ దగ్గర లేదు... అంటారు. తీసుకున్నవారు సంతోషించినప్పుడు ఆ భావ తరంగాలు ఇచ్చిన వారిని స్పృశిస్తాయి. వీరిని ఆవరించి ఉన్న ప్రతికూల తరంగాలు తప్పుకుంటాయి. ఇవ్వటానికి మా దగ్గర ఏముంది? అని సన్నాయి నొక్కులు నొక్కుతారు కొందరు. తథాస్తు దేవతలుంటారు. తస్మాత్ జాగ్రత్త! ఏమీ లేక పోవుట ఏమి? ధనం మాత్రమేనా ఇవ్వదగినది? జ్ఞానం, శరీరం, ఆలోచన, మాట .. ఇట్లా ఎన్నో! తన జ్ఞానాన్ని పంచవచ్చు. జ్ఞానం లేకపోతే శరీరంతో సేవ చేసి సహాయ పడవచ్చు. అదీ చేత కాకపోతే మాట సహాయం చేసి సేద తీర్చవచ్చు. ఇది ధర్మమే కదా! ఈ ధర్మాన్ని పరిరక్షించుకుంటూ ఉండాలి. అప్పుడు ఆ ధర్మమే మనల్ని కాపాడుతుంది.

– డా. ఎస్.అనంతలక్ష్మి

> **భారతీయ సంస్కృతిలో ధర్మానికి పెద్ద పీట వేశారు. ధర్మమే మనలను ఎల్లప్పుడు కాపాడుతుంది. మనం చాలా శతాబ్దాలు విదేశీయుల పాలనలో మగ్గిపోయాము. కాని ముష్కరులు మన ధర్మం మీద దెబ్బతీయలేక పోయారు. ధర్మగ్లాని దశలో మనం ఉన్నప్పుడు సాధుసంతులు, మహాత్ములు ఉక్కుగోడలా నిల్చొని ధర్మాన్ని కాపాడారు. అదే సమయంలో కొన్ని దేశాలు, సంస్కృతులు విదేశీయుల ఆక్రమణల కారణంగా నామరూపాలు లేకుండా పోయాయి. మనకు ఇతరులు ఏమి చేయకూడదనుకుంటామో అది ఇతరులకు మనం చేయక పోవడం సర్వోత్తమ ధర్మం. మన ప్రాచీన ద్రష్టలైన మునులు లోక కళ్యాణం కొరకు నిర్వచించిన ధర్మం, దాని ఆచరణ మనకు వారసత్వంగా ఒక తరం నుంచి ముందు తరానికి వస్తూ మన తరం వరకు వచ్చింది. అంటే ధర్మచక్రం ఏ తరంలోనూ ఆగిపోలేదు. ఈ తరంలో ఆగిపోతే తరువాత తరం వారు ధర్మ భ్రష్టులవుతారు. ధర్మచక్రం ఆగిపోతే ఈ జాతి మనుగడ ఉండదు.**

వాగ్గేయకార వైభవం

గురు వాక్యస్య... !!!



వాగ్గేయకారులలో గమనించవలసిన ఒక గొప్ప లక్షణం- వారిలోని గురు భక్తిని. అది లేకుండా సనాతన ధర్మంలో ఏ వ్యక్తీ పరిఢవిల్లలేదు. పుస్తకజ్ఞానం ఎంత ఉన్నా గురు ముఖతః నేర్చుకున్నదేదో అది మాత్రమే అభ్యున్నతికి కారణమవుతుంది. 'శ్రద్ధ' అని మనకు ఒక మాట ఉంది. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం- అంటారు గీతాచార్యులు. ఆ శ్రద్ధ ఎవరికి ఉన్నదో వారికి మాత్రమే జ్ఞానం కలుగుతుంది-అని. శ్రద్ధ అన్న మాటకు శంకరభగవత్పాదులు వ్యాఖ్యానం చేస్తూ.. ''శాస్త్రస్య గురువాక్యస్య సత్య బుద్ధ్యవధారణమ్' సాశ్రద్ధా కథితా సద్భిర్యాయా వస్తూపలభ్యతే''.. అంటారు.

శాస్త్రం చెప్పిన విషయం తిరుగులేని సత్యం... అన్న నమ్మకం ఉండాలి. కలడుకలండనెడువాడు కలడో లేడో...' అన్న అనుమానం దగ్గరే ఉండిపోకుండా 'భగవంతుడు ఉన్నాడు. శాస్త్రం చెప్పిన విషయం పరమ సత్యం..అని నమ్మాలి. ఆ పైన గురువాక్యస్య.. అంటే గురువుగారి నోటివెంట ఏది వచ్చిందో అది సత్యం. గురువుగారి నోటి వెంట వచ్చినది సత్యమయ్యేట్లు చూడవలసిన కర్తవ్యం భగవంతుడు తీసుకుంటాడు. అందుకే యోగి వాక్కు అంటారు.

యోగి వాక్కు అంటే – గురువుగారు సత్యం చెప్పారు.. అని కాదు .. గురువుగారు చెప్పినది సత్యం... అని అన్వయం చేసుకోవాలి. అంటే అంత తిరుగులేని విశ్వాసం ఉండాలి. అందుకే గురు విషయంలో స్థాన శుశ్రూష అంటారు. మనం ఉంటున్న ఇంటిని, మనం కొలిచే దేవుడు ఉండే దేవాలయాన్ని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో అలా గురువుగారుండే ప్రదేశాన్ని కూడా శిష్యులు శుభ్రం చేస్తూ గురువుగారికి సౌకర్యంగా ఉండేటట్లు చూస్తుంటారు.

ఈ కంటితో చూడలేని పరబ్రహ్మం సశరీరంతో... అంటే మనలాగా కాళ్ళుచేతులతో, ఇతరత్రా మనలాగే నడిచివెడితే అదే గురువు. 'గురుబ్రహ్మా గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీగురువేనమః'-అని. గురువే బ్రహ్మ. గురువు మనలోని జ్ఞానజ్యోతిని వెలిగిస్తాడు. అందుకని సృష్టికర్త. గురుర్విష్ణుః..అంటే శ్రీమహావిష్ణువు స్థితికారుడై ఏ విధంగా ఈ సృష్టినంతటినీ నిలబెడుతున్నాడో అలా జ్ఞానాన్ని, భక్తిని పతనం కాకుండా గురువు కాపాడుతుంటాడు. అందుకని విష్ణువు. గురుర్దేవో మహేశ్వరః.. మహేశ్వరుడు ఎలా లయకారుడో అట్లా అజ్ఞానాన్ని గురువు లయం చేసి జ్ఞానాన్ని ఇచ్చి నిలబెడుతుంటాడు. అందుకే గురువు పరబ్రహ్మము. అటువంటి గురువుకు... తస్మైశ్రీగురవేనమః. ... నమస్కరించుచున్నాను.


ఈ లోకంలో గురువుగారికి ప్రత్యుపకారం చేయడం కానీ, గురువుగారిని సత్కరించడం కానీ, గురువుగారికి మనం పదేపదే కృతజ్ఞతలు చెప్పడం కానీ సాధ్యమయ్యే విషయం కాదు. కాబట్టి గురువు విషయంలో కృతజ్ఞతగా చెయ్యగలిగినది ఒక్కటే- రెండు చేతులు కలిపి జోడించి శిరస్సు తాటించి నమస్కరించడం మాత్రమే. అది గురువుపట్ల చెదరిపోని నమ్మకంతో చేయాలి.. అది వాగ్గేయకారులందరూ చేశారు. కాబట్టే మహాత్ములయ్యారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి

పని ఒకటే... పాపాలు ఐదు..



ఒక సమయంలో బుద్ధుడు రాజగృహానికి వచ్చి, జీవకుని మామిడి తోటలో ఉంటున్నాడు. అది వేసవికాలం కావడంతో ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ ఆ తోటలో చల్లగానే ఉంటుంది. చెట్లన్నీ మామిడిపండ్లతో నిండుగా ఉన్నాయి. బుద్ధుడు అక్కడ ఉన్నాడని తెలిసి ఎందరెందరో అక్కడికి వచ్చి చేరేవారు. బుద్ధుని ప్రసంగాలు వింటూ ఉండేవారు.

భిక్షువులు ఉదయం పొద్దు బాగా పైకెక్కాక నగరంలో భిక్షకు వెళ్ళేవారు. మధ్యాహ్నం వేళకు ముందే తిరిగి వచ్చేవారు. మామిడి చెట్ల కింద చేరి తమ తమ అనుభవాలను చర్చించుకుంటూ ఉండేవారు. ఆ రోజు... ఇద్దరు భిక్షువులు తీసుకున్న భిక్ష మీద చర్చ జరిగింది. వారు భిక్షకు వెళ్ళినప్పుడు ఆ ఇంటి వారు ఆరోజు మాంసాహారం మాత్రమే వండుకున్నారు. అదే వారికి భిక్షగా వేశారు. ఆ ఇద్దరూ భిక్షను స్వీకరించారు. కానీ, వారిలో ఒకరు మాత్రమే దాన్ని తిన్నారు. రెండోవారు దాన్ని తెచ్చి కూరను జంతువులకు వేసి, ఉత్త చప్పిడి అన్నాన్నే భుజించాడు. మాంసాహార విషయంలో బుద్ధుడు అనేక నియమాలు పెట్టాడు. భిక్షువులు కూర్చొని భిక్ష విషయాలు మాట్లాడుకోవడం జీవకుడు విన్నాడు. బుద్ధుడు చెప్పిన పంచశీలలో మొదటిదే జీవహింస విషయం.

ఆ విషయం జీవకునికి బాగానే తెలుసు. జీవకుడు మెల్లగా బుద్ధుని దగ్గరకు వెళ్ళాడు. బుద్ధుడు ఆరామం ముందున్న పెద్ద మామిడి చెట్టు కింది అరుగు మీద కూర్చొని ఉన్నాడు.

జీవకుడు వెళ్ళి నమస్కరించాడు.

''జీవకా! అలా కూర్చో'' అన్నాడు బుద్ధుడు. జీవకుడు కూర్చొన్నాడు.

తాను విన్న భిక్షువుల సంభాషణలు చెప్పాడు. ''జీవకా! జీవహింసకు పాల్పడే వారికి అపుణ్యం (పాపం) ఐదుచోట్ల కలుగుతుంది. '' చంపడం కోసం.. అదిగో ఆ ప్రాణిని తీసుకొని రండి'' అని ఆదేశించినప్పుడు మొదటి పాపం తగులుతుంది. ఆ ప్రాణిని చంపడానికి దాని మెడకు తాడు వేసి వధించే చోటుకు లాక్కొని తీసుకుపోతున్నప్పుడు ఆ జంతువు భయపడుతుంది. దుఃఖపడుతుంది. అప్పుడు ఆ యజమానికి రెండోసారి పాపం కలుగుతుంది.

''వెళ్ళి దాన్ని చంపు. వధించు'' అన్నప్పుడు ఆ యజమానికి మూడోసారి పాపం చుట్టుకుంటుంది. ఎందుకంటే.. ప్రాణభీతితో ఆ జంతువు అల్లాడిపోతుంది. భయంతో గింజుకుంటుంది. దుఃఖంతో విలవిల్లాడుతుంది. ఇక ఆ జంతువుని వధిస్తున్నప్పుడు అది మరింత రోదిస్తుంది. అప్పుడు నాలుగోసారి పాపం వచ్చిపడుతుంది. అలాంటి మాంసాన్ని ఇతరులకు పెట్టినప్పుడు, భిక్షగా వేసినప్పుడు ఐదోసారి ఎంతో అపుణ్యం అంటుకుంటుంది. జీవకా! తెలిసి, తన కోసమే వండిన ఈ ఆహారాన్ని తిన్న వారికి ఇంత కుమించిన అపుణ్యం కలుగుతుంది.'' అన్నాడు. ఒక్క జీవహింసలోనే కాదు.. ఏ చెడ్డ పనికైనా ఇలాంటి పాపాలు కలుగుతాయని తెలుసుకుని బుద్ధునికి వినమ్రంగా ప్రణమిల్లాడు జీవకుడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

విదేశాలకు ఫ్యామిలీస్టార్



● విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్

విదేశాలకు పయనం అవనున్నారు ఫ్యామిలీస్టార్. విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా పరశురామ్ పెట్ల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఫ్యామిలీస్టార్'. ఈ సినిమా చిత్రీకరణ ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. విజయ్, మృణాల్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ అమెరికాలో జరగనుందని తెలిసింది. నెల రోజులకుపైగా అక్కడి లొకేషన్స్‌లో జరిగే ఈ భారీ షెడ్యూల్‌తో ఈ సినిమా మేజర్ షూటింగ్ పూర్తి కానున్నట్లుగా తెలుస్తోంది. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న 'ఫ్యామిలీస్టార్' తొలుత సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కావడం లేదని, మార్చిలో రిలీజ్ కానుందనే టాక్ లేటెస్ట్‌గా వినిపిస్తోంది. ఈ సినిమాలో రష్మికా మందన్నా ఓ అతిథి పాత్ర చేస్తున్నారని భోగట్టా. అయితే ఈ అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

రెండు ప్రపంచాలు



● తిరువీర్

'జార్జిరెడ్డి', 'పలాస', 'మసూద' వంటి చిత్రాల్లో తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించిన నటుడు తిరువీర్ మరో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ద్రిష్టి తల్వార్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించనున్నారు. డార్క్ కామెడీ జానర్‌లో ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాకు రాజ్ విరాట్ దర్శకత్వం వహించనున్నారు. ఏ మూన్‌షైన్ పిక్చర్స్‌పై సాయి మహేష్ చందు, సాయి శశాంక్ నిర్మించనున్న ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. ''రెండు వేర్వేరు ప్రపంచాల కలయికగా, యూనిక్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుంది. వినోదాత్మక చిత్రంగా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: లియోన్ జేమ్స్.

గీతాంజలి మళ్లీ వస్తోంది



● కోన వెంకట్, అంజలి

అంజలి టైటిల్ రోల్‌లో, 'సత్యం' రాజేష్, శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్రల్లో నటించిన హారర్ కామెడీ ఫిల్మ్ 'గీతాంజలి' (2014) హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'గీతాంజలి మళ్లీ వచ్చింది' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో అంజలి, 'సత్యం' రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, 'షకలక' శంకర్ ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. 'నిన్నుకోరి', 'నిశ్శబ్దం' సినిమాలకు వర్క్ చేసిన కొరియోగ్రాఫర్ శివ తుర్లపాటి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రచయిత, నిర్మాత కోన వెంకట్ సమర్పణలో ఎంవీవీ సినిమా, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థలపై ఎంవీవీ సత్యనారాయణ, జీవీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హైదరాబాద్, ఊటీ నేపథ్యాల్లో ఈ సినిమా కథనం సాగుతుంది. ''ఇప్పటి వరకు 80 శాతం చిత్రీకరణ పూర్తయింది. త్వరలో జరగనున్న ఊటీ షెడ్యూల్‌తో ఈ సినిమా షూటింగ్ పూర్తవుతుంది. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

హైదరాబాద్‌లో వైజాగ్



● వరుణ్ తేజ్

యాక్షన్ మోడ్‌లోకి వెళ్లడానికి సిద్ధమవుతున్నారు హీరో వరుణ్ తేజ్. 'పలాస' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కనున్న యాక్షన్ ఫిల్మ్ 'మట్కా'. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించనున్నారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ డిసెంబరులో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌కి సంబంధించిన పనులతో బిజీగా ఉన్నారు చిత్రయూనిట్. ''దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఓ వాస్తవ ఘటన ఆధారంగా వైజాగ్ నేపథ్యంలో ఈ సినిమా కథ ఉంటుంది. 24 ఏళ్ల వ్యవధిలో (1958 –1982) జరిగే ఈ సినిమాలో వరుణ్ నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించనున్నారు. 1950, 1980 నాటి వాతావరణాన్ని తలపించేలా భారీ సెట్స్‌ను రూపొందిస్తున్నాం. హైదరాబాద్‌లో ఓల్డ్ వైజాగ్ సిటీని క్రియేట్ చేసేందుకు ఓ భారీ సెట్‌ను నిర్మిస్తున్నాం. ఈ సినిమాకు నలుగురు ఫైట్ మాస్టర్స్ వర్క్ చేస్తారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్.

కాంబినేషన్ కుదిరిందా?



● అజిత్

హీరో అజిత్ ప్రస్తుతం 'విడాముయార్చి' సినిమాతో బిజీగా ఉన్నారు. మగిళ్ తిరుమేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ అజర్‌బైజాన్‌లో పూర్తయిందని కోలీవుడ్ టాక్. అయితే అజిత్ తెలుగులో ఓ సినిమా కోసం రెడీ అవుతున్నారని, మైత్రీ మూవీమేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందనే టాక్ తెరపైకి వచ్చింది. అంతే కాదు.. ఈ సినిమాకు దర్శకుడిగా గోపీచంద్ మలినేని పేరు అనుకుంటున్నారట. మరి.. అజిత్, గోపీచంద్ మలినేని కాంబినేషన్ కుదిరిందా? లేదా? అన్నది తెలియాలంటే మరికొంత సమయం వేచి చూడాలి.

వీకే నరేష్‌కి డాక్టరేట్ ప్రదానం



● డాక్టరేట్ అందుకుంటున్న వీకే నరేష్

నటుడు వీకే నరేష్‌కి అరుదైన గౌరవం దక్కింది. ఐక్య రాజ్య సమితి అనుబంధ సంస్థ అయిన 'ఐఎస్ సీఏహెచ్ ఆర్' నుంచి ఆయన 'సార్' అనే బిరుదుతో పాటు డాక్టరేట్‌ని అందుకున్నారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో తాజాగా జరిగిన 5వ ప్రపంచ కాంగ్రెస్ సమావేశాల్లో వీకే నరేష్‌కు ఈ అరుదైన గౌరవం దక్కింది. ఈ సమావేశాలను 'నేషనల్ అకాడమీ ఆఫ్ సెక్యూరిటీ అండ్ డిఫెన్స్' సంస్థతో పాటు 'ఇంటర్నేషనల్ స్పెషల్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ అండ్ హ్యూమన్ రైట్స్ (ఐఎస్ సీఏహెచ్‌ఆర్)' కలిసి నిర్వహించాయి. ఐఎస్ సీఏహెచ్‌ఆర్ సంస్థ ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ. ఇది నాటో, యూరోపియన్ యూనియన్, అమెరికా వంటి దేశాల గుర్తింపు ఉన్న సంస్థ కూడా.. అక్కడ నరేష్‌కు మరో గౌరవం దక్కింది. మిలటరీ ఆర్డ్స్ గుడ్‌విల్ అంబాసిడర్‌తో పాటు లెఫ్టినెంట్ కల్నల్‌గా ఆయన్ను నియమించినట్లు సన్నిహితులు తెలిపారు. ఇకపై నరేష్ పేరు ముందు లెఫ్టినెంట్ కల్నల్, సార్... అనే హోదా చేరుతుంది. ఉగ్రవాదం, సామాజిక సమస్యలు వంటి అంశాలపై అనేక అంతర్జాతీయ వేదికలపై నరేష్ ప్రసంగించినందుకు గుర్తింపుగా ఈ గౌరవాలు దక్కాయి.

మళ్లీ కలసి పనిచేస్తాం - చైతన్య కృష్ణ



● వైదిక, చైతన్య కృష్ణ, జయకృష్ణ, వంశీకృష్ణ

''మంచి సందేశంతో సమాజానికి అవసరమైన కథ 'బ్రీత్'. వంశీకృష్ణగారు అన్ని విషయాల్లో జాగ్రత్త తీసుకొని ఈ సినిమాని తీర్చిదిద్దారు.. భవిష్యత్‌లో మేము మళ్లీ కలసి పనిచేస్తాం. ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని హీరో చైతన్య కృష్ణ అన్నారు. వంశీకృష్ణ ఆకెళ్ల దర్శకత్వంలో చైతన్య కృష్ణ, వైదిక సెంజలియా జంటగా నటించిన చిత్రం 'బ్రీత్'. బసవతారకరామ క్రియేషన్స్‌పై నందమూరి జయకృష్ణ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నందమూరి జయకృష్ణ మాట్లాడుతూ–''బ్రీత్ మంచి ఎమోషనల్ థ్రిల్లర్. సినిమా చాలా బాగా వచ్చింది.. ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''చైతన్య కృష్ణ కోసం అన్ని కమర్షియల్ అంశాలతో కూడిన, ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని అద్భుతమైన కథని రెడీ చేశాను. 'బ్రీత్' సక్సెస్ తర్వాత అది కూడా చేయాలనేది నా ఆకాంక్ష'' అన్నారు వంశీకృష్ణ ఆకెళ్ల. ఈ వేడుకలో వైదిక సెంజలియా, నందమూరి రామకృష్ణ, నందమూరి మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరువునష్టం దావా వేస్తా - మన్సూర్ అలీఖాన్

ప్రముఖ హీరో చిరంజీవి, హీరోయిన్ త్రిషలపై పరువునష్టం దావా వేయనున్నట్లు నటుడు మన్సూర్ అలీఖాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. ''నేను ఈనెల 11వ తేదీన త్రిష గురించి మీడియా ముందు మాట్లాడితే ఆ వీడియోను కొన్ని దుష్టశక్తులు ఎడిట్ చేసి తప్పుగా ప్రసారం చేశాయి. సినిమా, రాజకీయాల పరంగా నన్ను దెబ్బ కొట్టాలనే కుట్రలో భాగంగానే ఇది జరిగింది. ఈ విషయంలో నన్ను విమర్శించిన నటుడు చిరంజీవి, నటి త్రిషపై నా న్యాయవాది ద్వారా చెన్నై హైకోర్టులో పరువు నష్టం దావా వేయనున్నాను'' అంటూ పేర్కొన్నారు. కాగా త్రిషపై ఇటీవల మన్సూర్ అలీఖాన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే.

– సాక్షి, చెన్నై.

నవ్వులే నవ్వులు



● చంద్రశేఖర్

చంద్రశేఖర్, సోనాలి పాణిగ్రాహి, అశోక్ వర్ధన్, యాదమ్మ రాజు, అప్పారావు, బేబీ ప్రేక్షిత ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ప్లాంట్ మ్యాన్'. కె.సంతోష్ బాబు దర్శకత్వం వహించారు. డీఎం యూనివర్సల్ స్టూడియోస్‌పై పన్నా రాయల్ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్‌లో విడుదలకానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. పన్నా రాయల్ మాట్లాడుతూ–''కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా 'ప్లాంట్ మ్యాన్'. ప్రారంభం నుంచి చక్కని వినోదం ఉంటుంది. ఒక కొత్త అంశం కూడా ఉంది.. అందుకే ఈ సినిమాకి 'ప్లాంట్ మ్యాన్' అనే టైటిల్ నిర్ణయించాం. ఈ చిత్రం తర్వాత కూడా మా బేనర్‌లో కొత్తవారిని పరిచయం చేస్తూ సినిమాలు నిర్మిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: పీఎస్. మణికర్ణన్, నేపథ్య సంగీతం: వినోద్ యాజమాన్య, సంగీతం: ఆనంద బాలాజీ, నిర్మాత–దర్శకత్వ పర్యవేక్షణ: పన్నా రాయల్.

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
మార్పు	48	8
ముగింపు	65,970	19,794

విదేశీ సూచీలు

నాస్‌డాక్	14,251	▽	15
డోజోన్స్	35,390	△	117
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,488	△	5
డాక్స్	16,029	△	35
షాంఘై	3,041	▽	21
నికాయ్	33,626	△	181

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.59	84.26
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.86	106.22
€	యూరో	ఎస్‌బీఐ	89.39	95.46
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.58	54.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.52	55.90
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	54.31	56.78
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.28	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.80	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.53	12.61



- అవసరాలకు తగిన కార్డే తీసుకోవాలి
- కార్డులు ఎన్ని ఉన్నా.. సకాలంలో చెల్లింపులు
- వినియోగం 50 శాతం మించకూడదు
- చెల్లింపుల్లో వైఫల్యం మంచిది కాదు
- నియమాలు, షరతులు తెలిసి ఉండాలి

కార్డులు ఎక్కువైతే చిక్కులేనా..?

ఆరాధన (31) ఐటీ ఉద్యోగి. ప్రయాణాలంటే ఆమెకు ఎంతో ఇష్టం. వీలు చిక్కినప్పుడల్లా ఏదో ఒక పర్యటనకు సిద్ధమైపోతుంది. ఇటీవల ఓ షాపింగ్ మాల్‌కు వెళ్లిన సందర్భంలో క్రెడిట్ కార్డ్ కంపెనీ సేల్స్ ఉద్యోగి ఆమెకు ఎదురుపడ్డాడు. మంచి ఫీచర్స్‌తో కూడిన క్రెడిట్ కార్డ్ అంటూ.. అందులోని ఉపయోగాలు చదివి వినిపించే ప్రయత్నం చేశాడు. నిజానికి క్రెడిట్ కార్డ్ తీసుకోవాలన్న ఆసక్తి ఆరాధ్యకు ఎంతమాత్రం లేదు. కానీ, ఎలాంటి జాయినింగ్ ఫీజు లేదని, దేశీయంగా ప్రీమియం ఎకానమీ విమాన టికెట్ల కొనుగోలుపై మూడు రెట్లు అధికంగా రివార్డు పాయింట్లు ఆఫర్ చేస్తుందని చెప్పగా, ఆ పాయింట్ ఆమెకు ఎంతో నచ్చింది. దీనికితోడు షాపింగ్ చేసిన ప్రతి సందర్భంలో సాధారణ రివార్డ్ పాయింట్లు వస్తాయని చెప్పాడు. దీంతో అప్లికేషన్‌పై సంతకం చేసి ఇచ్చేసింది. కార్డు చేతికి వచ్చిన ఏడాది తర్వాత కానీ, వాస్తవాలు ఆమెకు తెలియలేదు.

కార్డ్ కంపెనీ వార్షిక రుసుము అంటూ రూ.3,000 చార్జ్ చేసింది. సేల్స్ ఏజెంట్ చెప్పినట్టు సదరు క్రెడిట్ కార్డ్ జీవిత కాలం ఉచితమేమీ కాదని అర్థమైంది. అప్పుడు కార్డ్ నిబంధనలు, షరతులు చదివిన తర్వాత కానీ ఆమెకు అర్థం కాలేదు ఆ కార్డ్ తన అవసరాలను తీర్చేది కాదని. వార్షిక ఫీజు మినహాయించాలంటే కార్డ్ కంపెనీ పెట్టిన లక్ష్యం మేరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని అర్థమైంది. ఆర్థిక సంబంధ నిర్ణయం తీసుకునే ముందు (కొనుగోళ్లు, పెట్టుబడులు) పూర్తి వివరాలు తెలుసుకోకపోతే ఏం జరుగుతుందన్న దానికి ఆరాధ్యకు ఎదురైన అనుభవమే నిదర్శనం. తమ అవసరాలకు అనుకూలమైన క్రెడిట్ కార్డ్‌కే పరిమితం కావాలని ఇది సూచిస్తోంది. క్రెడిట్ కార్డ్‌తో వచ్చే ప్రయోజనాలు చూసి చాలా మంది ఒకటికి మించిన కార్డులు తీసుకుంటూ ఉంటారు. అసలు ఒకరికి ఎన్ని క్రెడిట్ కార్డులు ఉండాలి..? క్రెడిట్ కార్డ్ తీసుకునే ముందు ఏం చూడాలి? ఒకటికి మించిన కార్డులు ఉంటే ఎలా నడుచుకోవాలి..? ఈ విషయాలపై అవగాహన కల్పించడమే ఈ కథనం ఉద్దేశం.

అనుకూలతలు

- ఒకటికి మించి క్రెడిట్ కార్డులు ఉంటే, అప్పుడు ఒక్కో కార్డు వారీ వినియోగించుకునే పరిమితి 50 శాతం మించకుండా చూసుకోవచ్చు. ఇది క్రెడిట్ స్కోర్‌కు అనుకూలం.
- ఒకటికి మించి క్రెడిట్ కార్డులు వాడుతూ, అన్ని బిల్లులను గడువులోపు చెల్లించేట్టు అయితే క్రెడిట్ స్కోర్ పెరిగేందుకు దారితీస్తుంది. దీనివల్ల భవిష్యత్తులో రుణాలు వేగంగా, ఆకర్షణీయమైన రేటుకు లభిస్తాయి.
- క్రెడిట్ కార్డ్ సంస్థలు ట్రాక్ రికార్డ్ మెరుగ్గా ఉన్న వారికి అదనపు లిమిట్ ఆఫర్ చేస్తుంటాయి. అత్యవసరాల్లో ఈ అదనపు పరిమితి ఉపయోగపడుతుంది. మరిన్ని రివార్డ్‌లు, క్యాష్‌బ్యాక్‌లు అందుకోవచ్చు.



ప్రతికూలతలు

- ఒకటే కార్డ్ ఉంటే వినియోగ నిష్పత్తి (కార్డ్ యుటిలైజేషన్ రేషియో) గరిష్ట స్థాయిలో ఉంటుంది.
- ఒకటికి మించి కార్డులు ఉంటే ప్రతీ కార్డ్ బిల్లును పరిశీలిస్తూ, గడువులోపు వాటి బిల్లులు చేయడం కొంత అదనపు శ్రమతో కూడినది. కార్డ్‌లు ఎక్కువై, సకాలంలో చెల్లింపులు చేయడంలో విఫలమైతే అది స్కోర్‌ను దెబ్బతీస్తుంది.
- ఒకటికి మించి కార్డ్‌లు ఉంటే, క్రమశిక్షణతో, వివేకంగా వినియోగించుకోకపోతే అది రుణ ఊబిలో చిక్కుకునేందుకు కారణమవుతుంది.
- అవసరం లేకుండా ఎక్కువ కార్డులు నిర్వహిస్తుంటే, వాటికి చెల్లించే ఫీజుల రూపంలో నష్టపోవాల్సి వస్తుంది.

కొత్తగా క్రెడిట్ కార్డ్ తీసుకోవాలనుకునే వారు ముందు తమ అవసరాలు ఏంటో తేల్చుకోవాలి. రుణాలకు కొత్త వారు అయి, మంచి క్రెడిట్ స్కోరును నిర్మించుకోవాలని అనుకునే వారు తక్కువ ఫీజుతో కూడిన ప్రాథమిక స్థాయి క్రెడిట్ కార్డ్‌కు పరిమితం కావాలి. అప్పటికే దెబ్బతిన్న క్రెడిట్ స్కోరును బలోపేతం చేసుకోవాలని అనుకుంటే, అప్పుడు సెక్యూర్డ్ కార్డ్‌ను తీసుకుని వినియోగించుకోవడం సరైనది. ఒకటికి మించి

ఏ అవసరం కోసం..?



కార్డులు ఉంటే, అప్పుడు అవి తీర్చలేని అవసరాలతో కూడిన కొత్త కార్డ్‌ను తీసుకోవచ్చు. కొన్ని కార్డ్‌లు రివార్డ్ పాయింట్లు, ఎయిర్‌మైల్స్ లేదా క్యాష్ బ్యాక్ ఆఫర్లు, అన్నీ కలిపి బండిల్‌గా ఇస్తుంటాయి. ఈ రివార్డ్‌లు తమకు ఎంత వరకు ఉపయోగమన్నది ఆలోచించుకోవాలి. తమ అవసరాలకు అనుకూలమంటే తీసుకోవచ్చు. ఎయిర్‌పోర్ట్‌లలో లాంజ్ సేవలను ఉచితంగా అందించే కార్డులు కూడా ఉన్నాయి. విదేశీ లావాదేవీలపై ఫీజుల్లేని, సినిమా టికెట్లపై, రెస్టారెంట్ చెల్లింపులపై అదనపు డిస్కౌంట్‌లు ఆఫర్ చేసే కార్డుల్లో తమకు అనుకూలమైన దానిని ఎంపిక చేసుకోవచ్చు.

కార్డుతో వినియోగం ఎక్కువగా ఎక్కడ ఉంటుంది? ప్రతి నెలా వినియోగించుకున్నంత మేర పూర్తిగా తిరిగి చెల్లిస్తారా..? లేక బ్యాలన్స్‌ను క్యారీ ఫార్వార్డ్ చేస్తారా.? కనీస మొత్తాన్ని చెల్లించి, మిగిలిన బ్యాలన్స్‌ను క్యారీ ఫార్వార్డ్ చేసుకునే వారు తక్కువ వడ్డీ రేటును చార్జ్ చేసే కార్డును ఎంపిక చేసుకోవాలి. పరిమిత బడ్జెట్‌తో కుటుంబాన్ని నడిపించే వారికి తక్కువ రేటు వసూలు చేసే కార్డ్‌లు అనుకూలం. దీర్ఘకాలంలో వీటితో ఎంతో

వినియోగం ముఖ్యం..

ఆదా చేసుకోవచ్చు. యూజర్లు కార్డ్‌తో ఎక్కువగా ఎక్కడ ఖర్చు చేస్తున్నారన్నది విశ్లేషించుకోవాలని మై మనీ మంత్ర మార్కెట్ ప్లేస్ ఎండీ రాజ్ ఖోస్లా పేర్కొన్నారు. కార్డుల మధ్య ప్రయోజనాల్లో వ్యత్యాసం ఉంటుందన్నారు. ''తరచూ ప్రయాణించే వారు ఎయిర్‌మైల్స్ లేదా హోటల్ పాయింట్లను ఆఫర్ చేసే కార్డును ఎంపిక చేసుకోవాలి. కార్డుపై అయ్యే వ్యయాలతో పోలిస్తే ప్రయోజనాలు మెరుగ్గా ఉండాలన్నది మర్చిపోవద్దు. ఒకటికి మించిన ప్రయోజనాలు ఆఫర్ చేసే కార్డులకు వార్షిక ఫీజు ఉంటుంది. కనుక ఆయా ప్రయోజనాలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేట్టు అయితేనే సదరు కార్డులు తీసుకోవాలి. అప్పుడే వార్షిక ఫీజు చెల్లించడం ప్రయోజనకరంగా అనిపిస్తుంది''అని రాజ్ ఖోస్లా సూచించారు.

ఖర్చులు-ప్రయోజనాలు

కార్డు వార్షిక ఫీజు కంటే వచ్చే ప్రయోజనాలు ఎక్కువగా ఉండాలి. ఏటా ఇంత ఖర్చు చేస్తేనే వార్షిక రుసుము మినహాయింపు అనే షరతు ఉంటే.. మీ వినియోగం అదే స్థాయంలో ఉంటుందా? అన్నది చూసుకోవాలి. కార్డ్‌ను తక్కువగా వినియోగించుకునే వారికి వార్షిక రుసుముతో వచ్చేవి అనుకూలం కాదు. కార్డులు సాధారణంగా వార్షిక రుసుం, యాన్యువల్ పర్సంటేజ్ రేట్ (ఏపీఆర్), బ్యాలన్స్ ట్రాన్స్‌ఫర్ ఫీజు, విదేశీ లావాదేవీల రుసుంతో వస్తాయి. యాన్యువల్ పర్సంటేజ్ రేట్ అంటే.. ప్రతి నెలా కార్డ్ బిల్లుపై కొంత మొత్తం చెల్లించి, క్యారీ ఫార్వార్డ్ చేసుకునే మిగిలిన బ్యాలన్స్‌పై అమలు చేసే వడ్డీ రేటు. క్రెడిట్ స్కోరు, కార్డు ఏ రకం అన్న దాని ఆధారంగా ఈ వడ్డీ రేటులో మార్పు ఉంటుంది. కనుక ప్రతి నెలా పూర్తి బిల్లు చెల్లించలేని వారికి తక్కువ ఏపీఆర్ ఉండే కార్డు అనుకూలంగా ఉంటుంది. నిజానికి ఒక అధ్యయనం ప్రకారం అధిక శాతం మంది కార్డ్ కస్టమర్లు తాము పొందే రివార్డులతో పోలిస్తే కార్డు కంపెనీకి చెల్లించే ఫీజులు, వడ్డీయే ఎక్కువగా ఉంటున్నట్టు తెలుస్తోంది. ''కార్డ్ సంస్థ ఆఫర్ చేస్తున్న ప్రయోజనాలు ఫీజుల కంటే మెరుగ్గా ఉన్నాయా? అన్నది తెలుసుకోవాలి. తక్కువ రివార్డులు, అధిక వార్షిక ఫీజుతో కూడిన ప్రాథమిక క్రెడిట్ కార్డ్ ఏమంత ఉపయోగకరం కాకపోవచ్చు. ఎందుకంటే మార్కెట్లో తక్కువ వార్షిక ఫీజుతో లేదా అసలు వార్షిక ఫీజు లేని కార్డులు ఎన్నో ఉన్నాయి''అని పైసా బజార్ క్రెడిట్ కార్డుల విభాగం హెడ్ రోహిత్ చిబ్బార్ పేర్కొన్నారు. విదేశీ ప్రయాణాలకు వెళ్లే వారు అంతర్జాతీయ లావాదేవీలకు చార్జ్ వసూలు చేయని కార్డులు తీసుకోవడం లాభదాయకమని సూచించారు. అలాగే, రివార్డుల శాతాన్ని కూడా చూడాల్సి ఉంటుంది. అన్ని రకాల కొనుగోళ్లపై ఫ్లాట్ 2 శాతం చొప్పున రివార్డులు ఆఫర్ చేస్తుంటే, అది మంచి డీల్ అవుతుంది.

ఎన్ని కార్డులు..?



ఒకరికి ఎన్ని కార్డులు ఉండాలన్న దానికి ఎలాంటి నియమం లేదు. కాకపోతే ఎక్కువ కార్డ్‌లు ఉంటే, వాటితో పాటు రిస్క్‌లు కూడా ఉంటాయని మర్చిపోవద్దు. ''ఒకటికి మించి క్రెడిట్ కార్డ్‌లు ఉంటే, విడిగా ఒక్కో దానిని సరైన రీతిలో వినియోగిస్తూ గరిష్ట స్థాయిలో ఆదా చేసుకోవాలి'' అని చిబ్బార్ పేర్కొన్నారు. ప్రతి కార్డ్‌కు ఉండే బిల్లింగ్ సైకిల్‌కు అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు. అప్పుడు నెలవారీ నగదు ప్రవాహాలను తెలివిగా వినియోగించుకోవచ్చన్నారు. విడిగా ఒక్కో కార్డ్‌లో వినియోగించకుండా మిగిలిపోయిన లిమిట్, అత్యవసర సమయాల్లో అక్కరకు వస్తుంది. ఒకటికి మించిన కార్డులు కలిగిన వారు, సరైన రీతిలో ఉపయోగించుకోకుండా, ఎక్కువగా వాడేస్తే అది రుణ ఊబిలోకి తీసుకెళుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక లిమిట్‌తో ఎక్కువ క్రెడిట్ కార్డులు కలిగి ఉండడం, అన్నింటినీ గరిష్ట పరిమితి మేరకు వినియోగిస్తుంటే అది క్రెడిట్ స్కోర్‌కు మంచిది కాదు. ఎందుకంటే అది అధిక రిస్క్‌కు దారితీస్తుంది. సంఖ్యతో సంబంధం లేకుండా తమ అవసరాలకు పక్కాగా నప్పే కార్డ్ ఉండాలన్నది ప్రాథమిక నియమం. ఎక్కువగా ప్రయాణించని వారికి ట్రావెల్ ప్రయోజనాలతో కూడిన క్రెడిట్ కార్డుతో వచ్చేదేమీ ఉండదు. కార్డులు ఎక్కువైతే వార్షికంగా చెల్లించే ఫీజులు, నికరంగా ఒరిగే ప్రయోజనం ఎంతన్న విశ్లేషణ అవసరం. ఎన్ని కార్డులు ఉన్నా, ఎంత వినియోగించుకున్నా, గడువులోపు పూర్తి బిల్లు చెల్లించడం ఎంతో ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే అది రుణ పరపతిపై ప్రభావం చూపిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపుల్లో వైఫల్యం లేకుండా చూసుకోవాలి.

కార్డును సమీక్షించుకోవాలి..

క్రెడిట్ కార్డ్ తీసుకునే సమయంలో చెప్పిన ప్రయోజనాలు ఎప్పటికీ కొనసాగుతాయని అనుకోవద్దు. కార్డ్ సంస్థ ఎప్పుడైనా అందులోని ప్రయోజ



నాల్లో మార్పులు చేయవచ్చు. ఈ విషయాలను ఈ మెయిల్ రూపంలో తెలియజేస్తాయి. కార్డ్ కంపెనీల నుంచి వచ్చే మెయిల్స్‌ను చాలా మంది పెద్దగా పట్టించుకోరు. దీనివల్ల ప్రయోజనాలు కోల్పోవాల్సి వస్తుంది. అందుకని ఏడాదిలో రెండు సార్లు అయినా, క్రెడిట్ కార్డు నియమ, నిబంధనలు, ప్రయోజనాలను సమీక్షించుకోవాలి. రివార్డ్ పాయింట్లను కూడా రెడీమ్ చేసుకోవాలి. లేదంటే అవి కాలం చెల్లిపోయే ప్రమాదం ఉంటుంది. మారిన నియమ, నిబంధనల ప్రకారం ఇక మీదట సంబంధిత క్రెడిట్ కార్డ్ ప్రయోజనకరం కాదని గుర్తిస్తే, దాన్ని రద్దు చేసుకోవడం మంచిది. క్రెడిట్ కార్డ్‌ను రద్దు చేసుకుంటే, అది తాత్కాలికంగా క్రెడిట్ స్కోర్‌ను దెబ్బతీస్తుందని గుర్తు పెట్టుకోవాలి.

టీవీఎస్ నుంచి మరిన్ని ఎలక్ట్రిక్ టూ-వీలర్లు

త్రీ-వీలర్‌పై కసరత్తు

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ టీవీఎస్ మోటర్ వచ్చే ఏడాది వ్యవధిలో తమ ఎలక్ట్రిక్ టూ-వీలర్ల పోర్ట్‌ఫోలియోను మరింతగా విస్తరించే యోచనలో ఉంది. అలాగే విద్యుత్ త్రిచక్ర వాహనాన్ని కూడా రూపొందిస్తోంది. 5 నుంచి 25 కిలోవాట్ల శ్రేణిలో పలు వాహనాలను ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ డైరెక్టర్, సీఈవో కేఎన్ రాధాకృష్ణన్ తెలిపారు. మార్కెట్లో డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఐక్యూబ్ ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకు 25,000 యూనిట్లకు పెంచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీ పోర్ట్‌ఫోలియోలో రెండు ఈ-స్కూటర్లు ఉన్నాయి. కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ టీవీఎస్ ఎక్స్ విక్రయాలు ఈ క్వార్టర్‌లోనే ప్రారంభించనున్నట్లు రాధాకృష్ణన్ చెప్పారు. తమ ఈ-స్కూటర్స్ అమ్మకాల కోసం దాదాపు 400 టచ్‌పాయింట్స్ ఉన్నాయని, వీటి సంఖ్యను మరింతగా విస్తరిస్తున్నామని ఆయన వివరించారు.

సొంత ఫిన్‌టెక్ ఏర్పాటులో ఎల్‌ఐసీ

న్యూఢిల్లీ: బీమా రంగ దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) తాజాగా సొంత ఫిన్‌టెక్ విభాగాన్ని ఏర్పాటు చేసే యోచనలో ఉంది. ఇందుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను మదింపు చేస్తున్నట్లు సంస్థ చైర్మన్ సిద్ధార్థ మహంతి తెలిపారు. మరోవైపు, కార్యకలాపాల డిజిటలీకరణ కోసం ప్రాజెక్ట్ డైవ్ (డిజిటల్ ఇన్నోవేషన్, వేల్యూ ఎన్‌హాన్స్‌మెంట్)ను చేపట్టామని, దీనికి కన్సల్టెంట్‌ను నియమించుకున్నామని పేర్కొన్నారు. తొలి దశలో కస్టమర్లను సమకూర్చుకునే ప్రక్రియను డిజిటలైజ్ చేయనున్నట్లు వివరించారు. కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా కస్టమర్లు తమ ఇంటి దగ్గరే మొబైల్ ఫోన్‌తో అన్ని సర్వీసులను పొందగలిగేలా వివిధ ప్రక్రియలను సులభతరం చేస్తున్నట్లు మహంతి పేర్కొన్నారు.

కామన్ అకౌంట్ నంబర్ అంటే?

ఫండ్స్‌లో కామన్ అకౌంట్ నంబర్ (క్యాన్) అంటే ఏమిటి? ఇందులో అనుకూల, ప్రతికూలతలు ఏమున్నాయి? – దిలీప్

కామన్ అకౌంట్ నంబర్/క్యాన్ అనేది ఎంఎఫ్ యుటిలిటీస్ వద్ద రిజిస్టర్ చేసుకున్న వారికి ఇచ్చే ఏకీకృత ఖాతా. ఇది మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి అన్ని రకాల లావాదేవీలను నిర్వహించే ఏకీకృత వేదిక. 2015లో మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు అన్నీ కలసి దీన్ని ఏర్పాటు చేశాయి. ఇన్వెస్టర్లు, మ్యూచువల్ ఫండ్స్ పంపిణీదారులకు సౌకర్యం, సులభతర నిర్వహణ దీని ఏర్పాటు ఉద్దేశ్యంగా ఉంది. ఈ ప్లాట్‌ఫామ్ మ్యూచువల్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లలో పెట్టుబడికి వీలు కల్పిస్తుంది. ఒక ఇన్వెస్టర్ వేర్వేరు మ్యూచువల్ ఫండ్స్ సంస్థలకు చెందిన పథకాల్లో ఇన్వెస్ట్ చేసేట్టు అయితే, విడివిడిగా ఖాతాలు ప్రారంభించి, లావాదేవీలను నిర్వహించుకోవాలి. ఇందుకోసం ప్రతి ఏఎంసీ వద్ద విడిగా నమోదు చేసుకోవాలి. అయితే, క్యాన్‌ను కలిగి ఉండడం తప్పనిసరి కాదు. ఎంఎఫ్ యుటిలిటీ ద్వారానే ఇన్వెస్ట్ చేయాలన్న నిబంధన కూడా లేదు. ఇదొక వేదిక మాత్రమే. ఆ తర్వాత కాలంలో ఎన్నో ఫిన్‌టెక్ కంపెనీలు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా, బ్రోకర్ల ద్వారా సులభంగా ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లలో ఇన్వెస్ట్ చేసుకునే అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి.

నా వయసు 40 ఏళ్లు. వచ్చే ఏడాది పీపీఎఫ్ గడువు తీరి రూ.15 లక్షలు చేతికి వస్తాయి. ఎన్‌పీఎస్ తదితర అధిక వృద్ధికి అవకాశం ఉన్న సాధనాల్లోకి ఈ మొత్తాన్ని బదిలీ చేయాలని అనుకుంటున్నాను. పీపీఎఫ్ నుంచి నాకు అందే మొత్తం పన్ను మినహాయింపు కిందకు వస్తుందని తెలిసింది. కనుక ఈ మొత్తాన్ని క్రమానుగతంగా ఈక్విటీ ఫండ్స్‌లోకి మళ్లించేది ఎలా? – సుచిత్ పూతియా

పెట్టుబడుల మొత్తాన్ని ఈక్విటీ ఫండ్స్‌లోకి మళ్లించే సమయంలో మీరు కొన్ని అంశాలను గుర్తు పెట్టుకోవాలి. ఇందులో ముందుగా డ్యురేషన్ ఒకటి. మీరు ఆ మొత్తం సమకూర్చుకోవడానికి



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

పట్టిన కాలంలో సగం కాలాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఉదాహరణకు మీరు పీపీఎఫ్‌లో 15 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేశారు. దీంతో ఈ మొత్తం సమకూరింది. కనుక ఏడున్నరేళ్ల పాటు సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేయమని కాదు. గరిష్టంగా మూడేళ్లకు మించకుండా నెలవారీ వాయిదాల రూపంలో మీ వద్దనున్న మొత్తాన్ని ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీ పెట్టుబడిని సమకూర్చుకోవడానికి ఐదేళ్లు పట్టిందని అనుకుందాం. అందులో సగం అంటే రెండున్నరేళ్ల పాటు క్రమానుగతంగా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. మీ నూతన కాల వ్యవధి 15-20 ఏళ్లు అని అంటున్నారు. కనుక ఈక్విటీలకు ఎక్కువ కేటాయించుకోవాలి. ఎందుకంటే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణానికి మించి మెరుగైన రాబడులను ఈక్విటీలు ఇవ్వగలవు. ఎన్‌పీఎస్ పథకాన్ని ఎంపిక చేసుకుంటే అందులో ఈక్విటీల్లో 75% ఇన్వెస్ట్ చేసే యాక్టివ్ చాయిస్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. 60 ఏళ్లకు వచ్చిన తర్వాత అప్పటికి సమకూరిన మొత్తం నుంచి 60 శాతాన్నే ఉపసంహరించుకోవడానికి ఉంటుంది. మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాల్సి ఉంటుంది. రిటైర్మెంట్ వరకు నిధిని ముట్టుకోని వారు అయితే, ఫ్లెక్సీ క్యాప్‌ఫండ్స్‌లోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇవి అచ్చమైన ఈక్విటీ పథకాలు. ఉపసంహరణలపై ఎలాంటి ఆంక్షలు ఉండవు. ఎన్‌పీఎస్‌లో అయితే ఈక్విటీ పెట్టుబడుల్లో అధిక శాతం లార్జ్‌క్యాప్ స్టాక్స్‌కే కేటాయిస్తారు. కానీ, ఫ్లెక్సీక్యాప్ పథకాలు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ పథకాల్లోకి పెట్టుబడులను వైవిధ్యం చేస్తాయి. కనుక ఇవి కొంచెం మెరుగైన రాబడులు ఇస్తాయి. ఇప్పటి వరకు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసిన అనుభవం లేకపోతే, నూరు శాతం పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకునే విషయంలో ఆందోళన చెందుతుంటే, అప్పుడు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి ఈక్విటీల్లో 65% వరకే ఇన్వెస్ట్ చేస్తాయి. మిగిలిన 35 శాతాన్ని డెట్‌లో పెడుతాయి. దీనివల్ల ఈక్విటీల్లోని అస్థిరతలను కొంత వరకు తగ్గించుకోవడానికి వీలుంటుంది. ఈక్విటీలతో పోలిస్తే స్థిరమైన రాబడులు ఇస్తాయి.

ఐపీవో అధిక వేల్యుయేషన్స్‌పై సెబీ దృష్టి

ముంబై: పబ్లిక్ ఇష్యూలకు సంబంధించి భారీ ప్రీమియంలు, అధిక వేల్యుయేషన్ల అంశాన్ని పరిశీలించనున్నట్లు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. పెద్దగా తెలియని కంపెనీలు కూడా ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు ఫేస్ వేల్యూను తక్కువగా చూపించి, షేరును మాత్రం భారీ ప్రీమియం రేటుకు ఆఫర్ చేస్తున్న నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు పబ్లిక్ ఇష్యూల టైమింగ్‌ను మార్కెట్‌కి వదిలేయాలన్నదే సెబీ ఉద్దేశమని మాధవి చెప్పారు. పరిస్థితులు తమకు అనుకూలంగా ఉన్నప్పుడే కంపెనీలు ఇష్యూకి వస్తాయని, ఎప్పుడు రావాలనేది సెబీ నిర్దేశించడమనేది ఇటు ఇన్వెస్టర్లు, అటు సంస్థకు ప్రయోజనకరంగా ఉండబోదని ఆమె పేర్కొన్నారు. గత వారమే టాటా టెక్నాలజీస్ సహా అయిదు కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి వచ్చిన సంగతి తెలిసిందే.

స్టాక్స్ వ్యూ

టాటా మోటార్స్ | బీఎన్‌పీ పరిబాస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 674 టార్గెట్: రూ. 785

ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ పటిష్ట ఫలితాలు సాధించింది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు అంచనాలు మించాయి. దేశీ బిజినెస్‌లలో పుంజుకున్న మార్జిన్లు, ఇకపై మార్జిన్లు మరింత బలపడనున్నట్లు బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జేఎల్ఆర్ ప్రకటించిన అంచనాలు కంపెనీకి జోష్‌నిస్తున్నాయి. ప్యాసింజర్ వాహనాలు(పీవీ), ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీ), వాణిజ్య వాహనాల(సీవీ) అమ్మకాలపై ఆశావహ అంచనాలు ఇందుకు మద్దతిస్తున్నాయి. ఇటీవల జేఎల్ఆర్(జాగ్వార్, ల్యాండ్‌రోవర్) ఆర్డర్ బుక్ సాధారణ స్థితికి చేరుతుండటం, మార్కెటింగ్ వ్యయాలు భారీగా తగ్గుతుండటం వంటి అంశాలు డిమాండ్ వాతావరణం అనుకూలంగా ఉన్నట్లు వెల్లడిస్తున్నాయి.



క్యూ2(జులై-సెప్టెంబర్)లో జేఎల్ఆర్ ఆదాయం వార్షికంగా 30%జంప్‌చేసి 6.86 బ్రిటిష్ పౌండ్లను తాకింది. ఇబిటా మార్జిన్లు అంచనాల(16.9%)కంటే తక్కువగా 14.9 శాతంగా నమోదయ్యాయి. ఇందుకు మెటీరియల్ వ్యయాలు, నిల్వల లబ్ధి రివర్స్‌కావడం వంటి అంశాలు ప్రభావం చూపాయి. ప్రపంచ సీవీ అమ్మకాల(ఆదాయం) వార్షికంగా 22% ఎగసింది. త్రైమాసికవారీగా ఇబిటా మార్జిన్లు 0.82 శాతం మెరుగుపడి 11.5 శాతాన్ని తాకాయి. చిన్నవాణిజ్య వాహన విభాగంలో మార్కెట్ వాటాను పెంచుకోవడం ఇందుకు దోహదపడింది. పీవీ, ఈవీ విభాగంలో కొత్త ప్రొడక్టుల విడుదల ద్వారా ఈ ఏడాది ద్వితీయార్థం (అక్టోబర్-మార్చి)లోనూ మార్కెట్ వాటాను పెంచుకోగలమని కంపెనీ విశ్వసిస్తోంది.


కెనరా బ్యాంక్ | ఎల్‌కేపీ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 390 టార్గెట్: రూ. 506

ఎందుకంటే: ప్రభుత్వ రంగ దిగ్గజం కెనరా బ్యాంక్ గత 13 త్రైమాసికాలుగా నిలకడైన పనితీరును ప్రదర్శిస్తోంది. నికర లాభాల్లో వృద్ధిని సాధిస్తోంది. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికం(జులై-సెప్టెంబర్)లోనూ లాభదాయకత వార్షికంగా 42 శాతం జంప్‌చేసింది. ప్రొవిజనింగ్ వ్యయాలు తగ్గడం ఇందుకు సహకరించింది. మూడేళ్ల క్రితం(2019-20) చివరి త్రైమాసికం(జనవరి-మార్చి)లో రూ. 5,400 కోట్లమేర చేపట్టిన భారీ ప్రొవిజన్ కారణంగా నిర్వహణలో సవాళ్లు ఎదురైనా బ్యాలన్స్‌షీట్ పటిష్టస్థాయిలో కొనసాగుతోంది. ఇక రుణ నాణ్యత విషయంలో స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 0.39 శాతం మెరుగుపడి 4.76 శాతానికి చేరగా.. నికర ఎన్‌పీఏలు సైతం 0.16 శాతం తగ్గి 1.41 శాతానికి పరిమితమయ్యాయి. ఇందుకు నిలకడను చూపుతూ స్లిప్పేజీలు రూ. 2,900 కోట్లుగా నమోదుకావడం ప్రభావం చూపింది.



స్లిప్పేజీల నిష్పత్తి వార్షిక ప్రాతిపదికన స్వల్పంగా 1.37 శాతం తగ్గింది. ఇక బిజినెస్ విషయానికివస్తే.. నికర రుణ(క్రెడిట్) వృద్ధి వార్షికంగా 13.2 శాతం పుంజుకుంది. త్రైమాసికంగా 4.3 శాతం పురోగతి ఇది. అంచనాలకు అనుగుణంగా రికవరీలు నమోదైతే ఈ ఏడాది క్రెడిట్ వ్యయాలు 2 శాతానికంటే తక్కువకు చేరతాయి. త్రైమాసికవారీగా నికర వడ్డీ మార్జిన్లు నిలకడను చూపుతూ 3.02 శాతంగా నమోదయ్యాయి. మార్జిన్ల సక్రమ సర్దుబాటుతోపాటు బ్యాంక్ బ్యాలన్స్‌షీట్ బలపడుతోంది. ఇకపై లాభదాయకత క్రమంగా మెరుగుపడనుంది. వచ్చే ఏడాది(2024-25)కల్లా ఆర్‌వోఏ 1.1 శాతానికి, ఆర్‌వోఈ 17.2 శాతానికి చేరే వీలుంది.


నిర్మల్ కొయ్య బొమ్మలు | ఆదివాసీలు | నాగోబా దేవాలయం | ఆదిలాబాద్ అడవులు | బాసర సరస్వతి అమ్మవారు

ఆధిపత్యం ఎవరిది!?

- మూడు పార్టీల హోరాహోరీ పోరు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో స్థానిక అంశాలు, ఎమ్మెల్యేల పనితీరు కొలమానంగా ఎన్నికలు
- ప్రభావం చూపనున్న ఆదివాసీలు, మైనారిటీలు, సింగరేణి కార్మికులు
- మూడు స్థానాల్లో అభ్యర్థులను మార్చిన బీఆర్ఎస్
- బీఆర్ఎస్‌కు పోటీ ఇస్తున్న బీజేపీ, కాంగ్రెస్
- తూర్పున కాంగ్రెస్‌తో, పశ్చిమాన బీజేపీతో బీఆర్ఎస్ ఫైట్
- సిర్పూర్‌లో బీఆర్ఎస్, బీఎస్పీ, బీజేపీ త్రిముఖ పోటీ

ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి పోలంపల్లి ఆంజనేయులు

గ్రాండ్ రిపోర్ట్ ఉమ్మడి ఆదిలాబాద్

వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో స్థానిక అంశాలే ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషించబోతున్నాయి. ఆదివాసీలు, సింగరేణి కార్మికులు, రైతులు, కూలీలతో పాటు యువతరం ఈసారి అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చబోతున్నాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత జరిగిన రెండు సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ వెంట నిలిచిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పాగా వేసేందుకు కాంగ్రెస్ శక్తివంచన లేని కృషి చేస్తుండగా పట్టు సాధించేందుకు బీజేపీ సర్వశక్తులు ఒడ్డుతోంది. పది నియోజకవర్గాలున్న ఉమ్మడిజిల్లాలో ఆసిఫాబాద్, బోథ్, ఖానాపూర్ ఎస్టీలకు రిజర్వు కాగా, బెల్లంపల్లి, చెన్నూరు ఎస్సీల రిజర్వ్‌డ్ స్థానాలు. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, పేదలకు అందించిన సంక్షేమ పథకాలు, సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల కల్పన వంటి అంశాలను ప్రచారాస్త్రాలుగా బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, కాళేశ్వరం ప్రాజెక్టు కారణంగా ఉమ్మడి జిల్లాకు జరిగిన అన్యాయాన్ని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో అభ్యర్థులు ముందున్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వల్ల ముంపునకు గురవుతున్న భూముల సమస్యపై కాంగ్రెస్, బీజేపీ ఫోకస్ చేస్తున్నాయి. బీఎస్పీ తరఫున పోటీ చేస్తున్న ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ప్రధాన పక్షాలకు సవాల్ విసురుతున్నారు. అధికార బీఆర్ఎస్‌కు ఉమ్మడి జిల్లాలో తూర్పు ప్రాంతమైన మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ఆసిఫాబాద్‌లలో కాంగ్రెస్ బలమైన ప్రత్యర్థిగా ఉండగా, పశ్చిమాన ఆదిలాబాద్, బోథ్, ముథోల్, నిర్మల్‌లలో బీజేపీ గట్టి పోటీనిస్తోంది. ఖానాపూర్, సిర్పూర్‌లలో వివిధ పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది.

ఆదిలా'బాద్‌షా' ఎవరో?

బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ సీనియర్ ఎమ్మెల్యే జోగు రామన్న మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గత ఎన్నికల్లో జోగు రామన్నకు ప్రధాన ప్రత్యర్థిగా నిలిచిన బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ మరోసారి బరిలో నిలిచి సవాల్ విసురుతున్నారు. ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్ఆర్ఐ కంది శ్రీనివాస్‌రెడ్డి బరిలోకి దిగారు. ఆదిలాబాద్‌లో నెలకొన్న సామాజిక, రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి కూడా బీఆర్ఎస్, బీజేపీల మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. ఆదిలాబాద్‌లో జరిగిన అభివృద్ధి, పేదలకు అందిన సంక్షేమ పథకాలు, మైనారిటీ ఓటు బ్యాంకుతో మళ్లీ విజయం వరిస్తుందనే ఆశాభావంతో జోగు రామన్న ఉన్నారు. ప్రభుత్వంతో పాటు జోగు రామన్న పట్ల సహజంగా ఉండే అసంతృప్తి, పెరిగిన బీజేపీ బలం తనకు కలిసి వస్తుందని పాయల్ శంకర్ భావిస్తున్నారు. ప్రభుత్వంపై అసంతృప్తి నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి సైతం విజయంపై ధీమాతో ఉన్నారు.

బోథ్: ఆదివాసీలే కీలకం

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలై, బీజేపీలో చేరి ఆదిలాబాద్ ఎంపీగా గెలిచిన సోయం బాపూరావు మరోసారి బోథ్ నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2018లో కాంగ్రెస్ టికెట్ రాక ఇండిపెండెంట్‌గా పోటీ చేసి మూడోస్థానంలో నిలిచిన అనిల్ జాదవ్ ఈసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఆదివాసీల ప్రభావం అధికంగా ఉండే ఈ నియోజకవర్గం నుంచి ఆ వర్గం అభ్యర్థిగా ప్రధాన పార్టీల నుంచి సోయం బాపూరావు మాత్రమే బరిలో నిలిచారు. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్, కాంగ్రెస్ అభ్యర్థి ఆడె గజేందర్ ఇద్దరూ లంబాడీ వర్గానికి చెందిన వారే. బీఎస్పీ నుంచి మరో ఆదివాసి మెస్రం జంగుబాపు బరిలో ఉన్నప్పటికీ, ఆదివాసీల ప్రతినిధిగా సోయం బాపూరావునే ఆ వర్గీయులు భావిస్తుండడం ఆయనకు కలిసివచ్చే అంశం. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు సైతం బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావుకు మద్దతిస్తుండటం గమనార్హం.

ఆసిఫాబాద్: కలిసి రానున్న 'ఆదివాసీ' ఓటు

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు బీఆర్ఎస్‌లో చేరినప్పటికీ, ఈసారి ఆయనకు మళ్లీ పోటీ చేసే అవకాశం ఇవ్వలేదు. గత ఎన్నికల్లో ఓడిపోయిన కోవా లక్ష్మినే బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపిక చేసింది. ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖా నాయక్‌కు బీఆర్ఎస్ టికెట్ నిరాకరించడంతో ఆమె తన భర్త మాజీ ఆర్టీఏ అధికారి శ్యాం నాయక్‌తో పాటు కాంగ్రెస్ లో చేరారు. దీంతో శ్యాంనాయక్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించడంతో, అప్పటివరకు కాంగ్రెస్ టికెట్ ఆశించిన వారు బీఆర్ఎస్‌లో చేరారు. బీజేపీ అభ్యర్థిగా ఆత్మారాంనాయక్ బరిలో నిలిచినప్పటికీ, ప్రధాన పోటీ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే నెలకొంది. పోటీ పడుతున్న ముగ్గురు అభ్యర్థుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కోవా లక్ష్మి ఒక్కరే ఆదివాసీ కావడం, ఆదివాసీ ఓట్లు ఏకంగా 70 వేల ఓట్లు ఉండడం ఆమెకు కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు.

ఖానాపూర్: అభ్యర్థి మారినా 'రాత' మారుతుందా?

సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ అభ్యర్థిత్వాన్ని కాదని కేటీఆర్‌కు సన్నిహితుడిగా పేరున్న జాన్సన్‌నాయక్‌కు బీఆర్ఎస్ ఇక్కడ సీటిచ్చింది. బీజేపీ నుంచి మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ పోటీ పడుతుండగా, కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ఆదివాసీ ఉద్యమ నాయకుడు వెడ్మ బొజ్జును బరిలో నిలిపింది. ఈ నియోజకవర్గంలో ప్రధానంగా ఈ ముగ్గురి మధ్యనే త్రిముఖ పోటీ నెలకొంది. అయితే బీఆర్ఎస్, బీజేపీ తరఫున పోటీ పడుతున్న అభ్యర్థులు ఇద్దరు లంబాడీ వర్గానికి చెందిన వారు కావడం, కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జుకు కలిసి వచ్చే అంశం. ఆదివాసీ ఓట్లతో పాటు లంబాడీ వర్గం ఓట్లు భారీగానే ఉన్నప్పటికీ, లంబాడీ ఓట్ల చీలిక కాంగ్రెస్‌కు కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను మార్చడం బీఆర్ఎస్‌కు కలిసివచ్చే అంశంగా భావిస్తున్నప్పటికీ, జాన్సన్‌నాయక్‌ను లంబాడీలు ఆదరించడంపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది.

సిర్పూరు: 'ఏనుగు' మళ్లీ ఎగురుతుందా?


కోనప్ప


ప్రవీణ్‌కుమార్


రావి శ్రీనివాస్

2004లో కాంగ్రెస్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన కోనేరు కోనప్ప 2014లో బీఎస్పీ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనే 2018లో టీఆర్ఎస్ తరఫున పోటీ చేసి మరోసారి విజయం సాధించారు. ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలవగా, ఆయనకు చెక్ పెట్టేందుకు ఈసారి మూడు పార్టీలు తమ ప్రయత్నాలు చేస్తున్నాయి. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ 'ఏనుగు' గుర్తుపై పోటీలో నిలిచి రాష్ట్ర స్థాయిలో అందరినీ ఆకర్షిస్తున్నారు. గతంలో కోనప్ప గెలిచిన బీఎస్పీ తరఫునే పోటీ చేసి ఆయనను ఓడించాలనే ధ్యేయంతో అటవీ, మైదాన ప్రాంతాల్లో కలియతిరుగుతున్నారు. సిర్పూరులో ఎస్సీ, బుద్ధిస్ట్ ఓట్లు భారీగా ఉండడం, మైనారిటీలతో పాటు గిరిజన వర్గాల ఓట్లు కూడా చీలి తనకు కలిసి వస్తుందని ప్రవీణ్‌కుమార్ భావిస్తున్నారు. గత ఎన్నికల్లో కోనప్పపై కాంగ్రెస్ తరఫున పోటీ చేసి రెండోస్థానంలో నిలిచిన పాల్వాయి హరీశ్‌బాబు ఈసారి బీజేపీ పక్షాన పోరాడుతున్నారు. కాంగ్రెస్ నుంచి రావి శ్రీనివాస్ బరిలో నిలిచారు. ప్రధాన పోటీ బీఆర్ఎస్, బీఎస్పీ, బీజేపీ మధ్యనే నెలకొంది.

నిర్మల్: కారు, కమలం మధ్యన పోటీ..


ఇంద్రకరణ్‌రెడ్డి


మహేశ్వర్‌రెడ్డి


శ్రీహరి

సీనియర్ నేత, మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నిర్మల్‌లో ఈసారి రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేపీలో చేరి ఆపార్టీ అభ్యర్థిగా పోటీ ఇస్తున్నారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు కూచాడి శ్రీహరి రావు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానాన్ని బీజేపీ గెలుచుకున్న ప్రభావం, భైంసా, నిర్మల్‌లలో జరిగిన మతఘర్షణల నేపథ్యంలో మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ఇక్కడ బీజేపీ బలం పెరిగిందని అంటున్నారు. కాగా మైనారిటీ ఓట్లు, మున్నూరు కాపు ఓట్లతో ప్రభుత్వ పథకాల లబ్ధిదారులపై అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి ఆశలు పెట్టుకున్నారు.

కేసీఆర్ వల్లనే సింగరేణి వారసత్వ ఉద్యోగం..



సింగరేణిలో ఇక రావు అనుకున్న డిపెండెంట్ ఉద్యోగాలను కేసీఆర్ ఇప్పించారు. టీడీపీ హయాంలో రద్దయిన ఈ ఉద్యోగాలను ఏ ప్రభుత్వం మళ్లీ ఇవ్వదనుకున్నాం. నేను ఎంఏ, బీఈడీ చదివాను. వారసత్వ ఉద్యోగాల్లో అల్లుళ్లకు కూడా ఉద్యోగాలివ్వడంతో మా మామ ఉద్యోగం నాకు వచ్చింది. సింగరేణి పరంగా బీఆర్ఎస్ హయాంలో కార్మికులకు అనేక హక్కులతో పాటు సదుపాయాలు కూడా వచ్చాయి. గతంలో క్వార్టర్లలో ఉంటే బేసిక్ జీతంపై ఒక శాతం విద్యుత్‌చార్జీలు వసూలు చేసేవారు. ఇప్పుడు దాన్ని తీసేశారు. ఏసీ కూడా పెట్టుకుంటున్నాం. మా తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం కూడా అందిస్తున్నారు.

– దుర్గం రవికుమార్, జనరల్ మజ్దూర్, ఆర్కే 5 గని

వీధి వ్యాపారిగా మారిన..



రెక్కల కష్టం తప్ప మాకు ఏ ఆధారం లేదు. నా భర్త నృత్య కళాకారుడు. వందలాదిమంది కళాకారులను తయారు చేశారు. ఆయనకు కళాకారుల ఉద్యోగం ఈ సర్కారులో రాలేదు. బీసీబంధు పథకం మాకు ఇయ్యలేదు. పేదలకు మేలు చేస్తున్నామని సర్కారు చెప్పుకునుడే తప్ప అమల్లో లేదు. ఏ ఒక్క ప్రభుత్వ పథకం మంజూ రు కాని మేము అనేక కష్టనష్టాలు పడుతున్నాం. చివరికి వీధి వ్యాపారిగా మారాల్సి వచ్చింది.

– హనుమాన్ల సువర్ణ, చిరు వీధి వ్యాపారి, బెల్లంపల్లి

కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో అపార నష్టం..



నాకు మూడున్నర ఎకరాల సాగు భూమి ఉంది. పత్తి సాగు చేశాను. కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో గత నాలుగేళ్లుగా పంట మునిగిపోతోంది. తీవ్రంగా నష్టపోయిన. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి పరిహారం రాలేదు. మాకోసం ఆలోచించే వారినే మేం గెలిపించుకుంటాం.

–సుంకరి మల్లయ్య, రైతు, కోటపల్లి (చెన్నూరు)

డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వలేదు



బీఆర్ఎస్ పార్టీ ఎన్నో మాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది. ఏవేవో పథకాలన్నారు. ఎన్ని పథకాలు పెట్టినా పేదలకు మాత్రం ఎలాంటి ఫాయిదా లేదు. నాకు ఇల్లు లేదు. డబుల్ బెడ్ రూమ్ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న. ఎంతో ఆశతో ఎదురు చూసినా మంజూరు చేయలేదు. పదేళ్లు బీఆర్ఎస్‌ను చూసాం. పేదోళ్లకు ఏం మేలు జరగలేదు. ఈసారి కాంగ్రెస్ కు అవకాశం ఇచ్చి చూస్తాం.

– సయ్యద్ ఖాజాపాషా, పంక్చర్ కొట్టు నిర్వాహకుడు, బెల్లంపల్లి

ముథోల్: ఇక్కడా బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే..

రాష్ట్రంలో సున్నిత ప్రాంతంగా పేరున్న భైంసా ప్రధాన కేంద్రంగా ఉన్న ముథోల్ నియోజకవర్గంలో అధికార పార్టీకి బీజేపీ ప్రధాన ప్రత్యర్థిగా ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గెడ్డన్నగారి విఠల్‌రెడ్డికి బీజేపీ అభ్యర్థి, గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పవార్ రామారావు పటేల్ గట్టి పోటీ ఇస్తున్నారు. గ్రామీణ ఓటర్లతో పాటు ముస్లిం మైనారిటీ ఓట్లతో విజయం తనదేనని సిట్టింగ్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ధీమాతో ఉన్నారు. భైంసాలోని ముస్లిం మైనారిటీల ఓట్లతో బీఆర్ఎస్ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తుండగా, భైంసాలో నెలకొన్న పరిస్థితుల వల్లనే హిందూ ఓట్లన్నీ ఈసారి గంపగుత్తగా బీజేపీకే పడతాయని ఆపార్టీ భావిస్తుంది. గత ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాని కాంగ్రెస్ పార్టీ ఈసారి కూడా పెద్దగా ప్రభావం చూపే అవకాశం కనిపించడం లేదు.

మంచిర్యాల: బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ

నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నడిపెల్లి దివాకర్‌రావు ఐదో విజయం కోసం బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ పడుతున్నారు. గత ఎన్నికల్లో 4,877 ఓట్ల తేడాతో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఈసారి కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరోసారి తనను గట్టెక్కిస్తాయనే నమ్మకంతో దివాకర్ రావు ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు పార్టీ అభ్యర్థిపై ప్రజల్లో నెల కొన్న అసంతృప్తి తనను ఈసారి విజయ తీరాలకు చేరుస్తుందని ప్రేంసాగర్ రావు ఆశాభావంతో ఉన్నారు. గత ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్ మరోసారి బరిలో నిలవగా, ఆయనకు వచ్చే ఓట్లు ఎవరికి నష్టం చేకూరుస్తుందనేది ప్రశ్నార్థకం. ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న ముగ్గురిది వెలమ సామాజికవర్గమే.

బెల్లంపల్లి: గెలుపుపై రెండు పార్టీల్లోనూ ధీమా..

సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పట్ల నెలకొన్న వ్యతిరేకత, బీఆర్ఎస్ మండల స్థాయి నాయకుల వ్యవహారశైలి... కాంగ్రెస్ అభ్యర్థి, గత ఎన్నికల్లో తక్కువ ఓట్ల తేడాతో ఓడిన మాజీ మంత్రి గడ్డం వినోద్‌పై ఉన్న సానుభూతి బెల్లంపల్లిలో కాంగ్రెస్‌కు కలిసివచ్చే అంశం. అయితే ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, బీఆర్ఎస్ శ్రేణులు తనను గట్టెక్కిస్తారనే ధీమాతో చిన్నయ్య ఉన్నారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి బరిలో ఉన్నప్పటికీ పోటీ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే నెలకొంది.

చెన్నూరు: నువ్వా నేనా..?


బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్ విజయం నల్లేరు మీద నడక అనుకుంటున్న సమయంలో కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ గడ్డం వివేకానంద రావడం రాజకీయ పరిస్థితులను ఒక్కసారిగా మార్చేసింది. చెన్నూరులో రూ. వందల కోట్లతో చేసిన అభివృద్ధి, సింగరేణి వారసత్వ ఉద్యోగాలు, సంక్షేమ పథకాలను చూసి ఓటేయాలని సుమన్ కోరుతున్నారు. వివేక్ రాకతో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు సుమన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. వివేక్ చెన్నూరులో విజయం కోసం కోట్లు వెచ్చిస్తున్నారని, నాయకులను కొంటున్నారని ఎమ్మెల్యే సుమన్ ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన ఈడీ రైడ్స్ చెన్నూరులో రాజకీయాలను మరింత రక్తి కట్టిస్తున్నాయి. దీంతో ఈ నియోజకవర్గంలో ఇద్దరి మధ్య తీవ్రమైన పోటీనెలకొంది. విజయం కోసం ఇద్దరూ శ్రమిస్తున్నారు.

రిస్క్ వద్దు !

ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని కూడా నెరవేర్చాం

- మంచినీరు, కరెంటు వస్తేనే కారుకు ఓటేయండి
- కర్ణాటకలో కాంగ్రెస్ జనాన్ని మోసం చేసింది
- కేసీఆర్ ఫామ్‌హౌస్ సీఎం కాదు... ఫామింగ్ సీఎం
- మేం 12 సార్లు రైతుబంధు ఇచ్చాం. కాంగ్రెస్ వస్తే 12 మంది ముఖ్యమంత్రులు
- ప్రభుత్వ పథకాలపై కాంగ్రెస్ దుష్ప్రచారం తిప్పికొడుతున్నాం
- కాళేశ్వరంతో రాష్ట్రం సస్యశ్యామలం

సాక్షి, హైదరాబాద్


సాక్షి SAKSHI TV లైవ్ షోలో మంత్రి టి.హరీశ్‌రావు

'తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. తెలంగాణను ఎన్నో రెట్లు అభివృద్ధి చేసుకున్నాం. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇంటింటికీ నీళ్లిచ్చాం. 24 గంటల కరెంటు ఇచ్చాం. 69 లక్షల మంది రైతులకు రైతుబంధు, 47లక్షల మందికి ఆసరా పింఛన్లు, 1.10 లక్షల మందికి రైతుబీమా, 13.50 లక్షల మందికి కల్యాణలక్ష్మి లబ్ధి చేకూర్చాం. వెయ్యి రెసిడెన్షియల్ పాఠశాలలు తీసుకొచ్చాం. అక్షరాస్యత 15 నుంచి 20 శాతం పెరిగింది. ఇవన్నీ కొనసాగాలంటే మళ్లీ కేసీఆర్ సీఎంగా ఉండాల్సిన అనివార్యత ఉంది. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు విని రిస్క్ తీసుకోవద్దని చెబుతున్నాం' అని బీఆర్ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వివరించారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సాక్షిటీవీ లైవ్‌షోలో ఆయన పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

కర్ణాటక వైఫల్యాల ప్రచారం ఆత్మరక్షణకు కాదు

కర్ణాటక ఇచ్చే ప్రకటనలన్నీ అబద్ధం. యువశక్తి అని యాడ్ ఇచ్చారు. అక్కడ ఉద్యోగాలు ఇచ్చారా? మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. బస్సులు కూడా లేకుండా చేశారు. 10 కిలోల ఉచిత బియ్యం అని 5 కిలోలు ఇస్తున్నారు. కర్ణాటకలో జరుగుతున్న విషయాలను చెపుతున్నాం. కర్ణాటక మోడల్ అంటే 3 గంటల కరెంటు, రైతుబంధు తొలగింపు, నోటిఫికేషన్లు ఇవ్వకపోవడమా? కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఇక్కడ కర్ణాటక ప్రకటనలు ఇవ్వటం ఎందుకు.



కాంగ్రెస్ మాటలు నమ్మి ఆగం కావొద్దు

బీఆర్ఎస్ ప్రజల పార్టీ. బీజేపీ కార్పొరేట్ పార్టీ. ఇక కాంగ్రెస్ దొంగ హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తుంది. ఐదు గ్యారంటీల పేరుతో కర్ణాటకలో జనాన్ని మోసం చేసింది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా అక్కడ ఎన్నికల హామీలు అమలు చేయటం లేదు. ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు అన్నారు. ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. నోటిఫికేషన్లు లేవు. కర్ణాటకలో 5 గ్యారంటీలు ఏమోగానీ ఉన్న గ్యారంటీలు పోయాయి. గతంలో బీజేపీ ప్రభుత్వం అక్కడ అమలు చేసిన రైతుబంధు, యువశక్తి, 9 గంటల కరెంటును తొలగించింది. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లో 80 శాతం కోత విధించింది. నిరుద్యోగ భృతి కూడా ఇవ్వటం లేదు. కానీ ఇక్కడ కేసీఆర్ 24 గంటల కరెంట్, రైతుబంధుతో వ్యవసాయం పండగ చేశారు. రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంట్, కర్ణాటక డిప్యూటీ సీఎం 5 గంటల కరెంట్ చాలు అంటున్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే 3 గంటల కరెంట్, 5 గంటల కరెంట్ ఒప్పుకున్నట్టే. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇవన్నీ రద్దు అవుతాయి. ప్రజలు ఆలోచించాలి.

కరెంటు, నీళ్లు వచ్చి నోళ్లంత కారుకు ఓటేయాలి

24 గంటల కరెంట్, మిషన్ భగీరథతో ఇంటింటికీ నీరు గురించి కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది. పూర్తిస్థాయిలో కరెంట్, ఇంటింటికీ నీళ్లు వచ్చినోళ్లంతా కారుకు ఓటేయండి... రాని వారు కాంగ్రెస్‌కు ఓటేయండి. సాఫీగా తెలంగాణపాలన సాగుతోంది. అనేకరంగాల్లో మార్గదర్శకంగా తెలంగాణను దేశంలో నంబర్ 1 స్థానంలో ఉంచారు. కేసీఆర్‌కు వాగు వంక, చెట్టు పుట్ట అన్ని తెలుసు. ప్రతిపక్ష నాయకులకు ఏది తెలియదు.

వాస్తవాలు చెబుతున్నాం

కాంగ్రెస్ ప్రకటనలకో, ప్రచారానికో మేం భయపడడం లేదు. 6 గ్యారంటీల పేరుతో జనాన్ని మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం ఏమవుతుందో విడమర్చి చెబుతున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 12 మంది ముఖ్యమంత్రులు కావడం ఖాయం.

కేసీఆర్ ఫోకస్ రైతులే

ఎక్కడా లేని విధంగా రైతుబంధును రాష్ట్రంలో అమలు చేస్తే కేంద్ర ప్రభుత్వం దానిని పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పేరుతో అమలు చేస్తోంది. అధికారంలోకి వస్తే రైతుబంధు కింద కాంగ్రెస్ పార్టీ రూ.15 వేలు ఇస్తామని చెప్తోంది. కానీ మేము రూ.16 వేలు ఇస్తామని చెప్తున్నాం. గతంలో కరెంట్ కష్టాలు ఉండేవి. ఇప్పుడు 24 గంటల కరెంటు వస్తుంది. కరెంటు కావాలా? కాంగ్రెస్ కావాలా అని అందుకే అంటున్నాం. కేసీఆర్ రైతుబిడ్డ. ఆయన ఫోకస్ అంతా రైతులే.

ప్రజల్లో అపనమ్మకం సృష్టించే ప్రయత్నం

ధరణితోపాటు ప్రభుత్వ పథకాలన్నీ భేష్ అని ప్రజలే చెబుతున్నారు. మా బలం ఏందో ప్రతిపక్షాలకు తెలుసు. మా బలం మీద విమర్శ చేస్తేనే, దుష్ప్రచారం చేస్తేనే జనం నమ్ముతారు అని వారి ఆలోచన. ప్రజల్లో అపనమ్మకం సృష్టించి జనాన్ని ఇబ్బందులు పెట్టాలని కాంగ్రెస్ చూస్తోంది.

ఇంకా ఆయన ఏమన్నారంటే...

- బీఆర్ఎస్ సభలకు ఎక్కడ చూసినా ఇసుక వేస్తే రాలనంత జనం వస్తున్నారు. కానీ రాహుల్, ప్రియాంక సభలు జనం లేక వెలవెలబోతున్నాయి. ఖాళీ కుర్చీలకు ఉపన్యాసం ఇస్తున్నారు.
- కాంగ్రెస్‌నేతలు కుటుంబపాలన అనడం విడ్డూరం. ఇందిర, రాజీవ్, సోనియా, రాహుల్‌గాంధీ వీరంతా ఎవరు? మేము ప్రజాక్షేత్రం నుంచి వచ్చిన వాళ్లం. మాది కుటుంబ పార్టీ ఎలా అవుతుంది.
- ఉస్మానియా యూనివర్సిటీ వెళ్లడానికి భయపడేది మేము కాదు రేవంత్‌రెడ్డి భయపడుతున్నారు. విద్యార్థులను బీర్లు, బిర్యానీ ఇస్తే ఏమైనా చేస్తారు అని అన్నాడు.
- పేపర్ లీకేజీలు ఇతర రాష్ట్రాల్లో జరగటం లేదా? జరిగిన తప్పును మేమే గుర్తించి సీఐడీ విచారణకు ఇచ్చాం. అత్యంత పారదర్శకంగా ఉద్యోగాలు భర్తీ చేస్తాం
- మేము ఎవరికి బీ టీమ్ కాదు. కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్‌కు భయపడుతూ ఒకరిపైఒకరు చెప్పుకుంటూ మా మీద ఆరోపణ చేస్తున్నాయి.
- బీఆర్ఎస్ వీక్ అని వచ్చినవన్నీ ఫేక్ సర్వేలు.. పేపర్ల మీద సర్వేలు చేస్తే ఎలా?
- కొంతమంది ఎమ్మెల్యేలపై వ్యతిరేకతనే కాదు. పాజిటివ్ కూడా ఉండొచ్చు కదా. సంక్షేమ పథకాల లబ్ధి ఎమ్మెల్యేల ద్వారానే వెళ్తుంది కదా. 80 సీట్లతో మేమే అధికారంలోకి వస్తాం
- కేటీఆర్‌ను సీఎంను చేయాలని పార్టీ అనుకుంటే చేస్తుంది. మాకు కేసీఆరే సీఎం కావాలని అనుకుంటున్నాం.

సాక్షి

ఇంటింటి ప్రచారం అంతంతే..!

పలకరించింది పావు వంతు మందినే..!

ప్రత్యక్షంగా కలవలేని ఓటర్లు మూడొంతులు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరుకుంది. దాదాపు నెలరోజులుగా అభ్యర్థులు, వారి తరపు నేతలు ముమ్మరంగా చేస్తున్న ప్రచారం కొద్ది రోజుల్లో ముగిసిపోనుంది. అభ్యర్థిత్వాలు అధికారికంగా ఖరారు కాకముందు నుంచే కొందరు, ఖరారయ్యాక కొందరు, బీఫామ్‌లు అందిన తర్వాత మరికొందరు... ఇలా నెల రోజుల నుంచి ప్రచారాలు చేస్తూనే ఉన్నారు. తెల్లవారుజామునే నిద్ర లేచి, హడావుడిగా రెడీ అయి ఫాస్ట్‌గా బ్రేక్‌ఫాస్ట్ చేసి, రోడ్డున పడ్డారంటే అర్ధరాత్రి వరకు ప్రచారంలో మునిగితేలి నీరసించి ఇళ్లు చేరుతూ వస్తున్నారు. ఇంత హడావుడి ప్రచారం చేసినా.. వారి నియోజకవర్గ పరిధిలో ప్రత్యక్షంగా ఓటర్లను ప్రభావితం చేసేది 20 శాతం లోపే కావటం విశేషం.


గతంలో ఇంటింటికీ తిరిగి...

రెండు దశాబ్దాల క్రితం వరకు ఎన్నికలంటే ఇంటింటి ప్రచారం ఉండేది. గ్రామీణ నియోజకవర్గాల్లో అభ్యర్థులు వారి నియోజకవర్గ పరిధిలోని ఒక్కో గ్రామానికి చేరుకుని డప్పు వాయిద్యాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించేవారు. ఓటర్లతో కరచాలనం చేసి మరీ ఓట్లు అభ్యర్థించే వారు. పెద్ద ఊళ్లలోని సెంటర్లలో కాసేపు ప్రసంగించే వారు. పట్టణ ప్రాంతాల్లో ఓపెన్ టాప్ జీపు ఎక్కి ఓట్లు అభ్యర్థిస్తూ ముందుకు సాగేవారు.

కానీ, ఇప్పుడు సీన్ మారిపోయింది. కొత్త కాలనీలు భారీగా పెరిగి పట్టణాలు విపరీతంగా విస్తరించాయి. ఊరంతా ఒకే పేరుతో ఉండే పెద్ద గ్రామాలు నాలుగైదు ఏరియా పేర్లతో విస్తరించాయి. డజను కులోపు ఇళ్లు మాత్రమే ఉండే అనుబంధ గ్రామాలు గ్రామ పంచాయతీలుగా మారిపోయాయి. వెరసి.. నేతలకు ఇంటింటి ప్రచారం కష్టంగా మారింది. దీంతో ప్రధాన వీధుల వెంట తిరుగుతూ వెళ్లటం మినహా ఇంటింటి ప్రచారానికి దూరమయ్యారు. మరో నాలుగు రోజుల్లో ప్రచార సమయం ముగుస్తున్నా.. కొందరు అభ్యర్థులు ఇప్పటికీ కొన్ని ఊళ్ల వైపే చూడకపోవటం విడ్డూరం. వారి తరపున కొందరు నేతలు వచ్చినా అభ్యర్థులు మాత్రం రాలేదు. అయితే ఈ నాలుగు రోజుల్లో వాటిని కవర్ చేసే హడావుడిలో ఉన్నారు.

పరోక్షంగానే ప్రచారం...

ప్రధాన రోడ్లమీదుగా వెళ్తూ, కూడళ్లలో ప్రసంగించటం ద్వారా ఆ ఊరి ప్రచారం ముగిసిందనిపిస్తున్నారు. వెరసి.. వారు ప్రత్యక్షంగా 20 శాతం జనాలని మాత్రమే కలిసినట్టుగా అవుతోంది.



నగరంలో మరీ తక్కువ..

హైదరాబాద్‌తో పాటు, శివారు ప్రాంతాల్లో అభ్యర్థులు ఓటర్లను ప్రత్యక్షంగా కలుస్తోంది ఐదు శాతానికి మించదన్నది విశ్లేషకుల మాట. కాలనీలు, బస్తీలు విపరీతంగా విస్తరిస్తూ పోతుండటంతో గడువులోగా ఆయా ప్రాంతాలన్నింటినీ చుట్టిరావటం అభ్యర్థులకు సాధ్యం కావటం లేదు. చాలా ప్రాంతాల్లో ప్రచార వాహనాలు మాత్రమే వెళ్తున్నాయి.

చివరి ప్రయత్నంగా...

ప్రచారం ముగిసిన తర్వాత చివరి రెండు రోజులు ప్రలోభాలు, ఎరలకు తెరలేపడం సహజం. పెద్ద సంఖ్యలో నేతలు అన్ని గ్రామాలను వేగంగా చుట్టేస్తారు. డబ్బు, వస్తువుల పంపిణీ ద్వారా ఇంటింటిని 'పలకరించే' ప్రయత్నం చేస్తారు. సరిగా ప్రచారం చేయలేని వారు, ఓట్ల వేటలో వెనకబడ్డవారిలో ఎక్కువ మంది ఈ 'చివరి ప్రయత్నాన్ని' నమ్ముకున్నారు.



ఎంతవరకు రీచ్ అయ్యాం.. ఇంకా ఏం చేయాలి?



నిమిషం కూడా వృథా కాకుండా చూడాలి

ప్రచార సరళిపై పార్టీల్లో ప్రారంభమైన పోస్టుమార్టం

సాక్షి, హైదరాబాద్: ప్రచార గడువు దగ్గర పడుతున్నా కొద్దీ ప్రధాన రాజకీయపార్టీలు అసలు తాము ఎంతవరకు ఓటర్లకు రీచ్ అయ్యామో అని విశ్లేషించుకుంటున్నాయి. ఇప్పటివరకు సాగిన ప్రచార సరళిపై పోస్టుమార్టం చేసుకుంటున్నాయి. మిగిలిన రోజుల్లో నిమిషం కూడా వృథా కాకుండా ప్రచారాన్ని ఎడతెరపి లేకుండా సాగించాలని భావిస్తున్నాయి.ఎన్ని గ్రామాలు, పట్టణాలను కవర్ చేశామో లెక్కలు వేసుకుంటున్నాయి. ఇప్పటివరకు సాగిన ప్రచారాన్ని బట్టి ఎన్ని ఓట్లు రాబట్టుకోగలమో కూడికలు, తీసివేతలు వేసుకుంటూ పకడ్బందీ వ్యూహంతో ముందుకెళుతున్నాయి. ఇప్పటివరకు చేసింది ఒక ఎత్తు.. ఇప్పటి నుంచి చేయాల్సింది మరో ఎత్తు అన్నట్టు పోస్టుమార్టం పనిలో నిమగ్నమయ్యాయి.

ఇక ప్రతి నిమిషమూ పరీక్షే

ఎన్నికల ప్రచారమంటే అంత సులువేమీ కాదు. కేడర్, నాయకులను సమన్వయం చేసుకుంటూ సమయ పాలన చూసుకుంటూ ముందుకెళ్లాల్సి ఉంటుంది. నియోజకవర్గంలోని గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల వారీగా టైంటేబుళ్లు తయారు చేసుకుని క్రమం తప్పకుండా ప్రతిరోజూ వాటిని కవర్ చేయాల్సి ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రతి నిమిషమూ పరీక్ష లాంటిదే. అలాంటి పరీక్షలో పాసుమార్కులు వచ్చాయా? ఫస్ట్ క్లాస్‌గా ప్రచారం నిర్వహిస్తున్నామా? డిస్టింక్షన్‌తో దూసుకెళుతున్నామా? అంటూ ఎప్పటికప్పుడు సమీక్ష లేకుంటే ఎన్నికల ప్రచారానికి దారీ తెన్నూ లేనట్టే. ఈ నేపథ్యంలో చివరి రోజుల కోసం ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల పక్షాన పరిశీలకులు, ఇన్‌చార్జులు, సమన్వయకర్తలుగా వచ్చిన వారంతా.. ఇంకా మిగిలిన ఈ సమయంలో ఏం చేయాలన్న దానిపై పక్కా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు. బహిరంగ సభలు, రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు, ఆత్మీయ సమ్మేళనాలు, సమావేశాలు, ప్రెస్‌మీట్లు, మీట్ ది ప్రెస్‌లు, టీవీల్లో డిబేట్లు... ఇలా పలు రూపాల్లో ప్రచార ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

మొదలైన ప్రలోభాల పర్వం!



ఓటుకు రూ.2-3 వేలు పంచుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు?

తీవ్ర పోటీ ఉన్న స్థానాల్లో రూ. 5 వేల చొప్పున ఇచ్చేందుకూ రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల పోలింగ్ రోజులు దగ్గర పడుతున్న కొద్దీ ప్రధాన రాజకీయ పార్టీలు ప్రలోభాల పర్వానికి తెర లేపాయి. డబ్బు, మద్యం, చీరలు, గృహోపకరణాలు, ఇతర కానుకలతో ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పార్టీల బలాబలాలనుబట్టి ఒక్కో ఓటరుకు రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు పంచుతున్నట్టు చర్చ జరుగుతోంది. హోరాహోరీ పోరు నెలకొన్న నియోజకవర్గాల్లో ఓటుకు రూ. 5 వేల చొప్పున సైతం పంపిణీ చేసేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ వర్గీయులైన కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్లు, వ్యాపారులు, రేషన్ డీలర్ల ద్వారా డబ్బు పంపిణీకి ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. పోలింగ్‌కు 2, 3 రోజుల ముందు భారీ ఎత్తున మద్యం పంపిణీ చేసేందుకు ఇప్పటికే ప్రధాన పార్టీలు ఏర్పాట్లు పూర్తిచేసుకున్నట్లు తెలుస్తోంది.

85 శాతం ఓటర్లు లక్ష్యంగా తాయిలాలు..

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల పరిధిలో మొత్తం 3.26 కోట్ల ఓటర్లుండగా ఒక్కో నియోజకవర్గంలో సగటున 2.74 లక్షల ఓటర్లున్నారు. ఈసారి ఎన్నికల్లో గట్టి పోటీ నెలకొనడంతో పోలింగ్‌కు ముందు రోజు రాత్రి నాటికి కనీసం 85 శాతం ఓటర్లకు డబ్బు పంచాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ లెక్కన ఒక్కో నియోజకవర్గ పరిధిలో ప్రధాన పార్టీలు రూ. 50 కోట్ల నుంచి రూ. 70 కోట్ల వరకు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేసుకుందని జోరుగా చర్చ జరుగుతోంది. అయితే హుజూరాబాద్, మునుగోడు ఉపఎన్నికల్లో ఓటుకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు పార్టీలు పంచినట్లు ఆరోపణలు రావడంతో ప్రస్తుతం ఓటుకు రూ. 500 ఇచ్చినా ఓటర్లు తీసుకొనే పరిస్థితి లేదని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఊరికి రండి.. ప్లీజ్

ఓటర్ల జాబితాలో పేరుండి ఇతర నగరాలకు వలస వెళ్లిన ఓటర్లకు ప్రధాన పార్టీలు గ్రామ స్థాయి నేతల ద్వారా ఫోన్లు చేయించి పోలింగ్ రోజు ఊరికి రావాల్సిందిగా కోరుతున్నాయి. ఊరికి వచ్చి తిరిగి వెళ్లేందుకయ్యే రవాణా ఖర్చులను సైతం ఓటర్లకు ఆన్‌లైన్ ద్వారా పంపిస్తున్నాయి. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో హైదరాబాద్‌లో ఉంటున్న వలస ఓటర్లతో కొందరు అభ్యర్థులు సమావేశాలు, విందు పార్టీలను ఏర్పాటు చేస్తున్నారు.

నచ్చిన ఫుడ్డు.. మెచ్చిన మందు



బిర్యానీలకు క్రేజ్.. లిక్కర్ బిజినెస్ పీక్

ట్రావెల్ వాహనాలకూ డిమాండ్

ఫంక్షన్ హాళ్లు, కాన్ఫరెన్స్ హాళ్లు కిటకిట

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల పండుగ వేళ వ్యాపారాలు కళకళలాడుతున్నాయి. అభ్యర్థుల ప్రచారం సందర్భంగా మద్యం ఏరులై పారుతుంటే, బిర్యానీ వాసన గుప్పుమంటోంది. బార్లు, హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. రెస్టారెంట్లు, దాబాలు, టిఫిన్ సెంటర్లు ఇప్పుడు వివిధ పార్టీల కార్యకర్తలతో నిండిపోతున్నాయి. ప్రచారానికి వచ్చే వారికి, జెండాలు మోసే వారికి అభ్యర్థులు రోజువారీ డబ్బులతో పాటు మందు బాటిల్, బిర్యానీ ప్యాకెట్ ఇచ్చి పంపిస్తున్నారు. దాంతో రాత్రివేళ ప్రచారం ముగిసిన వెంటనే మందు, విందులతో తూగే వారే ఎక్కువ కనిపిస్తున్నారు. ఎన్నికల తేదీ దగ్గర పడుతుండటంతో ఒకవైపు డబ్బుల పంపకం జరుగుతుండగా, మద్యం గిరాకీ పెరిగింది. 28వ తేదీవరకు ఇదే హడావుడి ఉండనుంది.


30 శాతం అదనంగా వ్యాపారం

ఎన్నికల వేళ వివిధ రకాల వ్యాపారాలకు గిరాకీ అమాంతం పెరిగింది. ట్రావెల్స్ సంస్థలు, ఫంక్షన్ హాళ్లు ఒకటేమిటి పండ్లు, పూల వ్యాపారులు, ఇంధనం వ్యాపారానికి సైతం గిరాకీ అమాంతం రెట్టింపైంది. అనేక హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, బార్ షాపులు, ట్రావెల్స్ సంస్థలకు సాధారణ రోజుల కంటే దాదాపు 30 శాతం అదనంగా వ్యాపారం పెరిగిందని అంచనా వేస్తున్నారు. ట్రావెల్స్ వాహనాలు రోడ్లపై భారీగా తిరుగుతున్నాయి. ఇక ఇంటింటి ప్రచారంలో కార్యకర్తలు సమర్పించే పూల దండలు, కురిపిస్తున్న పూలవర్షంతో అభ్యర్థులు తడిసి ముద్దవుతున్నారు. దీంతో పూలు, పండ్ల వ్యాపారం జోరుగా జరుగుతోంది. మైక్, టెంట్ హౌస్‌ల గిరాకీ మామూలుగా లేదు.

కేటరింగ్ వ్యాపారులకు గిరాకీ...

పార్టీ, ఎన్నికల ఆఫీసులు, వివిధ పార్టీ నాయకుల ఇళ్ల వద్ద నిత్యం అన్నదానాల మాదిరి భోజనాలు పెడుతున్నారు. ప్రచారానికి వచ్చే కార్యకర్తలకు అక్కడే టిఫిన్, మధ్యాహ్నం రాత్రి భోజనం పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు ఎన్నికల నాటి వరకు కేటరింగ్‌లను బుక్ చేసుకున్నారు. చాలామంది అభ్యర్థులు నిత్యం మాంసాహారంతోనే భోజనం పెడుతూ ఉత్సాహపరుస్తున్నారు. దీంతో కేటరింగ్ వ్యాపారుల బిజినెస్ రెట్టింపైందని అంటున్నారు. చిన్నా పెద్ద రెస్టారెంట్లతో పాటు టిఫిన్ సెంటర్లు, మెస్‌లు, తోపుడు బండ్లు సైతం బిజీగా మారాయి. ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ అభ్యర్థులు స్థానిక ఓటర్లకు సైతం ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.

మరో(సారి) పొలిటికల్ 'సాగర సంగమం'!



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

ఏయే పార్టీల తరపున ఎవరెవరు పోటీ చేస్తున్నారో జాబితా పరిశీలిస్తున్నారు కేసీఆర్.

''అబ్బో..ఈసారి అందరూ టఫ్ క్యాండిడేట్లేనే!'' అన్నారు కేసీఆర్. అంతలో అక్కడే ఉన్న తెలంగాణ తల్లి..జాబితా పేజీల్ని గబగబా టర్న్ చేసి, గజ్వేల్, కామారెడ్డిల్లో కేసీఆర్ ఫొటో వేలితో చూపుతూ..''ఈయనా టఫ్ క్యాండిడేటే!'' అంది.

తీవ్ర ఉద్వేగానికి లోనయ్యాడు కేసీఆర్. ఆ వెంటనే 'వాగర్థావివ సంపృక్తౌ... వాగర్థ ప్రతిపత్తయే...జగతః పితరౌ వందే' శ్లోకం పూర్తి కాగానే థభ్ అంటూ ఓ సౌండ్! కేసీఆర్ రెండుకాళ్లూ గజ్వేల్, కామారెడ్డి మ్యాపుల్లో టచ్ కాగానే, దానికి సింకయ్యేలా వినిపించిందా థభ్ సౌండు!! ఆ వెంటనే సాధనను (ప్రచార సాధనను) తీవ్రతరం చేస్తూ..బహిరంగసభలో మైకు ముందు ఓ గంభీర భంగిమ. కెమెరాలో-యాంగిల్లో షాట్ తీస్తుండగా... 'కైలాసాన... కార్తీకాన' సాంగ్ స్టైల్లో ఆయన క్యాంపెయినింగ్ ఇలా సాగింది...

గజ్వేల్లోన... కామారెడ్డిన జయదీపం
అలుపేరాని, సొలుపేలేని క్యాంపెయినింగ్...
గెలుపే ఖాయం... దనిసరి సనిస...
విజయమే తథ్యం... దనిసరి సనిస
గెలుపే ఖాయం, విజయము తథ్యం...
గెలుపునకు యత్నం విజయపు పయనం
గెలుపు కొరకే కేసీఆర్ శక్తియుక్తి ప్రయత్నం...
ధిరన ధిరన నన... తకిట తకిట ధిమి...
ధిరన ధిరన నన... తకిట తకిట ధిమి...

''ఆయన పొరుగింటి నుంచి వచ్చినాయన. ఆయనేమీ మన పార్టీని ఉద్ధరించనక్కర్లేదు. మా పార్టీని మేమే చక్కదద్దుకోగలం'' అంటూ... గోడకున్న ఇందిరాగాంధీ, రాజీవ్‌ల ఫొటోలు తీసుకుని బయల్దేరారు కొందరు నేతలు..అచ్చం కోపం తెచ్చుకుని బయల్దేరిన శైలజలా! సోనియాగాంధీ బేలగా మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకలవైపు చూసింది. అంతే.. ఆ వెంటనే రంగంలోకి దిగారు.

''అసమ్మతినేతలూ..బ్యాగులు సర్దుకోండి. మనం పక్క స్టేషన్‌లో దిగి..స్ట్రెయిట్‌గా ప్రచారానికి వెళ్లబోతున్నాం'' అన్నారు. ''కుదర్దు'' అని వాళ్లు అనగానే.. శైలజను చెంపదెబ్బ కొట్టిన శరత్‌బాబులాగా.. ఖర్గే, రాహుల్, ప్రియాంకలు వాళ్లకు క్లాసు తీసుకున్నారు. అంతే..వాళ్లలోనూ విపరీతమైన రిపెంటెన్స్. వెంటనే సాంగ్ స్టార్ట్స్...

ఎదురాయె పొరుగింటి రేవంత్
ఇపుడాయె మన ఇంటి రేవంత్
గురుతొచ్చె మన ఇంటి పోరూ
తెలివొచ్చి సరిదిద్దే తీరూ...
తెలంగాణ పాదాన తలవాల్చనా...
విజయాభిషేకాన తరియించనా...
కాంగ్రెస్..అణువణువున కాఆఆఆంగ్రెస్...

అంటూ మునపటి అసంతృప్త కాంగ్రెస్ శ్రేణుల్లో ఇప్పుడు తెగ పశ్చాత్తాపం.

ఇక బీజేపీ వాళ్లలో ఎలాగూ మెండైన దైవభక్తి ఉండనే ఉంది. దాంతో బ్యాక్‌గ్రౌండ్‌లో ''జై శ్రీ గణేశ..జై శ్రీ గణేశ..జై గణేశ..జై గణేశ.. దేవి సరస్వతి..మా సరస్వతి నమో..నమో' అనే పాట వస్తుండగా, ఖైరతాబాద్ పెద్ద గణేశుడి ముందు కమల్‌హాసన్ చేసినట్టుగా నాట్యంతో ప్రార్థనలవీ చేసి, ఆ వెంటనే ప్రచారానికి బయల్దేరారు.

కమ్యూనిస్టులు కూడా ప్రస్తుతం తామున్న స్థితిని...హాస్పిటల్‌లో బెడ్ మీద పడుకున్న కమల్‌హాసన్‌తో పోల్చుకున్నారు. కమల్ తన చేయి లాక్కోగానే 'ఎర్రటి' రక్తం తెల్లటి తలగడను తడిపిన సీన్‌ను తలచుకుని, ఆ వెంటనే..''అభ్యర్థులూ..టైమ్ లేదు. ఇది మీకూ, నాకూ పరీక్షే'' అంటూ ప్రచారానికి ఉపక్రమించారు.

క్లైమాక్స్‌లో తొలుత 'ఎండ్' అని పడింది.

కాస్త ఆగగానే..'నో' అని పడి... అది 'నో ఎండ్' అయ్యింది.

ఎట్టకేలకు ''నో ఎండ్ టు ద పాలిటిక్స్'' అనే ఎండ్ కార్డ్ పడుతుండగా...

ఈ సీన్లన్నింటినీ చూస్తున్న ప్రేక్షకుడు... తన ఓటరు బాధ్యత అకస్మాత్తుగా గుర్తొచ్చి, కుర్చీలోంచి లేచి, ఓటేయడానికి పోలింగ్ బూత్ వైపుగా సాగిపోసాగాడు.

గనులు రావాలి.. ఉపాధి కావాలి

భాషబోయిన అనిల్‌కుమార్

తెలంగాణ కొంగుబంగారం సింగరేణి ప్రతి ఎన్నికల్లోనూ కీలక భూమిక పోషిస్తుంది. గోదావరి తీరం వెంబడి ఉన్న సింగరేణి ప్రాంతంలోని నియోజకవర్గాల్లో కార్మికులు, వారి కుటుంబసభ్యుల మెజారిటీ ఓట్లను తమ వైపు తిప్పుకున్నా అభ్యర్థులే గెలుపుబావుటా ఎగరవేస్తుంటారు. 11 నియోజకవర్గాల పరిధిలోని 11 డివిజన్లలో 70 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో 42 వేల మంది రెగ్యులర్, 28 వేల మంది కాంట్రాక్టు కార్మికులున్నారు. రామగుండం, మంథని, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, చెన్నూరు, భూపాలపల్లి, కొత్తగూడెం, ఇల్లందు, పినపాక, సత్తుపల్లి నియోజకవర్గాల్లో సింగరేణి కార్మికులు ఎక్కువగా ఉండే కాలనీల్లో అన్ని పార్టీలూ ఉధృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. అయితే ఎన్నికల వేళ మాత్రమే సింగరేణి కార్మికులు గుర్తుకు వస్తున్నారని, గెలిచాక పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లు, సమస్యలను పరిష్కరించే పార్టీలకే ఈసారి మద్దతిస్తామని చెబుతున్నారు.



సింగరేణి విస్తరణ, కొత్తగనుల ఏర్పాటుకు కార్మికుల పట్టు	కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్.. వేతనాల పెంపు	మారు పేర్లకు చట్టబద్ధత.. ఆదాయ పన్ను తగ్గింపు	రాష్ట్రవ్యాప్తంగా సింగరేణి కార్మికుల డిమాండ్లివే	పట్టించుకున్న పార్టీకే పట్టం కడతామంటున్న ఓటర్లు

ఇంకా నెల పెన్షన్ 350 రూపాయలే

రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లను కాలానుగుణంగా సవరిస్తున్నప్పటికి బొగ్గు కార్మికులు ఆ భాగ్యానికి నోచుకోవడం లేదు. బొగ్గు పరిశ్రమల ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ స్థాయి రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికుల కోసం 'కోల్ మైన్స్ పెన్షన్ స్కీం-1998' అనే పేరుతో కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నారు. 25 ఏళ్ల కింద ప్రారంభించినా నేటికి పెన్షన్లు సవరించకుండా, పదవీ విరమణ చేసిన సమయంలో ఖరారు చేసిన పెన్షన్‌నే చెల్లిస్తున్నారు. దీంతో నామమాత్రపు పెన్షన్ పొందుతున్నారు. దేశవ్యాప్తంగా 46,048 మందికి నెలకు రూ.350లోపే పెన్షన్ వస్తుండటంతో రిటైర్డ్ ఉద్యోగులు దుర్భర జీవనం కొనసాగిస్తున్నారు.

ఆదాయ పన్ను తగ్గింపేది..

ఆరోవేజ్ బోర్డు వేతనాల పెరుగుదల ఎక్కువ కావడంతో సింగరేణి కార్మికులు ఆదాయ పన్ను పరిధిలోకి వచ్చారు. దీనికి తోడు కార్మికులకు చెల్లించే అద్దెను కూడా వేతనంలోనే చూపిస్తున్నారు. దీంతో 2 నుంచి 4 నెలల వేతనం ఆదాయ పన్ను రూపంలో చెల్లించాల్సి వస్తుండటంతో వారు ఆవేదన చెందుతున్నారు.

మరికొన్ని డిమాండ్లు ఇవే..

- సింగరేణి కార్మికులకు 200 గజాల ఇంటి స్థలం కేటాయించాలి లేదా క్వార్టర్ పర్మినెంట్‌గా ఇవ్వాలి
- సంస్థలో పనిచేస్తున్న వారికి ఇన్‌కమ్‌ట్యాక్స్ మినహాయించాలి
- కార్మికుల పిల్లలకు సీబీఎస్ఈ విధానంలో విద్య బోధించాలి
- కార్మికుల హెల్త్‌ఎమర్జెన్సీ రెఫరల్ ఆన్‌లైన్‌లో క్షణాల్లో కార్పొరేట్ వైద్యం అందేలా చూడాలి
- అన్ని వ్యాధులకు సీపీఆర్ఎంఎస్ కార్డు వర్తించేలా చేయాలి
- సింగరేణి అన్ని ఏరియాల్లో జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, స్కానింగ్ డాక్టర్లు ఉండాలి
- రిటైర్డ్ కార్మికులకు ఏరియా ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించాలి
- వారసుల వయోపరిమితి 35 నుండి 40 ఏళ్లకు పెంచాలి

అందని హైపవర్ వేతనాలు

సింగరేణి వ్యాప్తంగా సుమారు 35 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పలు విభాగాల్లో పనిచేస్తున్నారు. పర్మినెంట్ చేయాలని, కోలిండియా మాదిరిగా హైపవర్ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రధానంగా వారి డిమాండ్లు ఏమంటే..

- ప్రైవేటీకరణను రద్దు చేయాలి
- మందమర్రిలోని శ్రావన్‌పల్లి, కేకే6 ఓసీపీలు, ఇల్లందు డివిజన్‌లో కోయగూడెం ఓసీపీ3, సత్తుపల్లి ఓసీపీ3లను బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్‌కు కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. వీటిని తక్షణమే ప్రైవేటీకరణ రద్దు చేసి, సింగరేణి ద్వారానే బొగ్గు వెలికితీత చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.
- నేటికీ పరిష్కారం కాని మారు పేర్ల సమస్య
- సింగరేణిలో చాలామంది కార్మికులు గతంలో అలియాస్ పేర్లతో విధులు నిర్వర్తించేవారు. అప్పట్లో యాజమాన్యం కూడా దీనిని పెద్దగా పట్టించుకోలేదు. ఈ సమస్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రభుత్వాల దృష్టిలో ఉన్నదే. తెలంగాణ అవిర్భవించాక రెండు పేర్లు ఉన్న కార్మికుల ప్రయోజనాలు పరిరక్షిస్తామని సీఎం హామీ ఇచ్చినా న్యాయపరమైన చిక్కులతో నెరవేరలేదు. దీంతో రిటైర్డ్ కార్మికులు, వితంతువులు కూడా పెన్షన్ పొందేందుకు ఇబ్బందిగా మారింది. కారుణ్య నియామకాల్లో సైతం మారు పేర్ల సమస్యతో ఉద్యోగాలు దక్కడం లేదు.

బినామీ పేర్లను సవరించాలి



సింగరేణిలో బినామీ పేర్లతో పనిచేస్తున్న కార్మికుల పేర్లను సవరించాలి. ఆదాయపన్నును మాఫీ చేయడం లేదా స్లాబ్ పెంపు అమలుకు చట్టసవరణ చేయాలి.

– తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు

రాజకీయ జోక్యం పెరిగింది



సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగింది. కార్మికసంఘాల ఉనికి పూర్తిగా తగ్గిపోయింది. హామీలతో మభ్యపెట్టకుండా, మహిళ, బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ మాదిరిగా సింగరేణి కార్మికుల సమస్యలపై అన్ని పార్టీలు డిక్లరేషన్ ప్రకటించాలి.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 158/A, Nadipalli Village, Dichpalli Mandal, Nizamabad Dist - 503 175, TG, Printed at Jagati Publications Limited Survey No 158/A, Nadipalli Village, Dichpalli Mandal, Nizamabad Dist - 503 175, TG, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) 08461 - 222645, 222646, 222647, Fax: 08461 - 222649. RNI Regn No. TELTEL/2008/23795.